

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI



ఆదివారం | 19-5-2024 | పేజీలు: 12 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 33 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, వైశాఖమాసం, శుక్లపక్షం; తిథి: ఏకాదశి మ. 1.50 తదుపరి ద్వాదశి; నక్షత్రం: హస్త తె. 3.16 తదుపరి చిత్త; వర్జ్యం: ఉ. 9.47-11.35; దుర్ముహూర్తం: సా. 4.54-5.46; అమృతఘడియలు: రా. 8.32-10.20; రాహుకాలం: సా. 4.30-6.00; సూర్యోదయం: 5.45; సూర్యాస్తమయం: 6.37 | విజయవాడ సిటీ**
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru


నుజ్జునుజ్జయిన కారు.. బాధితులు, మృతులు

పెళ్లి దుస్తులు కొనేందుకు వెళ్లి..

- ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురి మృతి
- అనంతపురం జిల్లాలో ఘోర ప్రమాదం
- డివైడర్‌ను ఢీకొట్టి లారీ కిందకు దూసుకెళ్లిన కారు
- రేకు చొచ్చుకెళ్లి పెళ్లికొడుకు తల, మొండెం వేర్వేరు
- తండ్రి, సోదరుడి భార్య, పిల్లలూ మృతి

12

22న అల్పపీడనం

- వాయుగుండంగా మారుతుందని అంచనా
- 48 గంటల్లో అండమాన్‌కు నైరుతి రుతుపవనాలు
- 1న కేరళను తాకుతాయని స్కైమెట్ అంచనా
- పొడిగాలుల ప్రభావంతో 23 నుంచి 25 వరకు ఎండలు తీవ్రం

12

టీఎస్ఎప్‌సెట్‌లో టాపర్లు మనోళ్లే

- ఇంజనీరింగ్ టాపర్‌గా శ్రీకాకుళం విద్యార్థి
- అగ్రికల్చర్-ఫార్మసీ టాపర్‌గా మదనపల్లి అమ్మాయి
- టాప్-10లో ఐదుగురు రాష్ట్ర విద్యార్థులే

11

నిగ్గు తేలుస్తారా

క్షేత్రస్థాయిలో రంగంలోకి దిగిన సిట్ బృందాలు

పోలింగ్ తర్వాత హింసాత్మక ఘటనలపై దర్యాప్తు

మాచర్ల, పేట, తాడిపత్రి, తిరుపతిలో పర్యటన

- అల్లర్లు జరిగిన ప్రాంతాల్లో అధికారుల విచారణ
- పలు పోలీస్ స్టేషన్లలో ఎఫ్ఐఆర్‌ల పరిశీలన
- వైసీపీకి వంతపాడిన పోలీసుల గురించి దర్యాప్తు
- రెచ్చిపోయిన పోలీసులపై వేటు తప్పదనే చర్చ
- కొమ్ముకాసిన ఖాకీల వెన్నులో వణుకు!


అనంతపురం జిల్లా తాడిపత్రి పట్టణంలోని ఓంశాంతి నగర్‌లో సిట్, స్థానిక పోలీసు అధికారులు

అమరావతి(ఆంధ్రజ్యోతి)/తాడిపత్రి టౌన్/నరసరావుపేట, మే 18: పోలింగ్ రోజు, ఆ తర్వాత జరిగిన హింసాత్మక ఘటనల్లో పోలీసు అధికారుల పాత్ర, విధి నిర్వహణలో నిర్లక్ష్యంపై సిట్ కూపీ లాగుతోంది. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి ఏకపక్షంగా వ్యవహరించిన అధికారుల తీరుపై విచారిస్తోంది. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు శుక్రవారం సాయంత్రం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) శనివారం క్షేత్రస్థాయిలో

మిగతా 11వ పేజీలో...


మాలికా గార్గ్ | గౌతమి శాలి | హర్షవర్ధన్ రాజు

3 జిల్లాలకు కొత్త ఎస్పీలు

- పల్నాడు, అనంత, తిరుపతి ఎస్పీలుగా మాలికా గార్గ్, గౌతమి శాలి, హర్షవర్ధన్ రాజు
- ఈసీ ఆదేశాలతో మరో 4 పేర్లు పంపిన సీఎస్

11

గిట్టకపోతే వేటేయడమే!

- ఎన్నికల హింసపై చర్యల్లో ఆశ్రిత పక్షపాతం
- అస్మదీయులకు రక్షణ కవచంలా సీఎస్
- పల్నాడు కలెక్టర్ బదిలీకి సిఫారసు
- తిరుపతి, అనంత కలెక్టర్లను కదిలించని సర్కారు

4 గంటలు ఆలస్యంగా జగన్ లండన్‌కు



- ల్యాండింగ్‌కు అనుమతి లేక తొలుత ఆమ్‌స్టర్‌డ్యామ్‌కు
- ఆ తర్వాత లండన్‌కు విమానం

11

వైద్య పరీక్షల కోసం అమెరికాకు చంద్రబాబు

అమరావతి, మే 18(ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబు శనివారం అర్ధరాత్రి హైదరాబాద్ నుంచి అమెరికా బయలుదేరి వెళ్లారు. ఆయన వెంట సతీమణి భువనేశ్వరి కూడా ఉన్నారు. వైద్య పరీక్షల నిమిత్తం ఆయన అమెరికా వెళ్లినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఆయన గతంలోనూ అమెరికాలో వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఐదారు రోజుల్లో ఆయన తిరిగి రానున్నారు. ఆయన కుమారుడు లోకేశ్ కూడా అమెరికా వెళ్లారు.

ఎన్నికల్లో ప్రచారం చేశారని ఏయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ సస్పెన్షన్!

విశాఖపట్నం, మే 18(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ప్రచారం నిర్వహించారంటూ ఏయూ కంప్యూటర్ సైన్స్ విభాగ అసిస్టెంట్ ప్రొఫెసర్ జి.లావణ్యదేవిని సస్పెండ్ చేస్తూ వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.జేమ్స్ స్టీఫెన్ 8న ఈ ఆదేశాలు జారీచేశారు. విశాఖపట్నం 76వ వార్డులో 4న ఆమె ప్రచారం నిర్వహించారని సస్పెన్షన్ ఆర్డర్‌లో పేర్కొన్నారు. లావణ్యదేవి గాజువాక టీడీపీ అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు సతీమణి. భర్త పోటీ చేస్తున్న నేపథ్యంలో తనకు ఎన్నికల విధుల నుంచి మినహాయింపు కోరుతూ ఎన్నికలకు ముందే ఆమె డీఆర్వోకు విజ్ఞాపన పెట్టుకున్నారు.

లోకం తీరు



కాంగ్రెస్ హిందూ వ్యతిరేక పార్టీ కాదు


శనివారం అమేఠీలో ప్రియాంక ఎన్నికల ప్రచారం

న్యూఢిల్లీ, మే 18: కాంగ్రెస్ హిందూ వ్యతిరేక పార్టీ కానే కాదని ఆ పార్టీ జాతీయ ప్రధానకార్యదర్శి ప్రియాంకా గాంధీ స్పష్టం చేశారు. మహాత్మాగాంధీ నోట వెలువడిన చిట్టచివరి పదాలు 'హే రామ్'.. కాంగ్రెస్ పార్టీ హిందుత్వ మూలాలకు నిదర్శనమని తేల్చిచెప్పారు. శనివారం ఇండియా టుడే టీవీ చానల్ ఇంటర్వ్యూలో ఆమె ఈ విషయాలను వెల్లడించారు. 'బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మాపై హిందూ వ్యతిరేక పార్టీ అనే ముద్ర వేశారు. మా పార్టీకి అతిపెద్ద నేత ఎవరు? మహాత్మాగాంధీ. మహాత్మాగాంధీని తుపాకీతో కాల్చినప్పుడు ఉచ్చరించిన చివరి పదాలు హే రామ్.. మరి మేం హిందూ వ్యతిరేక పార్టీ ఎలాగవుతాం? కానేకాదు' అని ప్రియాంక పేర్కొన్నారు. అయోధ్యలో రామ మందిర ప్రాణప్రతిష్ఠ కార్యక్రమానికి పార్టీ నేతలు హాజరుకాకపోవడాన్ని ఆమె సమర్థించుకున్నారు. ఈ అంశాన్ని బీజేపీ రాజకీయ కోణంలో చూస్తోందని విమర్శించారు. దేశవ్యాప్తంగా పార్టీ ప్రచారంపై దృష్టి పెట్టేందుకే తాను ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయట్లేదని ప్రియాంక తెలిపారు. రాహుల్‌గాంధీ, తాను ఇరువురూ ఎన్నికల్లో పోటీ చేస్తే బీజేపీకే మేలు జరుగుతుందన్నారు. 'మేమిద్దరమూ ఎన్నికల్లో పోటీ చేస్తే.. మా నియోజకవర్గాలకే 15 రోజుల చొప్పున కేటాయించాల్సి వచ్చేది. అప్పుడు దేశవ్యాప్త ప్రచారానికి ఇద్దరమూ అందుబాటులో ఉండకపోతే బీజేపీకి మేలు జరుగుతుంది. అందుకే ఒకరు దేశవ్యాప్తంగా ఎన్నికల ప్రచారంలో ఉంటూ బీజేపీని ఎదుర్కోవాలని నిర్ణయించాం' అన్నారు. భవిష్యత్తులోనైనా ఎన్నికల్లో పోటీ చేస్తారా? అని ప్రశ్నించగా, 'నేను పోటీ చేయాలని పార్టీలోనివారు భావిస్తే.. అప్పుడు పోటీ చేస్తా' అని చెప్పారు. కాగా, యూపీలోని రాయ్‌బరేలీ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ ఈ నియోజకవర్గాన్ని ఉద్దేశించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రాయ్‌బరేలీ మరోసారి ఈ దేశానికి, ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి ప్రగతి దారి చూపాలని వ్యాఖ్యానించారు. గతంలో ఈ నియోజకవర్గం సైద్ధాంతిక, రాజకీయ కేంద్రంగా వ్యవహరించిందని తెలిపారు. తన సోదరి ప్రియాంక గాంధీ వాద్రాతో కలిసి చేసిన 4 నిమిషాల నిడివి ఉన్న వీడియోను ఆయన ఎక్స్(ట్విట్టర్)లో పోస్టు చేశారు.

> రాహుల్ ఎప్పుడూ ప్రజల్లోనే ఉన్నారు. దేశం గుండె చప్పుడు ఆయనకు తెలుసు. అందుకే మంచి ప్రధాని అవుతారు. అయితే, ఎన్నికలు ముగిశా ఇండియా కూటమి దీనిపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది.
> -ప్రియాంక

గాంధీల కోటపైనే అందరి కళ్లు!

ఐదోవిడతలో రాయ్‌బరేలీ, ఆమేఠీ.. యూపీలో 14సీట్లకు పోలింగ్

- 2019లో ఆమేఠీ సహా 13 సీట్లు బీజేపీ సొంతం.. రాయ్‌బరేలీలో కాంగ్రెస్ గెలుపు
- ఈసారి రాయ్‌బరేలీపైనా బీజేపీ గురి
- ఇక్కడ రాహుల్‌గాంధీ పోటీతో ఆసక్తి
- రేపు 49స్థానాలకు ఐదోవిడత పోలింగ్



న్యూఢిల్లీ, మే 18 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికలు ముగింపునను వస్తున్నాయి. ఈ నెల 20వ తేదీన ఐదో విడతలో 49 స్థానాలకు ఎన్నికలు జరుగుతుండగా, అందులో 14 నియోజకవర్గాలు ఉత్తరప్రదేశ్‌లో ఉన్నాయి. గాంధీల కుటుంబంతో ముడిపడిన రాయ్‌బరేలీ, ఆమేఠీలకు ఈ విడతలోనే ఎన్నికలు జరగనున్నాయి. దీంతో ఈ విడత ఎన్నికలు దేశం దృష్టిని ఆకట్టుకుంటున్నాయి. అలాగే.. గత ఎన్నికల్లో ఒక్క రాయ్‌బరేలీని తప్ప తక్కిన 13 సీట్లనూ యూపీలో బీజేపీ కైవసం చేసుకోవడం మరో విశేషం. అలాంటిదే మరో ముఖ్యమైన సీటు లఖనవూ. 2019 నాటి ఊపును ఈసారీ కొనసాగించడంతోపాటు రాయ్‌బరేలీని కూడా దక్కించుకోవాలని బీజేపీ పట్టుదలతో ఉంది. మోదీ గ్యారంటీలు, ఉచిత రేషన్, రామ మందిరం వంటి అంశాలు తమకు కలిసివస్తాయని ధీమాతో ఉంది. అయితే, అదంత ఈజీ కాదని రాయ్‌బరేలీ రాజకీయ చరిత్రను చూస్తేనే తెలుస్తుంది. స్వాతంత్ర్యానంతర భారతదేశంలో రాయ్‌బరేలీ పేరు గాంధీల కుటుంబంతో ముడిపడిపోయింది. ఇన్నాళ్లలో మూడుసార్లు తప్ప (1977, 1996, 1998) ప్రతిసారీ గాంధీలే కేతనం ఎగురవేశారు. 20 ఏళ్లపాటు సోనియాగాంధీ ఇక్కడినుంచి పార్లమెంటుకు ఎన్నిక అవుతూ వచ్చారు. ఇప్పుడు తన కుమారుడు రాహుల్‌ను ఇక్కడ నిలిపారు. 'నా బిడ్డను మీకు అప్పగిస్తున్నాను' అంటూ రాయ్‌బరేలీ ప్రజలతో సోనియా అనడం ఈ నియోజకవర్గంతో గాంధీల కుటుంబానికి ఉన్న భావోద్వేగ బంధానికి నిదర్శనం. ఈ గాంధీల కోటపైనే బీజేపీ గురిపెట్టి ప్రచారాన్ని ఉధృతం చేసింది. కమలం పక్షాన రాష్ట్ర మంత్రి దినేశ్ ప్రతాప్ సింగ్ పోటీలో ఉన్నారు. అయితే, గాంధీల విజయం రాయ్‌బరేలీలో పక్కా అని, మెజారిటీ ఎంత అనేదే తెలియాల్సి ఉన్నదని ఓ రిక్షా కార్మికుడు అనడం గమనార్హం. కాంగ్రెస్ పార్టీకి ఎదురుగాలి పెద్దఎత్తున వీచిన 2019 ఎన్నికల్లోనూ సోనియా 1.67 లక్షల భారీ మెజారిటీతో గెలిచారు.

'కూటమి'పైనే కాంగ్రెస్ భారం..

ఐదో విడతలో బీజేపీపై పోరుకు ఇండియా కూటమిపార్టీలపైనే కాంగ్రెస్ ఆధారపడనుంది. ఈ విడతలో మొత్తం 49 స్థానాలకుగాను, కాంగ్రెస్ కేవలం 18 చోట్ల మాత్రమే పోటీ చేస్తోంది. మిగతా స్థానాలలో కూటమి పార్టీలైన శివసేన(యూబీటీ), ఎస్పీ, ఆర్జేడీ, ఎన్సీపీ(శరద్‌పవార్) తమ అభ్యర్థులను బరిలో నిలిపాయి. ఇక బీజేపీ 40 చోట్ల పోటీ చేస్తోంది. మిగతా చోట్ల శివసేన(షిండే), ఇతర ఎన్డీఏ పక్షాలు బరిలో ఉన్నాయి. కాగా, జమ్మూలోని బారాముల్లాకు బీజేపీ దూరంగా ఉంది. ఆర్టికల్ 370తో జమ్మూకశ్మీర్‌లో తమపార్టీకి సానుకూల పవనాలున్నాయని బీజేపీ నేతలు చెబుతున్నప్పటికీ ఇక్కడ అభ్యర్థిని ప్రకటించకపోవడం గమనార్హం. ఇక.. మహారాష్ట్ర(13), పశ్చిమబెంగాల్(7), బిహార్, ఒడిశా(5), జార్ఖండ్(3), లద్దాఖ్(1) స్థానాల్లో మొత్తం 695 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు.

బరిలో ప్రముఖులు..

బిహార్‌లోని సరన్ నుంచి ఆర్జేడీ అధినేత లాలూ కుమార్తె రోహిణి ఆచార్య, హాజీపూర్ నుంచి రాంవిలాస్ పాశ్వాన్ చిరాగ్, ముంబై నార్త్ నుంచి కేంద్ర మంత్రి గోయల్, ముంబై నార్త్ సెంట్రల్ బరిలో.. ముంబై దాడుల కేసులో స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఉజ్వల్ నికమ్ బీజేపీ తరపున బరిలో ఉన్నారు. బారాముల్లాలో ఒమర్ అబ్దుల్లా పోటీ చేస్తున్నారు.

గాంధీలు దూరం..

ఆమేఠీ మరో కాంగ్రెస్ కంచుకోట. అయితే, ఈసారి గాంధీలు ఆమేఠీకి దూరంగా ఉన్నారు. గత ఎన్నికల్లో రాహుల్‌ను కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ ఓడించి.. గాంధీల పరంపరకు గంటికొట్టారు. ఈసారి గాంధీలు ఆమేఠీకి దూరంగా ఉన్నారు. కాంగ్రెస్ తరపున కేఎల్ శర్మ పోటీలో ఉన్నారు. ఆమేఠీలోనూ, రాయ్‌బరేలీలోనూ ప్రచారాన్ని ప్రియాంక తన భుజాలపై వేసుకుని.. ప్రతిష్ఠాత్మక విజయం కోసం శ్రమిస్తున్నారు. మరోవైపు.. స్మృతి ఆమేఠీలో బీజేపీకి మరోసారి విజయం అందించడానికి చెమటోడుస్తున్నారు. ఇక..సీనియర్ కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ లఖనవూలో హ్యాట్రిక్ విజయంపై కన్నేశారు. ఇక.. కైసర్‌గంజ్ సీటు ఇటీవలి వివాదాల కారణంగా అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. మహిళా రెజ్లర్ల ఆగ్రహానికి, ఢిల్లీ ఆందోళనలకు కేంద్ర బిందువుగా ఉన్న రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా మాజీ అధ్యక్షుడు, కైసర్‌గంజ్ సిట్టింగ్ ఎంపీ బ్రిజ్ భూషణ్ సింగ్‌కు బీజేపీ సీటు నిరాకరించింది. ఆయన కుమారుడు కరణ్ భూషణ్ సింగ్‌ను బరిలోకి దింపింది.

ఇంటి నుంచి ఓటేసిన
మన్మోహన్, ఆడ్వాణీ
హమీద్ అన్సారీ, మనోహర్ జోషి కూడా

న్యూఢిల్లీ, మే 18: మాజీ ఉపరాష్ట్రపతి హమీద్ అన్సారీ, మాజీ ప్రధాని మన్మోహన్, బీజేపీ సీనియర్ నేతలు ఎల్‌కే ఆడ్వాణీ, మురళీ మనోహర్ జోషి తమ తమ ఇళ్ల దగ్గర నుంచే ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఢిల్లీలోని ఏడు లోక్‌సభ స్థానాలకు 25న పోలింగ్ జరగనుంది. ఈ నేపథ్యంలో ఎన్నికల సిబ్బంది పోలింగ్ బూత్‌లకు రాలేని వృద్ధులు, దివ్యాంగుల ఇళ్లకు వెళ్లి ఓట్లు వేయిస్తున్నారు. ఈ ప్రక్రియ గురువారం ప్రారంభమైంది. మే 24వరకు జరగనుంది. అన్సారీ గురువారమే ఓటు వేయగా, శుక్రవారం మన్మోహన్, మనోహర్ జోషి, శనివారం ఆడ్వాణీ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరంతా న్యూఢిల్లీ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి బరిలో ఉన్న అభ్యర్థులకు ఓటు వేశారు.



మా వల్లే పాక్ భిక్షాపాత్రతో తిరుగుతోంది

- మనకు కీడు తలపెట్టాలంటే వందసార్లు ఆలోచిస్తారు
- హరియాణా ఎన్నికల ర్యాలీలో ప్రధాని మోదీ వ్యాఖ్యలు



న్యూఢిల్లీ, మే 18: గత డెబ్బయి ఏళ్లుగా చేతిలో బాంబులు పెట్టుకొని బెదిరించిన పాకిస్థాన్ ఇప్పుడు భిక్షాపాత్ర పట్టుకొని తిరుగుతోందని ప్రధాని మోదీ అన్నారు. గత పదేళ్లుగా కేంద్రంలో బలమైన ప్రభుత్వం ఉండటం వల్లే ఇది సాధ్యమైందని చెప్పారు. హరియాణాలోని అంబాలాలో శనివారం జరిగిన బీజేపీ ఎన్నికల ర్యాలీలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బలమైన ప్రభుత్వం ఉంటే శత్రువులు కూడా ఏదన్నా చేయాలంటే వంద సార్లు ఆలోచిస్తారని చెప్పారు. తమది బలమైన ప్రభుత్వం కాబట్టే ఆర్టికల్ 370 గోడలు బద్దలు కొట్టామని వ్యాఖ్యానించారు. కేంద్రంలో బలహీనమైన ప్రభుత్వం ఉంటే జమ్మూ కశ్మీరు పరిస్థితిని మార్చగలిగేదా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో హరియాణాకు చెందిన సైనిక యోధుల తల్లుల కంటి మీద కునుకు ఉండేది కాదన్నారు. గత పదేళ్లుగా ఉగ్రవాదుల కార్యకలాపాలు ఆగిపోయాయని చెప్పారు. ఆర్టికల్ 370ని ధైర్యం చేసి రద్దు చేయడం వల్లే కశ్మీరు అభివృద్ధి పథంలో పయనిస్తోందని ప్రకటించారు. ఇండీ కూటమి దేశ వ్యతిరేకుల కూటమి అని మోదీ అభివర్ణించారు.

రాముడు కాంగ్రెస్‌ను అధికారంలోకి రానివ్వడు

అయోధ్యలోని బాల రాముడు కాంగ్రెస్‌ను అధికారంలోకి రానివ్వడని యూపీ సీఎం యోగి వ్యాఖ్యానించారు. శనివారం ఆయన ముంబయిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తాజా ఎన్నికలు రామ భక్తులకు, రామ ద్రోహులకు మధ్య జరుగుతున్నాయన్నారు. రాముడికి ఆలయం కట్టడంతో కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు తీవ్ర మనస్తాపానికి గురయ్యాయని వ్యాఖ్యానించారు. తాము అధికారంలోకి వస్తే అయోధ్యలో ఆలయాన్ని కూల్చేస్తామని కొందరు కాంగ్రెస్ నేతలు అంటున్నారని చెప్పారు.

బీబీసీపై రూ.10వేల కోట్లకు పరువు నష్టం దావా

- ప్రధానిపై తప్పుడు డాక్యుమెంటరీ రూపొందించినట్టు ఆరోపణ

న్యూఢిల్లీ, మే 18: గోద్రా అల్లర్లకు సంబంధించి ప్రధాని మోదీపై తప్పుడు డాక్యుమెంటరీని రూపొందించిందని ఆరోపిస్తూ గుజరాత్‌కు చెందిన జస్టిస్ ఆన్ ట్రయల్ అనే స్వచ్ఛంద సంస్థ బీబీసీపై రూ.10వేల కోట్లకు పరువు నష్టం దావా వేసింది. డాక్యుమెంటరీ భారత దేశ, న్యాయవ్యవస్థల ప్రతిష్ఠతో పాటు ప్రధాని మోదీ గౌరవానికి భంగం కలిగించిందని ఆరోపించింది. పరువు నష్టం దావా వేసే సమయంలో పరిహారం కోరిన మొత్తంలో నిర్దిత శాతాన్ని కోర్టులో డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. అయితే తమ సంస్థను 'నిరుపేద వ్యక్తి'గా పరిగణించి ఆ డిపాజిట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరింది. ఈ దావా శుక్రవారం న్యాయమూర్తి జస్టిస్ అనుప్ జైరాం భంభాని ధర్మాసనం ముందుకు వచ్చింది. ఈ విచారణ నుంచి తనను తప్పించి వేరే వారికి అప్పగించాలని ఆయన కోరారు.

మత స్వేచ్ఛను కాపాడతాం!

అయోధ్య నిర్మాణం పూర్తిచేస్తాం.. రామ మందిరం కూలుస్తామన్న మోదీ వ్యాఖ్యలు దారుణ అబద్ధాలు

- ఇండియా' కూటమి నేతల ఫైర్
- బుల్డోజర్ సంస్కృతి బీజేపీదేనని ఎద్దేవా



ముంబై, మే 18: ఇండియా కూటమి అధికారంలోకి వస్తే అయోధ్య రామమందిరాన్ని బుల్డోజర్‌తో నేలమట్టం చేస్తారన్న ప్రధాని మోదీ వ్యాఖ్యలపై కూటమి పార్టీల అగ్రనేతలు నిప్పులు చెరిగారు. అయోధ్య నిర్మాణాన్ని పూర్తి చేయడంతోపాటు దేశంలో మత స్వేచ్ఛను కాపాడతామని స్పష్టం చేశారు. తన అబద్ధాలతో మోదీ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐదో దశ ఎన్నికల ప్రచారం చివరి రోజైన శనివారం ఇండియా కూటమి అగ్రనేతలు కాంగ్రెస్ ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, శివసేన(యూబీటీ) అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రే, ఎన్సీపీ(ఎస్పీ) చీఫ్ శరద్ పవార్‌లు ముంబైలో సంయుక్త మీడియా సమావేశం నిర్వహించారు. ఖర్గే మాట్లాడుతూ.. రాజ్యాంగంలో పొందుపరిచిన రిజర్వేషన్లకు ఎలాంటి భంగం వాటిల్లదని, అవి అలానే కొనసాగుతాయని తెలిపారు. "మేం ఎవరి మీదా బుల్డోజర్ ప్రయోగించలేదు. బుల్డోజర్ సంస్కృతి బీజేపీదే. మోదీకి అబద్ధాలు చెప్పడం, ప్రజలను తప్పుదోవ పట్టించడం అలవాటైపోయింది" అని అన్నారు. "ఆయన(మోదీ) ఎక్కడికి వెళ్లినా సమాజాన్ని విభజించేలా మాట్లాడుతున్నారు" అని దుయ్యబట్టారు. "నా 53 ఏళ్ల రాజకీయ జీవితంలో ఇలాంటి ప్రధానిని ఎప్పుడూ చూడలేదు. సమాజాన్ని విభజించడం మోదీకి అలవాటుగా మారింది. విపక్షాలను విచ్ఛిన్నం చేసేందుకు బెదిరింపులు, బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు పాల్పడుతున్నారు" అని ఖర్గే నిప్పులు చెరిగారు. మహారాష్ట్రలోని 48 పార్లమెంటు స్థానాలకు 46 స్థానాలను ఇండియా కూటమి కైవసం చేసుకుంటుందన్నారు.

వారికి కూటమి వ్యతిరేకం కాదు

ఉద్ధవ్ ఠాక్రే మాట్లాడుతూ.. బీజేపీ నకిలీ పార్టీ అని, ఆర్ఎస్ఎస్ నకిలీ సంఘ్ అని దుయ్యబట్టారు. బీజేపీకి జన్మనిచ్చిన సంస్థను ఆ పార్టీ ఎప్పుడో వదిలేసిందని విమర్శించారు. జూన్ 4 నుంచి దేశానికి మంచి రోజులు రాబోతున్నాయని చెప్పారు. ఇండియా కూటమి హిందువులకు వ్యతిరేకం కాదని తేల్చి చెప్పారు. బీజేపీ తప్పుడు ప్రచారం చేస్తోందన్నారు.

మమత మాతోనే

బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తమతోనే ఉంటారని, ప్రభుత్వంలో భాగస్వామ్యం అవుతామని ఆమె ఇటీవలే చెప్పారని ఖర్గే వ్యాఖ్యానించారు. మమతను నమ్మలేమన్న అధిర్ రంజన్ చౌదరి వ్యాఖ్యలను ఆయన కొట్టిపారేశారు. అధిర్ ఎలాంటి నిర్ణయాలూ తీసుకునే స్థాయిలో లేరని వ్యాఖ్యానించారు. "ఈ విషయంపై నిర్ణయం తీసుకునేది నేను, లేదా హైకమాండ్. మా నిర్ణయాలతో ఏకీభవించలేని వారు బయటకు పోవచ్చు" అని అధిర్‌ను ఉద్దేశించి ఖర్గే అన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టో.. మావోయిస్టులదని వ్యాఖ్యానించిన ప్రధానిపై ఖర్గే మండిపడ్డారు. "మీ(మోదీ) సలహాదారు ఎవరండీ? ఇది హాస్యాస్పదం. ప్రజలను ప్రతిసారీ మోసం చేయలేరు" అని అన్నారు.

సుప్రీంను చేరిన ఎన్నికల పర్వం

- పోలింగ్‌శాతాల్లో తేడాలపై ఏడీఆర్ పిటిషన్
- తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఈసీ వాదనలు

న్యూఢిల్లీ, మే 18 (ఆంధ్రజ్యోతి): పోలింగ్ వివరాల వెల్లడిలో జాప్యం, ఓటింగ్ శాతాల ప్రకటనల్లో తేడాలపై అసోసియేషన్ ఆఫ్ డెమొక్రటిక్ రిఫామ్స్ (ఏడీఆర్), కామన్ కాజ్ అనే స్వచ్ఛంద సంస్థలు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. ఓటింగ్ వివరాల్లో ఇంత భారీ వ్యత్యాసం గతంలో ఎప్పుడూ లేదని, పోలింగ్ ముగిసిన రోజు సాయంత్రమే ఈసీ దాదాపు కచ్చితమైన వివరాలను వెల్లడించేదని వాదించాయి. మిగిలిన దశల ఎన్నికల్లోనైనా.. పోలింగ్ ముగిసిన సాయంత్రమే విలేకరుల సమావేశం నిర్వహించి ఓటింగ్ వివరాలు వెల్లడించేలా ఈసీని ఆదేశించాలని కోరాయి. వారు లేవనెత్తిన ప్రశ్నలకు ఈ నెల 24 లోపు సమాధానం ఇవ్వాలని సీజేఐ జస్టిస్ చంద్రచూడ్, జస్టిస్ జేబీ పర్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం శుక్రవారం ఈసీని ఆదేశించింది. ఈ పిటిషన్‌పై విచారణ సందర్భంగా.. అసలు పిటిషన్‌ను విచారణకు తీసుకోవద్దని ధర్మాసనాన్ని ఒప్పించటానికి ఈసీ తీవ్రంగా ప్రయత్నించింది. పిటిషన్‌పై విచారణ శుక్రవారం సాయంత్రం నాలుగు గంటలకు ప్రారంభమైనప్పుడు ఈసీ తరఫున న్యాయవాది అమిత్‌శర్మ ధర్మాసనం ముందు హాజరయ్యారు. పిటిషనర్లు కోరుకుంటున్నట్లుగా ఫామ్ 17 సీని (పోలింగ్‌బూత్‌ల వారీగా ఓటు వేసిన వారి సంఖ్య) ఈసీ వెబ్‌సైట్‌లో ఎందుకు అప్‌లోడ్ చేయలేరని సీజేఐ ప్రశ్నించారు. దీనికి శర్మ సమాధానమిస్తూ.. ప్రతీ నియోజకవర్గంలోని అన్ని పోలింగ్‌బూత్‌ల నుంచి ఫామ్ 17లను తెప్పించుకుంటామని, దానికి సమయం పడుతుందని, రాత్రికి రాత్రి అప్‌లోడ్ చేయలేమని చెప్పారు. దీనికి సీజేఐ స్పందిస్తూ.. సరే! మర్నాడు వస్తాయని అనుకుందాం.. మరి, అప్పుడైనా ఎందుకు అప్‌లోడ్ చేయరు అని ప్రశ్నించారు. తిరిగి సాయంత్రం 6 గంటలకు విచారణ కొనసాగినప్పుడు.. ఈసీ తరఫున సీనియర్ న్యాయవాది మణిందర్‌సింగ్ హాజరయ్యారు. ఈవీఎంలు సరైనవేనన్న సుప్రీంకోర్టు తీర్పును గుర్తు చేశారు. ఈ పిటిషన్‌పై మళ్లీ విచారణ అక్కర్లేదన్నారు. "ఇది ఎన్నికల ప్రక్రియను అడ్డుకొనే చర్య. ఇప్పుడు పిటిషనర్ల తరఫున న్యాయవాది ప్రశాంత్ వచ్చినంత మాత్రాన.." అంటుండగా సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ జోక్యం చేసుకున్నారు. "ఎవరు వచ్చారన్నది కాదు.. ప్రశాంత్ భూషణ్ ఒక పిటిషన్ వేశారు, దీనిపై ప్రత్యుత్తరం ఇవ్వాలా? వద్దా? అన్నది ఈసీ నిర్ణయించుకోవాలి" అని అన్నారు. దీంతో ప్రత్యుత్తరం దాఖలు చేస్తామని మణిందర్‌సింగ్ తెలిపారు. పిటిషన్‌పై విచారణను కోర్టు ఈ నెల 24వ తేదీకి ధర్మాసనం వాయిదా వేసింది.

మావాళ్లను తీసుకొస్తే మరో 'తాడిపత్రే'!

ప్రొద్దుటూరు, మే 18: 'మావాళ్లనే తీసుకొచ్చి కౌన్సిలింగ్ పేరిట బెదిరిస్తే ప్రొద్దుటూరు మరో తాడిపత్రి అవుతుంది' అని వైసీపీ ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాదరెడ్డి బావమరిది, కడప జిల్లా ప్రొద్దుటూరు మున్సిపల్ వైస్ చైర్మన్ బంగారు రెడ్డి సీఐని హెచ్చరించారు. వైసీపీకి చెందిన రౌడీషీటర్ నవీన్‌కుమార్, టీడీపీకి చెందిన పల్లేటి ప్రభాకర్‌రెడ్డిలను కౌన్సెలింగ్ కోసం వన్‌టౌన్ సీఐ శ్రీకాంత్‌యాదవ్ స్టేషన్‌కు పిలిపించారు. 4న ఓట్ల లెక్కింపు జరిగే వరకు ఘర్షణలు, కవ్వింపు చర్యలకు పాల్పడకుండా జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. విషయం తెలుసుకున్న బంగారు రెడ్డి సీఐకి ఫోన్ చేసి నవీన్‌కుమార్‌ను వదిలేయాలని కోరగా, కౌన్సెలింగ్ ఇచ్చి పంపుతామని సీఐ సమాధానం ఇచ్చారు. అనంతరం బంగారురెడ్డితో పాటు ఎమ్మెల్యే రాచమల్లు నేరుగా పోలీసుస్టేషన్‌కే వచ్చి సీఐతో వాగ్వాదానికి దిగినట్లు తెలిసింది. నవీన్‌కుమార్‌ను స్టేషన్ నుంచి ఎమ్మెల్యే తీసుకెళ్లిపోయారు.

మా కుటుంబంపై రాజకీయ కుట్ర: దేవెగౌడ

బెంగళూరు, మే 18(ఆంధ్రజ్యోతి): రాసలీలల వివాదంలో చిక్కుకున్న ప్రజ్వల్‌పై చట్టపరంగా ఎలాంటి చర్యలు తీసుకున్నా తమకు అభ్యంతరం లేదు అని జేడీఎస్ జాతీయ అధ్యక్షుడు, మాజీ ప్రధాని దేవెగౌడ తెలిపారు. తన 91వ జన్మదినం సందర్భంగా బెంగళూరులోని వెంకటేశ్వర ఆలయంలో శనివారం పూజలు జరిపించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ప్రజ్వల్ వివాదంపై తొలిసారి స్పందించారు. 'మా కుటుంబంపై రాజకీయ కుట్ర జరిగింది. కుట్రలో అనేకమంది పాత్ర ఉంది' అని దేవెగౌడ అన్నారు.

ఆధునిక పంథాలో సౌదీ

- తొలిసారి స్విమ్‌సూట్ ఫ్యాషన్ షో

న్యూఢిల్లీ, మే 18: ఛాందసవాద ఇస్లామిక్ దేశమైన సౌదీ అరేబియా.. కొంతకాలంగా ఆధునిక పంథాలో పయనిస్తోంది. యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్, ప్రగతిశీల ఆలోచనా ధోరణితో చేపట్టిన సంస్కరణలు, ఆ దేశాన్ని సరికొత్తగా ఆవిష్కరిస్తున్నాయి. తాజాగా మరో సంచలనానికి సౌదీ తెరతీసింది. మునుపెన్నడూ లేని విధంగా అక్కడ తొలిసారి 'స్విమ్ సూట్ ఫ్యాషన్' షో నిర్వహించారు. నిన్నమొన్నటిదాకా మహిళలు కళ్లు మినహా ఆపాదమస్తకం బురఖా(అబయా)లోనే కనిపించాలన్న నిబంధన ఉన్న సౌదీలో స్విమ్ సూట్లలో మోడళ్లు తళుకులీనారు. 'రెడ్ సీ ఫ్యాషన్ వీక్' పేరుతో సౌదీలోని పశ్చిమ తీరంలో సెయింట్ రేగిస్ రెడ్ సీ రిసార్ట్‌లో స్విమ్‌సూట్ ఫ్యాషన్ షో శుక్రవారం ప్రారంభమైంది. మొరాకోకు చెందిన డిజైనర్ యాస్మినా క్వాంజాల్ ప్రత్యేకంగా మోడల్స్ కోసం ఎరుపు, బీజ్, నీలం రంగుల్లో స్విమ్ సూట్లను రూపొందించారు. మోడళ్లలో కొందరు భుజాలు, నడుం భాగాలు కనిపించేలా వన్ పీస్ సూట్లలో హొయలుపోయారు.

ఐ అండ్ పీఆర్ కమిషనర్ డిప్యుటేషన్ పొడిగించండి

- కేంద్రానికి సీఎస్ జవహర్ రెడ్డి వినతి

అమరావతి, మే 18(ఆంధ్రజ్యోతి): సమాచార పౌరసంబంధాల శాఖ కమిషనర్ తుమ్మా విజయ్‌కుమార్ రెడ్డి డిప్యుటేషన్ మరో రెండేళ్లు పొడిగించాలని కేంద్రాన్ని సీఎస్ జవహర్ రెడ్డి కోరారు. ఇండియన్ ఇన్ఫర్మేటివ్ సర్వీస్ 1990బ్యాచ్‌కు చెందిన ఆయన ఐదేళ్ల డిప్యుటేషన్ జూన్ 9న ముగియబోతోంది. అయితే సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రచార కార్యక్రమాలు ఆయన సమర్థవంతంగా చేస్తున్నారని, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా, అవుట్ డోర్, డిజిటల్ తదితర ప్రచార కార్యక్రమాలపై అవగాహన ఉన్న ఆయన సేవలు రాష్ట్రానికి మరో రెండేళ్లు అవసరం ఉందని కేడర్ క్లియరెన్స్ ఇవ్వాలని లేఖలో పేర్కొన్నారు.

దురాత్ముల మాడుపగిలేలా సుప్రీం ఆదేశాలు: షర్మిల

అమరావతి, మే 18(ఆంధ్రజ్యోతి): 'దురాత్ముల నీచబుద్ధికి దిమ్మదిరిగేలా, మాడుపగిలేలా వివేకానందరెడ్డి హత్య విషయంలో సుప్రీం కోర్టు శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది' అని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. శనివారం ఆమె ఎక్స్‌లో స్పందించారు. 'భావప్రకటన స్వేచ్ఛపై ఈ రాక్షసమూక చేయబోయిన దాడిని తిప్పికొట్టి, ఎప్పటికైనా ధర్మపోరాటంలో చివరికి న్యాయమే గెలుస్తుందని నిరూపణ అయింది. అధికార బలాన్ని ఉపయోగించి, మూర్ఖత్వంతో ఇలాంటి చిల్లర కుట్రలు చేసేవారికి ఈ స్టే చెంపపెట్టు. ఈ విజయం తొలి అడుగు మాత్రమే. రాబోయే రోజుల్లో పోరాటం ఉధృతం చేస్తాం' అని షర్మిల అన్నారు.

కిర్గిస్థాన్‌లో హింస

దక్షిణాసియా విద్యార్థులపై దాడులు.. భయాందోళనలో తెలుగు విద్యార్థులు

- పార్ట్‌టైం ఉద్యోగాల అంశంలో వివాదం
- పాక్, బంగ్లా తప్పునకు మూల్యం చెల్లిస్తున్న భారతీయులు.. అప్రమత్తం చేసిన కేంద్రం

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

కిర్గిస్థాన్ రాజధాని బిష్కెక్‌లో అల్లర్లు చెలరేగాయి. దక్షిణాసియా దేశాలకు చెందిన విద్యార్థులే లక్ష్యంగా స్థానికులు దాడులకు తెగబడుతున్నారు. ఈ హింసాత్మక ఘటనలతో భారతీయ విద్యార్థులు తీవ్రభయాందోళనతో గడుపుతున్నారు. అల్లర్ల నేపథ్యంలో ఇల్లు వదిలి బయటకు రావొద్దని భారత విద్యార్థులను కిర్గిస్థాన్‌లోని భారత ఎంబసీ సూచించింది. బిష్కెక్‌లోని పలు వైద్య కళాశాలల్లో దక్షిణాసియాకు చెందిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఉన్నారు. భారత్ సహా ఇతర దక్షిణాసియా దేశాల విద్యార్థులు తరచూ వెళ్లే ఓ రెస్టారెంట్ వద్ద మూడ్రోజుల క్రితం ఘర్షణ జరిగింది. విదేశీ విద్యార్థులు, కిర్గిస్థాన్ యువకులకు మధ్య జరిగిన వాగ్వివాదం ఘర్షణకు దారితీసింది. ఈ క్రమంలో కొందరు పాక్ విద్యార్థులు కిర్గిస్థాన్ యువకులపై దాడి చేశారు. దీంతో పెద్ద సంఖ్యలో స్థానికులు శుక్రవారం అర్ధరాత్రి విదేశీయులు ఉండే హాస్టళ్లలోకి చొరబడి విద్యార్థులను చితకబాదారు. ఈ దాడులకు సంబంధించి సోషల్ మీడియాలో ఉన్న కొన్ని వీడియోలు భయానకంగా ఉండటంతో భారతీయ విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన విద్యార్థులంతా సురక్షితంగా ఉన్నట్టుగా ప్రాథమిక సమాచారం ఉందని కిర్గిస్థాన్‌లోని ఆదం విశ్వవిద్యాలయ భారతీయ ప్రతినిధి ఆశోక్ వెల్లడించారు. కాగా, ఈ ఘర్షణల్లో కొందరు పాక్ పౌరులు మరణించినట్టు జరుగుతున్న ప్రచారాన్ని కిర్గిస్థాన్ ప్రభుత్వం ఖండించింది. ఒక్క విదేశీయుడు మరణించలేదని శనివారం ప్రకటించింది. ప్రభుత్వం నుంచి సమాచారంలేకుండా ఘర్షణలగురించి ఎలాంటి ప్రకటనలు చేయవద్దని విదేశీ ఎంబసీలను కోరింది. విదేశీ విద్యార్థులు వీసా నిబంధనలను ఉల్లంఘిస్తున్నారంటూ జరుగుతున్న నిరసన ప్రదర్శనలను సమర్థించింది. అల్లర్లకు పాల్పడిన పలువురు విదేశీ విద్యార్థులను అదుపులోకి తీసుకున్నట్టు బిష్కెక్ నగర పోలీసు కమిషనర్ అజామత్ టోక్నోల్వీను ఉటంకిస్తూ స్థానిక మీడియా కథనం వెల్లడించింది. కాగా దక్షిణాసియా దేశాలకు చెందిన విద్యార్థులు స్టూడెంట్ వీసాపై కిర్గిస్థాన్‌కు వెళ్లి చదువుకుంటూ మరోపక్క డెలివరీ బాయ్‌లుగా పని చేస్తున్నారు. విదేశీయులు తక్కువ వేతనాలకు పనిచేస్తుండడంపై స్థానిక నిరుద్యోగులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. పార్ట్‌టైం ఉద్యోగాలు చేస్తున్న వారిలో పాక్, బంగ్లా పౌరులే అధికంగా ఉన్నారని కిర్గిస్థాన్ ప్రభుత్వ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా పార్ట్‌టైం ఉద్యోగాలు చేస్తూ పట్టుబడి దేశ బహిష్కరణ ఎదుర్కొంటున్న వారిలోనూ పాక్, బంగ్లా విద్యార్థులే అధికంగా ఉంటున్నారు. భారత్‌తో పోలిస్తే కిర్గిస్థాన్‌లో ఎంబీబీఎస్ చదువుకు ఖర్చు చాలా తక్కువ. దీంతో తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో యువత అక్కడికెళ్తున్నారు. కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ ప్రకారం కిర్గిస్థాన్‌లో 14,500 మంది భారత విద్యార్థులున్నారు. దాడుల నేపథ్యంలో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరపరిస్థితుల్లో సాయానికి 0555710041 నంబర్‌కు ఫోన్ చేయాలని కిర్గిస్థాన్‌లోని భారత రాయబార కార్యాలయం ట్వీట్ చేసింది. బిష్కెక్‌లో అలర్లు తగ్గి ప్రస్తుతం ప్రశాంత వాతావరణం నెలకొందని విదేశీ వ్యవహారాలశాఖ మంత్రి జైశంకర్ ట్వీట్ చేశారు.



దాడిలో ధ్వంసమైన ఓ హాస్టల్ తలుపులు. గాయపడిన విద్యార్థి (ఇన్‌సెట్‌లో)

సెప్టెంబరు 1న సీపీఎస్ ఉద్యోగుల చలో విజయవాడ

- సీపీఎస్ బకాయిలపై జూన్‌లో ఆందోళనలు
- ఏపీసీపీఎస్ఈఏ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో నిర్ణయం

విజయవాడ, మే 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అధికారంలోకి వచ్చే ఏ ప్రభుత్వమైనా సెప్టెంబరు 1 నాటికి సీపీఎస్ రద్దుపై హామీ ఇవ్వని పక్షంలో సెప్టెంబరు 1వ తేదీన బ్లాక్ డేగా పాటించటాన్ని కొనసాగిస్తామని, ఆ రోజున చలో విజయవాడ నిర్వహిస్తామని ఏపీసీపీఎస్ఈఏ రాష్ట్ర అధ్యక్షులు కోరుకొండ సతీష్ తెలిపారు. సీపీఎస్ ఉద్యోగులకు జరిగిన అన్యాయానికి బాధపడకుండా ఉద్యమానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఏపీసీపీఎస్ఈఏ ఏర్పడింది సీపీఎస్ రద్దు కోసమని, అది సాకారమైతే తమ డిమాండ్ పరిపూర్ణమైనట్టేనని అన్నారు. శనివారం విజయవాడలో ఏపీసీపీఎస్ఈఏ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో 26 జిల్లాల నుంచి సంఘ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికలు, తదుపరి పరిణామాలపై ప్రాథమికంగా చర్చించిన అనంతరం.. సీపీఎస్ ఉద్యోగుల చిరకాల సమస్యను పరిష్కారం చేసుకోవటానికి వీలుగా భవిష్యత్‌లో అనుసరించాల్సిన విధానాలపై ఈ సమావేశంలో చర్చించారు. భవిష్యత్ కార్యాచరణపై అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సతీష్, దాస్ 26 జిల్లాల ముఖ్య నాయకుల అభిప్రాయాలను స్వీకరించారు. అనంతరం కోరుకొండ సతీష్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలోనూ ఉద్యమం కొనసాగించామని, ప్రస్తుత ప్రభుత్వ హయాంలో కొనసాగించామని, రాబోయే రోజుల్లో ఏర్పడే కొత్త ప్రభుత్వంలో కూడా కొనసాగుతుందని చెప్పారు. సీపీఎస్ రద్దు అయ్యే వరకు ఏపీసీపీఎస్ఈఏ పోరు ఆగదని, రెట్టించిన ఉత్సాహంతో ముందుకు వెళుతుందే తప్ప తగ్గదని స్పష్టంచేశారు. సీపీఎస్ ఉద్యోగులకు ఇప్పటి వరకు బకాయిలు కూడా విడుదల చేయలేదన్నారు. ఇటీవల చీఫ్ సెక్రటరీని కలిసి సీపీఎస్ ఉద్యోగుల బకాయిలను విడుదల చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశామని.. అయినా ఇప్పటి వరకు ఎలాంటి చలనం కనిపించటం లేదన్నారు. బకాయిలపై వచ్చే జూన్ నెలలో ఉద్యమానికి సిద్ధమౌతామని ఈ సందర్భంగా హెచ్చరించారు.

జల్‌జీవన్ మిషన్ బకాయిలు రూ.650 కోట్లు చెల్లించండి

- మ్యాచింగ్ గ్రాంట్ రూ.750 కోట్లు జమ చేయండి
- లేకపోతే పనులు నిలిచిపోయే ప్రమాదం
- ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్‌సీకి ఏపీ వాటర్ సప్లయ్ కాంట్రాక్టర్ల సంఘం లేఖ

విజయవాడ, మే 18 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రాయోజిత పథకం జల్ జీవన్ మిషన్ (జేజేఎం) పనులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం 50 శాతం వాటాగా భరించాల్సిన నిధులను తక్షణం జమ చేయాలని, కాంట్రాక్టర్లకు పెండింగ్‌లో ఉంచిన రూ.650 కోట్లను విడుదల చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్‌సీకి ఏపీ నీటి సరఫరా కాంట్రాక్టర్ల అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.రామాంజనేయులు శనివారం లేఖ రాశారు. జేజేఎం పనులకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే 50 శాతం మ్యాచింగ్ గ్రాంటు విడుదల చేసిందని, రాష్ట్ర ప్రభుత్వం తన 50 శాతం మ్యాచింగ్ గ్రాంట్‌ను కూడా విడుదల చేస్తేనే.. రానున్న రోజులలో ఈ పథకం కొనసాగే అవకాశాలున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కనుక తన మ్యాచింగ్ గ్రాంట్ విడుదల చేయకపోతే కేంద్రం మలివిడత నిధులను ఆపివేసే ప్రమాదముందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తన మ్యాచింగ్ గ్రాంట్‌ను జమ చేయకపోవటం వల్ల ఇప్పటికే పనులన్నీ ఎక్కడివక్కడ నిలిచిపోయాయని తెలిపారు. ఈ పనులను పూర్తి చేయాలంటే జేజేఎం పథకానికి నిధుల విడుదల కోసం రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, ఫైనాన్స్-ప్లానింగ్ విభాగాలకు తక్షణం లేఖలు రాయాలని ఈఎన్‌సీకి రామాంజనేయులు విజ్ఞప్తి చేశారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర ప్రభుత్వం తన మ్యాచింగ్ గ్రాంట్‌గా రూ.750 కోట్లను విడుదల చేయాల్సి ఉందన్నారు. తన వాటా నిధులను విడుదల చేయకపోతే భవిష్యత్తులో జల్ జీవన్ మిషన్ పథకంపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు.

క్రమబద్ధీకరణలో కక్కుర్తి!

- కాంట్రాక్టు టీచర్ల నుంచి లంచాలు
- ప్రాజెక్టు అధికారులకు తెలియకుండానే రాష్ట్ర కార్యాలయానికి నడిచిన ఫైళ్లు
- 10 ఐటీడీఏల్లో 483 మంది రెగ్యులరైజేషన్
- ఒక్కొక్కరి నుంచి రూ.లక్ష వసూలు
- అనర్హులనూ క్రమబద్ధీకరించిన వైనం
- గిరిజన సంక్షేమ శాఖకు అవినీతి మకిలి

రంపచోడవరం, మే 18: గిరిజన సంక్షేమ శాఖలో చోటు చేసుకున్న అవినీతి వ్యవహారం ఆ శాఖకు తలనొప్పిగా మారింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 10 ఐటీడీఏల్లో పని చేస్తున్న అర్హులైన సుమారు 483 మంది కాంట్రాక్టు టీచర్ల సర్వీసు క్రమబద్ధీకరణ వ్యవహారంలో భారీగా సాగిన వసూళ్ల వ్యవహారం తీవ్ర వివాదంగా మారింది. గత సంవత్సరం అక్టోబరు 21న ఆర్థిక శాఖ జీవో 114 జారీ చేసింది. దీని ప్రకారం ఈ ఏడాది జూన్ 2లోగా ఆయా ఐటీడీఏల పరిధిలో గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని పాఠశాలల్లో కాంట్రాక్టు టీచర్లు(సీఆర్‌టీ)గా చేరిన వారి సర్వీసును క్రమబద్ధీకరించాలి. ఈ మేరకు గిరిజన సంక్షేమ డైరెక్టర్ కార్యాలయం ఈ సంవత్సరం ప్రారంభంలో ఆయా ఐటీడీఏల పరిధిలోని జిల్లా యూనిట్లకు సూచనలు చేసింది. దీంతో ఆయా ఐటీడీఏల పరిధిలోని గిరిజన సంక్షేమ జిల్లా అధికారుల కార్యాలయాలు చర్యలు చేపట్టాయి. శ్రీకాకుళం జిల్లా సీతంపేట ఐటీడీఏ పరిధిలో 46 మంది, విజయనగరం జిల్లా పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో 131 మంది, విశాఖపట్నం జిల్లా పాడేరు ఐటీడీఏ పరిధిలో 209 మంది, తూర్పు గోదావరి జిల్లాలో 92 మంది, పశ్చిమ గోదావరి జిల్లాలో నలుగురు, కృష్ణా జిల్లాలో ఒకరు, గుంటూరు జిల్లాలో ఐదుగురు, ప్రకాశం జిల్లాలో ఒకరు, నెల్లూరు జిల్లాలో ముగ్గురు, కర్నూలు జిల్లాలో ముగ్గురు మొత్తం 483 మంది కాంట్రాక్టు టీచర్లను అర్హులుగా గుర్తించారు. వారి నుంచి దరఖాస్తులు కూడా స్వీకరించారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. అసలు కథ ఇక్కడే మొదలైంది. సర్వీసును క్రమబద్ధీకరించేందుకు ఒక్కొక్క ఉపాధ్యాయుడిని రూ.లక్ష ముడుపులు ఇవ్వాలని ఒత్తిడి చేసినట్టు తెలిసింది. అది కూడా రాష్ట్ర కార్యాలయం నుంచే అనధికారిక ఆదేశాలు రావడంతో ఉపాధ్యాయులు విస్తుబోయారు. కాదంటే తమ సర్వీసు క్రమబద్ధీకరణ కాదేమోనన్న బెంగతో అడిగినంతా సమర్పించుకున్నారు. ఇలా రాష్ట్ర వ్యాప్తంగా సుమారు రూ.4.50 కోట్ల మేర వసూళ్లు సాగాయని సమాచారం. అంతేకాకుండా ఆయా జిల్లా కార్యాలయాలకు సంబంధించి కూడా ప్రతి టీచర్ నుంచి రూ.10 వేల నుంచి రూ.25 వేల వరకు వసూలు చేసినట్టు తెలిసింది. ఈ నియామకాల కోసం కమిటీలను కూడా నియమించి వ్యవహారం మొత్తాన్ని చక్కబెట్టారు. ఈ అవినీతి వ్యవహారం తాజాగా రచ్చకెక్కడంతో పలు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారులు విచారణ చేపట్టారు. ఐటీడీఏ పరిధిలో జరిగే ప్రతి అంశమూ ప్రాజెక్టు అధికారి ఆమోదంతోనే జరగాల్సి ఉండగా ఈ విషయానికి సంబంధించి మాత్రం ప్రాజెక్టు అధికారితో సంబంధం లేకుండానే రాష్ట్ర గిరిజన సంక్షేమ డైరెక్టర్ కార్యాలయం చక్కబెట్టిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సదరు ఉపాధ్యాయుల ఫైళ్లను నేరుగా డైరెక్టర్ కార్యాలయానికే తెప్పించుకున్నారని తెలుస్తోంది. ఈ విషయాన్ని గుర్తించిన రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే స్థానిక గిరిజన సంక్షేమ కార్యాలయంలో బాధ్యులైన ఉన్నతాధికారుల నుంచి సెక్షన్ గుమస్తాల వరకు అందరికీ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఆయన చేసిన విచారణలో పలువురు అనర్హులను సిఫారసు చేయడం, ఆయా సీఆర్‌టీల నియామక నోటిఫికేషన్‌ను సక్రమంగా పరిశీలించకపోవడం, పలువురికి సరైన బాండ్లు లేకపోవడం, డ్యూటీ సర్టిఫికెట్లకు సంబంధించి విచారణ జరపకపోవడం వంటివి వెలుగు చూశాయి. అంతేకాదు.. పలువురికి టెట్ అర్హత కూడా లేకపోవడం వంటి లోపాలను గుర్తించినట్టు తెలిసింది. ఈ వ్యవహారం ఇప్పుడు గిరిజన సంక్షేమ శాఖలో సంచలనంగా మారింది.

జిల్లెళ్లమూడిలో జస్టిస్ దుర్గాప్రసాద్

- అమ్మతో సంభాషణలు గ్రంథావిష్కరణ



బాపట్ల, మే 18: బాపట్ల జిల్లా బాపట్ల మండలం జిల్లెళ్లమూడిలో ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతున్న జిల్లెళ్లమూడి అమ్మ సన్నిధిని హైకోర్టు జడ్జి జస్టిస్ ఉప్మాక దుర్గాప్రసాద్ కుటుంబ సమేతంగా శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా టీటీడీ కల్యాణ మండపంలో కృష్ణయజుర్వేద నమఃఘనపారాయణం, తొమ్మిది మంది ఘనాపాటీలతో వేదపారాయణం అత్యంత వైభవంగా జరిగింది. అనంతరం 'అమ్మతో సంభాషణలు' గ్రంథాన్ని జస్టిస్ దుర్గాప్రసాద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లెళ్లమూడి పుణ్యక్షేత్రానికి రావటం ఎంతో సుకృతంగా భావిస్తున్నట్లు తెలిపారు. పది మందికి అన్నం పెట్టడమే నిజమైన సేవ అన్నారు. అనంతరం జస్టిస్ దుర్గాప్రసాద్ దంపతులను వేదపండితులు ఆశీర్వదించగా విశ్వజననీ పరిషత్‌ట్రస్ట్‌వారు సత్కరించారు.

చాలా రోజుల తర్వాత నిష్పక్షపాతంగా పోలీసులు

- అనకాపల్లి పార్లమెంట్ అభ్యర్థి సీఎం రమేష్



తిరుమల, మే 18(ఆంధ్రజ్యోతి): చాలా రోజుల తర్వాత ఏపీలో పోలీసులు కొంతమేర నిష్పక్షపాతంగా పనిచేస్తున్నారని అనకాపల్లి పార్లమెంట్ కూటమి అభ్యర్థి సీఎం రమేష్ అన్నారు. తిరుమల శ్రీవారిని శనివారం ఉదయం ఆయన దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వంలో పోలీసు యంత్రాంగం యావత్తూ వన్‌సైడ్‌గా పనిచేసిందన్నారు. ఇప్పుడు ఈసీ పుణ్యమా అని పోలీసులు 10 శాతం నిష్పక్షపాతంగా పనిచేస్తుంటేనే వైసీపీ నాయకుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయన్నారు. కొంత మంది అధికారులు ఇంకా పాత వాసనలోనే ఉన్నారన్నారు. రావణ, రాక్షస రాజ్యం పోయి రామరాజ్యం వచ్చేలా ఆశీర్వదించినందుకు శ్రీవారికి మొక్కు చెల్లించి ధన్యవాదాలు తెలిపేందుకు తిరుమలకు వచ్చానన్నారు. రానున్న రోజుల్లో ఏపీలో ప్రశాంతమైన పాలన నడుస్తుందన్నారు.

సింహగిరి పైకి ఎలక్ట్రిక్ బస్సు

- ప్రారంభించిన అనువంశిక ధర్మకర్త అశోక్ గజపతిరాజు



బస్సుకు పూజలు చేస్తున్న అశోక్‌గజపతిరాజు, ఈఓ శ్రీనివాసమూర్తి

సింహాచలం, మే 18: భక్తుల సౌకర్యార్థం సింహగిరిపైకి ఎలక్ట్రిక్ బస్సును సింహాచలం దేవస్థానం అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు శనివారం ప్రారంభించారు. దేవదాయశాఖ పరిధిలోని ప్రధాన (6ఏ) ఆలయాల్లో తొలిసారి ఎలక్ట్రిక్ బస్సును ప్రవేశపెట్టిన ఘనతను సింహాచలం దేవస్థానం దక్కించుకుంది. ఎలక్ట్రిక్ బస్సును పూజల అనంతరం ఈఓ శ్రీనివాసమూర్తితో కలిసి అశోక్ గజపతిరాజు లాంఛనంగా ప్రారంభించారు. ఏసీ సౌకర్యం కలిగిన ఈ బస్సు కొనుగోలుకు సుమారు రూ.1.65 కోట్లు వెచ్చించారు. ఒకసారి చార్జింగ్ చేస్తే 220 కిలోమీటర్లు నడుస్తుందని అధికారులు వెల్లడించారు. నెల రోజుల్లో రెండో బస్సును కూడా సింహగిరి ఘాట్‌రోడ్డులో ప్రవేశపెట్టనున్నామని తెలిపారు.

తెలంగాణ ఈఏపీసెట్‌లో భాష్యం విద్యార్థుల సత్తా



యశ్వంత్‌రెడ్డి, జిష్ణుసాయి, హర్షిత

గుంటూరు(విద్య), మే 18: ఇంజనీరింగ్, అగ్రికల్చరల్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశం కోసం తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన ఈఏపీ సెట్‌లో భాష్యం విద్యార్థులు సత్తాచాటారని సంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ విద్యార్థి ఎం.సాయియశ్వంత్‌రెడ్డి 5వ ర్యాంకు, ఎం.జిష్ణుసాయి 11, కె.హర్షిత 13, కె.మనీష్‌చౌదరి 28, కె.ప్రభాస్ 31, టి.మునికార్తీక్ 58, పి.శ్యామ్ 63, ఎం.సాయిజశ్వంత్‌రెడ్డి 65, ఎం.గణేష్‌దత్తా 93, ఎం.శ్రీచరితసాయి 94, డి.పూజ 97, కె.ఆర్.ఎస్. సుమన్విత 100వ ర్యాంకు సాధించినట్లు తెలిపారు. తమ సంస్థ విద్యార్థులు 100లోపు 12 ర్యాంకులు సాధించారని పేర్కొన్నారు. భాష్యం ఐఐటీ జేఈఈ అకాడమీ, మెడెక్స్ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులను ఆయనతోపాటు డైరెక్టర్ భాష్యం హనుమంతరావు తదితరులు అభినందించారు.

బ్యాంకు ఖాతాలో రూ.5 లక్షలు మాయం

- ఫోన్ హ్యాక్ చేసి నగదు కాజేసిన సైబర్ నేరగాళ్లు

ఎమ్మిగనూరు, మే 18: కర్నూలు జిల్లాలో సైబర్ నేరగాళ్లు చెలరేగిపోతున్నారు. తాజాగా ఎమ్మిగనూరు మండలం కోటేకల్లు గ్రామానికి చెందిన షేక్ ఇబ్రహీం అనే వ్యక్తి బ్యాంకు ఖాతా నుంచి సైబర్ నేరగాళ్లు రూ.5 లక్షలు కొట్టేశారు. ఇబ్రహీం ఎమ్మిగనూరులో యునియన్ బ్యాంకుకు చెందిన బీసీ పాయింట్ (బిజినెస్ కరస్పాండెంట్) నిర్వహిస్తున్నాడు. ఇందులో బాగంగా శుక్రవారం ఎమ్మిగనూరు బ్యాంకుకు వచ్చిన సమయంలో తన సెల్‌ఫోన్‌ను హ్యాక్ చేసి ఈ బ్యాంకింగ్ ద్వారా ఇతర ఖాతాలకు సైబర్ నేరగాళ్లు నగదు బదిలీ చేసుకున్నట్టు బాధితుడు తెలిపాడు. ఎమ్మిగనూరు పట్టణ పోలీసులకు శనివారం ఫిర్యాదు చేసి ఆ వివరాలను అందించాడు. పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జన్యు పరిశోధనల వెలుగులో
మన మూలాలు

సుప్రసిద్ధ జర్నలిస్టు, రచయిత, పరిశోధకులు కల్లూరి భాస్కరం రచన 'ఇవీ మన మూలాలు' గొప్ప పరిశోధనాత్మక గ్రంథం. పుస్తకం వేల లక్షల సంవత్సరాల మానవ జాతి పరిణామక్రమం వలసలు, విభిన్న ప్రాంతాల ప్రజల మధ్య ఘర్షణలు, సంబంధాలు, తదితరాలపై లోతైన పరిశోధనతో మానవ జాతి యావత్తు, విభిన్న వర్గాల సంపర్కంతో కొనసాగుతున్న దని భాస్కరం సోదాహరణంగా వివరించారు. ముందు మాటలో వాడ్రేవు చిన వీరభద్రుడు రాసినట్లుగా ఇలాంటి గ్రంథ రచనకు పూనుకోవడానికి చాలా ధైర్యం కావాలి. ధైర్యం ఎందుకు కావాలంటే మనమొక అసాధారణ పరిస్థితుల్లో జీవిస్తున్నాం. వాస్తవాలను అంగీకరించకుండా, మన మతం, మన భాష, మన చరిత్రను అధికార శక్తులు తమ ఆలోచనలకు అనుగుణంగా వక్రీకరిస్తున్నాయి. తమతో అంగీకరించని వారిని దేశద్రోహులని చిత్రీకరించడం, ఏం తినాలో, ఏ రకం దుస్తులు ధరించాలో, ఏం ఆలోచించాలో, ఏం రాయాలో ఎవరిని పూజించాలో ఆదేశిస్తూ, భావ ప్రకటనా స్వేచ్ఛను అణగదొక్కుతున్న సందర్భంలో బతుకుతున్నాం. మనుషులకు, రచయితలకు, తత్వశాస్త్ర వేత్తలకు, వాస్తవాలు చెప్పేవారికి సంకెళ్లు వేయవచ్చు. కాని భావాలకు సంకెళ్లు వేయలేరు.

పదుల వేల సంవత్సరాల్లో మానవజాతి నిరంతరం ఒక ప్రాంతం నుండి మరొక ప్రాంతానికి వలసవెడుతూ మరింత మెరుగైన జీవితం కోసం వెతుకుతూనే ఉంది. దేశాలు, సరిహద్దులు ఏర్పడక ముందు నుండి, ప్రారంభమై 21వ శతాబ్దంలో కూడా కొనసాగుతున్నది.



> అసలు పాయింట్ ఇన్ని సంపర్కాలు, సంఘర్షణల తర్వాత మా మతం, కులం, పవిత్రమైనదని, ప్రపంచంలో ఉత్తమమైనదని చెప్పడం! మత విద్వేషాలు ఒకవైపు, స్వంత మతంలోని భిన్నకులాల మీద అసాధారణమైన వివక్ష మరోవైపు– ఈ రెండూ అర్థరహితమైనవి. మానవులందరిలో రక్తం ఎరుపే. నీలి రక్తం లేదు. రక్తం చెడిపోతేనే రంగు మారుతుంది.

గత శతాబ్దంలో వలసలుగా ఉన్న దేశాల నుండి యూరోపునకు వలసలు ప్రారంభమై, ప్రతిరోజు పెరుగు తున్నాయి. యూరోపులో, అమెరికాలో వలసల పట్ల అసహనం, భయం పెరుగుతున్నది. అప్పట్లో, ఒక్క అమెరికాకు తప్ప మిగతా దేశాలకు యూరోపియన్లు వలస వెళ్లింది దోచుకోవడానికే. ఇప్పుడు యూరోపుకు వర్ధమానదేశాల వారి వలసలు ప్రాణరక్షణ కోసం, బ్రతుకు తెరువు కోసం. ఇలాంటి దశలో ఘర్షణలు, సంపర్కాలు అనివార్యం. వలసలకు వ్యతిరేకంగా మితవాద శక్తులు రాజకీయ పార్టీలుగా రూపాంతరం చెంది, ఫాసిస్టు పద్ధతులకు పాల్పడుతున్నాయి. కోట్లాది ప్రజల వలసలు సాగుతున్నాయి. ఈ ఇరవై ఏళ్లలో భారతదేశం నుండి 23 లక్షల మంది వలస వెళ్లారు.



హరప్పా జనంలో ఇరాన్ జన్యువులు ఉన్నాయని పరిశోధకులు కనుగొన్నారు. శ్రీలంకలో ఇప్పటికీ అడవులలో నివసించే గిరిజనులలో భారతీయుల జన్యువులు ఉన్నట్లు, సిసియంబి పరిశోధనలు వెల్లడించాయని ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో వార్త వచ్చింది. గ్రహదేవతలకు సంబంధించి పురాణాల కథలలో దేవుళ్లకు, భారత పురాణాలలో దేవుళ్లకు అనేక పోలికలు పేర్ల మార్పుతో కనబడుతాయి. భారతదేశం నుండి ప్రజలు గ్రీసు, యూరోపులకు గతంలో వెళ్లినట్లు ఎలాంటి ఆధారాలు లేవుగాని, ఆ ప్రాంతం నుండి భారతదేశంలోకి రావటమో, లేక ఒక పాయ ఇటు భారత్‌వైపునకు, మరొక పాయ అటు యూరోపునకు ఉమ్మడి పురాణాలతో వెళ్లి వుండే అవకాశాలు ఉన్నాయి.

వాస్తవాలను సక్రమంగా అర్థం చేసుకోవడానికే వాస్తవ చరిత్ర రచన అవసరం. వేల సంవత్సరాల క్రితం ఆర్యులు భారతదేశంలోకి వచ్చారంటే, ఇప్పుడు వాళ్ళు విదేశీయుల క్రింద లెక్క కాదు. యూదులు పాలస్తీనాను వేల సంవత్సరాలనాటి తమ మాతృభూమిగా ప్రకటించుకొని ఆక్రమించుకున్నారు. అలాంటి పరిస్థితులు ఇక్కడ లేవు. ఈ వలసల పరివర్తన గురించి సిగ్గు పడాల్సింది లేదు.

కాని ఈ పరివర్తనాక్రమం గురించి, జన్యువుల మూలం గురించి అంగీకరిస్తే, తర్వాత సృష్టించబడిన మతాలు, కులాలు, ఇతర కృతిమ విభజనలు అర్థం లేనివని అంగీకరించాల్సి వస్తుంది. ఉత్తర అమెరికాలోని 26 కోట్ల జనాభాలో నేటివ్ అమెరికన్లు (రెడ్ ఇండియన్స్‌గా పిలవబడేవారు) కోటి పది లక్షల మంది, మిగిలిన 25 కోట్ల మంది వలసలు వచ్చినవారే. యూరోపు, ఆఫ్రికా, ఆసియా దేశాల ప్రజలు, అంతర్వర్ణ వివాహాల నూతన సంకర జాతి ప్రజలు కలిసి, అమెరికా అయింది. వాళ్లందుకు సిగ్గుపడటం లేదు.

తాము నమ్మిన అంశాలను బలపరచుకోవడానికి, వేల సంవత్సరాల చరిత్రను వక్రీకరించడం అందుకే. భాస్కరం రచన జన్యు పరిశోధనల వెలుగులో చారిత్రిక సాక్ష్యాల పునర్విచారణ. ప్రశస్త పుస్తకం అనేక అంశాలను మేధావుల, ప్రజల దృష్టిని తీసుకువస్తున్నది.

అసలు పాయింట్ ఇన్ని సంపర్కాలు, సంఘర్షణల తర్వాత మా మతం, కులం, పవిత్రమైనదని, ప్రపంచంలో ఉత్తమమైనదని చెప్పడం! మత విద్వేషాలు ఒకవైపు, స్వంత మతంలోని భిన్నకులాల మీద అసాధారణమైన వివక్ష మరోవైపు– ఈ రెండూ అర్థరహితమైనవి. ఊహాజనితమైన గతాన్ని పునరుద్ధరించాలనే వివేచన లేని ఆలోచన, ప్రపంచాన్ని మొత్తం ఇస్లామీకరణ చేయాలనుకునే జీహాదిస్టుల ప్రయత్నాలు ఒకే రకమైనవి. మానవులందరిలో రక్తం ఎరుపే. నీలి రక్తం లేదు. రక్తం చెడిపోతేనే రంగు మారుతుంది.

పుస్తకంలో ఆఖరు అంశం "దక్షిణ గో గ్రహణంలో ఆర్యావర్తం" ఒక కొత్త కోణం నుండి రాయబడింది. ఉత్తర భారత ఆర్యావర్త శక్తులు, దక్షిణ భారతంలో ఆర్యావర్తం విస్తృతం చేయడానికి జరుగుతున్న ప్రయత్నంగా ఆయన అభిప్రాయపడ్డారు. ఇది రాజకీయ పార్టీల మధ్య నాయకత్వ ఘర్షణ కంటే సైద్ధాంతిక ఘర్షణల కంటే, ఆర్యావర్త ఆలోచనలు, భాష, సంస్కృతి, మతం, దక్షిణ భారతంపైన రుద్దటానికి జరుగుతున్న ప్రయత్నంగా అర్థం చేసుకోవాలి. ఈ వైరుధ్యాలు ఎంతకాలం సాగుతాయనే విషయం ఆయన చరిత్రకు వదిలి పెట్టారు. ఈ కొత్త కోణంలో వాస్తవం ఉంది. అది యూదుల జాత్యహంకార ధోరణిలోకి పోతున్న ప్రమాదం కనపడుతున్నది.

వందల సంవత్సరాలపాటు సాగిన ఈ ప్రయత్నం, మధ్యలో ముస్లిం రాజుల దాడులు, పాలన, బ్రిటిష్ వలస పాలన కారణంగా వచ్చిన 'గ్యాప్'తో వాయిదాపడి ఇప్పుడు మళ్లీ కొనసాగుతున్నదన్న ఆయన వాదన సమంజస మైనదిగానే కనపడుతున్నది. మానవజాతి ఒక్కటే అయినా, మతాలు, భాషలు, సంస్కృతి, ఆచారాలు, భిన్నమైనవి. పరస్పర సహనం, గౌరవంతోనే దేశాలు ఐక్యంగా నిలబడుతాయి.

కల్లూరి భాస్కరం ఈ పుస్తకాన్ని అనేక రెఫరెన్స్‌లతో, కొత్తకోణం నుండి ఆలోచించి రాసారు. ఇదొక గొప్ప వైజ్ఞానిక రచన. మెదడు ద్వారాలను మూసుకున్న వారికి ఇది ఎక్కదు. జ్ఞాన చక్షువులు తెరుచుకోవాల్సిన నేటి యువత దీనిని చదవాలి, చర్చించాలి. ఈ గ్రంథం ఇంగ్లీషు, హిందీ తదితర భాషలలోకి అనువదించడం చారిత్రక అవసరం.

◆ సురవరం సుధాకర రెడ్డి

హిమాలయాల్లో అక్షర వసంతం

గత రెండు వేల సంవత్సరాలకు పైగా ప్రపంచం సమస్త భాషలలోను అసంఖ్యాక రచయితలను చూసింది; వారి ఆలోచనల నైశిత్యాన్ని, భావ చింతనను, కల్పనా రమ్యతను ఆవాహన చేసుకుంది. ఆ అక్షర మాంత్రికులలో కొంతమంది రూపెత్తిన అహంభావులు అయినా తమ పాఠకులపై బ్రహ్మాండమైన ప్రభావాన్ని నెరపినవారు; మరి కొంతమంది మృదుస్వభావులు, స్నిగ్ధమూర్తులు, మనసులను ద్రవింపజేసినవారు; ఇంకొంతమంది మానవ జీవిత అనంత వృత్తాంతాలను అద్భుతమైన నేర్పుతో అభివర్ణించినవారు; పలువురు తమ కథలకు అనూహ్యమైన ముగింపు నివ్వడం ద్వారా పాఠకులను సంభ్రమాశ్చర్యాలకు గురి చేసినవారు; ఇంకా ఎంతో మంది తమ ప్రాతి భాసికంలోనే కాకుండా రచనా విన్యాసంలో సైతం నిగూఢమైనవారు. ఈ బహు రీతుల సృజనకారులలో ప్రతి తరహా వారితోను మానవ సమాజాలు మెరుగుపడ్డాయి, మన జీవితాలు కాంతిమంతమయ్యాయి. సృజన కార్యకలాపాలలో అంత వైవిధ్యమే లేకపోతే మన బతుకులు కళాకాంతి లేకుండా నిస్సారమయ్యేవి, నిష్ఫలమయ్యేవి.

మన కాలం అత్యుత్తమ కథా రచయితలలో రస్కిన్ బాండ్ ఒకరు. సుసంపన్న, సువిఖ్యాత భారతీయ కథా కథన సంప్రదాయానికి గర్వ కారణం రస్కిన్ బాండ్. చెట్టు చేమ, పక్షీ పశువూ, కొండ కోన, ఆకాశ మార్గాన పయనిస్తున్న మేఘాలు, భూతలాన ప్రవహిస్తున్న నదులతో శోభిస్తున్న ప్రకృతి పట్ల ప్రగాఢ ప్రేమానురక్తులను మేళవించుకునే తన కథాకథన ప్రజ్ఞతో ఇంచుమించు మూడు తరాల సాహిత్య ప్రేమికులను ఆయన సమ్మోహితం చేశారు, ఇంకా వారి మనసులను రంజింప చేస్తూనే ఉన్నారు. రస్కిన్ బాండ్ రచనలు హిమగిరి ప్రాంతాల సన్నివేశాలనే ఆధారంగా తీసుకుంటాయనే ఒక సాధారణీకరణ అభిప్రాయాన్ని సాహిత్యాభిమానులు తరచు వ్యక్తం చేయడం కద్దు. రస్కిన్ బాండ్ పరిమితులకు అతీతమైన సృజనశీలి. హిమాలయ ప్రాంతాల రమ్య దృశ్యాలు ఆయనలోని సృజన శక్తికి స్ఫూర్తినిస్తున్నాయనడంలో ఎలాంటి సందేహం లేదు. అయినా హిమగిరుల ఆవరణం ప్రతి ఒక్కరినీ ఉత్తేజితులను చేస్తున్నప్పుడు అక్కడే పుట్టి పెరిగిన రస్కిన్ బాండ్ అందుకు ఎలా మినహాయింపు అవుతారు?

రస్కిన్ బాండ్ రచనలకు హిమాలయాలు ఒక నిరంతర నేపథ్యం. అయితే ఆయన కథలు విభిన్న, నానా విధమైన విషయాలను అన్వేషించాయి, అభివర్ణించాయి. ఒకే ఒక్క గవాక్షం ఉన్న మహాభవనంలో కూర్చున్న ఒక అద్భుత ఇంద్రజాలికుడు లాంటి వాడు మన రస్కిన్ బాండ్. కిటికీని తెరిచినప్పుడల్లా తన వీక్షణతో విభిన్న ప్రపంచాన్ని ఆవిష్కరించే మాంత్రికుడు ఆయన. ఈ విషయంలో ఆయన, మధ్య తరగతి కుటుంబ జీవితాల గురించి కథలు రాసిన భారతీయ (భాషలలోని) మహాకథకులతో పోల్చదగినవాడు. ప్రపంచ వ్యాప్తంగా వివిధ పరిస్థితులలో ఒకేతీరున సువ్యక్తమవుతున్న మానవ జీవన విలక్షణత, నాటకీయత గురించి రస్కిన్ బాండ్ తన పాఠకులను మంత్ర ముగ్ధులను చేశారు. వారిని పలు విధాల పరవశింపచేశారు.

అన్ని వర్గీకరణలు, అనుబంధితాలకు అతీతంగా రస్కిన్ బాండ్ ఒక పరిపూర్ణ మానవతావాది. కనుకనే ఆయన మానవ జీవిత దార్శనికుడు. గ్రామీణ జీవనమైనా, 'గత శైశవ రాగమాలికల ప్రతిధ్వనులు, పోయిన బాల్యపు చెరిగిన పదముల చిహ్నాల' తలపోతలు అయినా లేదా మనిషి, ప్రాకృతిక జగత్తు మధ్య బాంధవ్యమైనా–రస్కిన్ బాండ్ ప్రతి కథా చర్చించే ఇతివృత్తాలు, ఆలోచనలకు మానవ అస్తిత్వమే కేంద్రంగా ఉంటుంది; మానవ జీవిత సౌందర్యం, సాఫల్యాలు, మానవాళి దుఃఖాలు, వేదనలు ఆ కథల్లో మనకు కనిపిస్తాయి, మనలో లోవెలుగులను నింపుతాయి.

చెప్పవచ్చినదేమిటంటే రస్కిన్ బాండ్, ఆయన జీవన పరిసరాలూ, విశాల ప్రపంచమూ, గ్రామీణ ప్రజలతో జీవితం పొడుగునా ఆయనకు ఉన్న సంబంధ బాంధవ్యాలు – ఇవన్నీ కేవలం ప్రకృతి పట్ల



> అన్ని వర్గీకరణలు, అనుబంధితాలకు అతీతంగా రస్కిన్ బాండ్ ఒక పరిపూర్ణ మానవతావాది. కనుకనే ఆయన మానవ జీవిత దార్శనికుడు. రస్కిన్ బాండ్ ప్రతి కథా చర్చించే ఇతివృత్తాలు, ఆలోచనలకు మానవ అస్తిత్వమే కేంద్రంగా ఉంటుంది; మానవ జీవిత సౌందర్యం, సాఫల్యాలు, మానవాళి దుఃఖాలు, వేదనలు ఆ కథల్లో కనిపిస్తాయి, మనలో లోవెలుగులను నింపుతాయి.

ప్రేమను మించినవి కావా? రస్కిన్ బాండ్ జీవించి ఉన్న కాలంలోనే మనమూ నడయాడుతున్నందుకు ఎంతో అదృష్టవంతులం. ప్రకృతి, పర్యావరణం పట్ల రస్కిన్ బాండ్‌కు ప్రగాఢ శ్రద్ధాసక్తులు ఉన్నాయి. వాటిని ఆయన గౌరవిస్తారు, పూజ్య భావంతో చూస్తారు. ఆయన కథలు, కవితలు, ఇతర రచనలలో ప్రాకృతిక పరిసరాలు మనకు ప్రత్యక్షమవుతాయి. ఆయన భావవిన్యాసాలు, అక్షర కల్పనలతో అవి మనలను అలరిస్తాయి, జాగృతం చేస్తాయి.

ప్రకృతి వర్ణనలతో నిండిన కథలు రాయడమే కాదు, పర్యావరణ సంరక్షణకు పలు విధాల కృషి చేస్తున్న ప్రకృతి ప్రేమికుడు రస్కిన్ బాండ్. భావి తరాల వారి కోసం ప్రాకృతిక జగత్తును పరిపూర్ణంగా కాపాడుకోవాలని ఆయన తరచు ఘోషిస్తుంటారు. పర్యావరణ సమతుల్యతను సంరక్షించుకోవల్సిన ఆవశ్యకతను తన రచనలు, ఉపన్యాసాలు, సంభాషణల్లో ఆయన వక్కాణిస్తుంటారు. స్థిర జీవనం, సుస్థిర అభివృద్ధి, వాటికి సంబంధించిన సకల అంశాలను సమగ్రంగా అర్థం చేసుకున్న రచయిత ఎవరైనా ఉన్నారంటే ఆ ఒక్కడు నిస్సందేహంగా రస్కిన్ బాండ్.

రస్కిన్ బాండ్ కథలు తమ మాటల మాంత్రికతతో మనలను భిన్న ప్రపంచాలకు తీసుకువెళతాయి. అంతేనా? కానే కాదు. అవి అదనంగా ఒక సామాజిక పాత్రను నిర్వహిస్తున్నాయి. వ్యాకుల పడుతున్న ఆత్మలకు అవి సాంత్వననిస్తాయి. గాయపడిన మనస్సులకు ఉపశమనం కలిగిస్తాయి. దెబ్బ తిన్న హృదయాలను ఊరడిస్తాయి ఇబ్బందులతో సతమతమవుతున్న వారిని శాంతపరుస్తాయి. కలవరపడుతున్న అభాగ్యులను ఓదార్చుతాయి. పాఠకులను అలా ప్రభావితం చేసే అటువంటి సమున్నత సృజనాత్మక రచనా ప్రతిభను చాలా కొద్దిమంది రచయితల్లో మాత్రమే కానవస్తుంది. అటువంటి రచయితల్లో రస్కిన్ బాండ్ అత్యుత్తముడూ, అత్యున్నతుడూ అని చెప్పేందుకు నేను సంకోచించను.

రస్కిన్ బాండ్‌తో ఒక దశాబ్ద కాలంగా ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపే భాగ్యం నాకు లభించింది. ఇటీవల ఆయనను వ్యక్తిగతంగా కలుసుకునే అదృష్టమూ దక్కింది. రస్కిన్ బాండ్‌ను సాహిత్య అకాడమీ ఆయన స్వగృహంలోనే సన్మానించిన సందర్భంగా ఆ విశిష్ట రచయితతో కొద్దిసేపు గడిపాను. ఆయన నిరాడంబరత, నిష్కాపట్యం నన్ను అమితంగా ఆకట్టుకున్నాయి. ఆడంబరం, అభిజాత్యం ఏ మాత్రంలేని ఉదాత్తుడు ఆయన. జీవితం పట్ల, మారుతున్న కాలం పట్ల వాస్తవిక దృక్పథమున్న వివేచనాశీలి.

ఒక రచయితగా రస్కిన్ బాండ్ హిమాలయ శిఖరాలను అధిరోహించారు. ఏడు దశాబ్దాలకు పైగా సాహిత్య వ్యాసంగంలో మునిగి ఉన్న ఆయనకు ఎల్లలు లేని సాహిత్య జగత్తునుంచి ఎంతగానో గౌరవమన్ననలు అందుతున్నాయి. ఎన్నో సంస్థ–దేశీయ, విదేశీ, అంతర్జాతీయ– ల నుంచి ఆయన ప్రతిష్ఠాత్మక అవార్డులు అందుకున్నారు. అయినా రస్టీ (రస్కిన్ సృష్టించిన ఒక అజరామర బాలుడి పాత్ర) స్రష్ట ప్రేమాస్పదుడు, స్నేహశీలిగా సర్వజనామోదం, గౌరవాదరాలు పొందుతున్న సుజనుడు. పేరు ప్రఖ్యాతులు ఆయన తలకెక్కలేదు. ఇటువంటి మంచి మనిషిని మనం తరచు చూడము, చూడలేము. ఇంతకూ రస్కిన్ బాండ్ ఎటువంటి రచయిత? ఈ వ్యాసం ఆరంభంలోనే నేను వివిధ రకాల రచయితలను, వ్యక్తిత్వాలను ప్రస్తావించాను. నేను పేర్కొన్న విభిన్న తరహా రచయితల సమ్మేళనమే మన ఈ సాహిత్య ఇంద్రజాలికుడు.

రస్కిన్ బాండ్ అక్షర మహామూర్తి. ఆయన్ని గౌరవించాలి. ఒక రచయితగా, భారతీయ పౌరుడుగా ఆయన్ని గౌరవించడం మన విధ్యుక్త ధర్మం. ఆయన కథలు, కవితలు, నవలలను సమస్త భారతీయ భాషలలోకి అనువదించుకోవాలి. అలా చేయని పక్షంలో జీవితంలో మనం విఫలమవుతాము. చేసిన పక్షంలో జీవితం మన పట్ల దయ చూపుతుంది. భావితరాలు మనలను ప్రశంసా పూర్వకంగా అభినందిస్తాయి.


రస్కిన్ బాండ్‌తో వ్యాసకర్త


• డాక్టర్ కె. శ్రీనివాసరావు
కేంద్ర సాహిత్య అకాడమీ కార్యదర్శి
(నేడు రస్కిన్ బాండ్ 90వ పుట్టినరోజు)

భాటియాలీ ధున్

'భాటియాలీ' – ఎంత విస్తరించినా, ఎంత విన్నా, ఎంత ఆలోచించినా తనివి తీరని ఒక ధున్... ఒక ట్యూన్. అది రాగం కాదు. దానికొక ఆరోహణ, అవరోహణ, నిర్దిష్ట సంచారం అంటూ ఉండదు.

దాన్ని మొదట అరవై అయిదు సంవత్సరాల క్రిందట విన్నాను. ప్రతి సంవత్సరం జనవరిలో హైదరాబాద్‌లో ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్ జరుగుతూ ఉంటుంది కదా. సాయంత్రం పూట చల్లని, ఆహ్లాద కరమైన, ప్రశాంతమైన వాతావరణంలో ఎగ్జిబిషన్‌కి వెడితే అక్కడ సన్నగా ఓ రికార్డు వినిపిస్తూ ఉండేది – 78 RPM రికార్డు. మూడు, మూడున్నర నిమిషాల రికార్డు. ఆ ట్యూన్ చాలా సింపుల్‌గా, నిరాడంబరంగా, ప్రశాంతంగా ఉంటుంది. అది సితార్ రికార్డు. సితార్ కనుక రవిశంకరే అయివుంటాడను కున్నాను. సితార్‌లో ఇంకొకరి పేరు తెలీదు అప్పట్లో. విన్న తర్వాత... హాంట్ చేస్తుండేది. అది 1957, 58 నాటి సంగతి.

అంతకుముందు 1956లో బెజవాడలో ఇంటర్మీడియట్ చదివిన కాలంలో వరసగా రెండు రోజులు మార్నింగ్ షో. విజయా టాకీసులో 'పథేర్ పాంచాలీ' బెంగాలీ సినిమా చూశాను. 'పథేర్ పాంచాలీ' అంటే 'పథికుని గీతం' అని అర్థం. సత్యజిత్‌రే తీసిన అద్భుతమైన చిత్రం అది. ఆ సినిమా, మరీ ముఖ్యంగా దాని థీమ్ మ్యూజిక్ హాంట్ చేస్తూ ఉంటుంది. దాని సంగీత దర్శకుడు రవిశంకర్. సినిమా అంతా ఆ ట్యూన్ సితార్ మీదా, ఫ్లూట్ మీదా వినిపిస్తూ ఉంటుంది. అది బెంగాలీ



ధున్.. భాటియాలీ ధున్. పద్మానదిలో పడవ నడుపుకునే వాళ్ళు పాడుకొనే ఒక ట్యూన్. ధున్.. గీతం. ఆ ట్యూన్ 'పథేర్ పాంచాలీ' సినిమా అంతటా రకరకాల విన్యాసాలతో వినిపిస్తూ ఉంటుంది. దాని పోలికలు నేను ఎగ్జిబిషన్‌లో విన్న రికార్డులో వినిపించడం వల్ల అది రవిశంకర్ రికార్డు అయివుంటుందని అనుకున్నాను. కాని అది రవిశంకర్‌ది కాదు – విలాయత్ ఖాన్‌ది. ఆ సంగతి సుమారు పాతికేళ్ళ తర్వాత – నేను రికార్డుల వేట సాగిస్తున్న రోజుల్లో తెలిసింది. విలాయత్ ఖాన్ రికార్డు 1950 ప్రాంతంలో ఎప్పుడో వచ్చింది– బాగా పాపులర్ అయింది.

'తెనాలి రామకృష్ణ' సినిమాలో భానుమతి పాడిన 'తీరని నా కోరికలే తీరెను ఈ వేళ' అనే పాటకు ఇన్‌స్పిరేషన్ విలాయత్ ఖాన్ రికార్డే. చాలా అందమైన పాట అది. దానికి సంగీతం కూర్చింది విశ్వనాథం – రామ్మూర్తి. విలాయత్ ఖాన్ ట్యూన్‌ని వీళ్ళు మొత్తంగా కాపీ కొట్టారనడానికి వీల్లేదు. చాలా మార్చి అందంగా తయారు చేశారు.

భాటియాలీ ధున్ బెంగాలీ సంగీత కళాకారు లందరికీ ఫేవరెట్. రవిశంకర్, అలీ అక్బర్ ఖాన్‌ల సితార్ – సరోద్ జుగల్బందీ రికార్డులో ఈ 'ధున్' వినిపిస్తుంది. పన్నాలాల్ ఘోష్ (ఫ్లూట్) ఒక రికార్డులో భాటియాలీ ధున్ వాయించాడు. నిఖిల్ బెనర్జీ (సితార్) ఒక రికార్డులో వాయించాడు. 'భాటియాలీ' రాగం కాదు – దానికి ఆరోహణ, అవరోహణ ఉండవు. రాగ లక్షణాలు ఉండవు. అందరి ట్యూన్‌లూ ఒకే రకంగా ఉండవు. కాని, వినగానే ఇది 'భాటియాలీ' అని గుర్తించవచ్చు. ఎస్.డి. బర్మన్‌కి ఈ భాటియాలీ చాలా ఇష్టం. 'సుజాత' సినిమాలో 'సున్ మోరే బంధూరే' అనే పాట ఆయన స్వయంగా పాడాడు. అద్భుతమైన పాట. అది ఆయన పాడితేనే బావుంటుంది.

భాటియాలీలో ఇంకో పాట 'సుజాత' కంటే చాలా ముందు ఒక బెంగాలీ రికార్డులో పాడాడు. దాన్నే మళ్లీ హిందీలో 'ధీరెసె జానా బగియన్ మే భవరా' అంటూ పాడాడు. దాన్ని పారడీ చేస్తూ కిషోర్ కుమార్ చేత 'ధీరెసె జానా ఖటియన్ మే ఖట్‌మల్' అని పాడించాడు – 'ఛుపా రుస్తుమ్' చిత్రంలో. బర్మన్ పాడిన మరో అద్భుతమైన పాట 'బందిని' సినిమాలోని 'ఓరే మాఝీ... ఓరే మాఝీ... మెరె సాజన్ హై ఉస్ పార్' పాట.

'భాటియాలీ' దక్షిణాది సినిమాల్లోకి కూడా వచ్చింది. 'కలసి ఉంటే కలదు సుఖం' సినిమాలోని 'ముద్ద బంతి పూలు పెట్టి మొగలి రేకులు జడను చుట్టి' అనే పాట ఘంటసాల, సుశీల పాడినది చాలావరకు 'సున్ మోరే బంధూరే' పాటకు అనుకరణే. ఆ పాట పెద్ద హిట్ అయింది. 'కలసి ఉంటే కలదు సుఖం' తాలూకు ఒరిజినల్ తమిళ చిత్రంలో కూడా ఆ పాట అదే ట్యూన్‌తో ఉన్నట్లుంది.

బెంగాలీ 'భాటియాలీ' లాంటిదే రాజస్థానీ 'మాండ్'. అదీ జానపద సంగీత మూలం కలిగినదే. అది రాజస్థాన్ ఎడారిలో బిడారులు పాడుకునే ట్యూన్. బెంగాల్‌లో భాటియాలీ ఎంత ప్రసిద్ధమో రాజస్థాన్‌లో 'మాండ్' అంత ప్రసిద్ధం. రెండూ ఇంచుమించు ఒకే మాదిరిగా ఉంటాయి. సారంగి వాద్య కళాకారులు ఆ రాగాన్ని అద్భుతంగా వాయిస్తారు.

○ నం.పా.సా

ఐదు శతాబ్దాల మేళత్తూరు భాగవత మేళ

శ్రీరంగంలోని రంగనాథాలయం జరుపుకునే ఉగాది మీకు తెలుసా? ఆ కావేరీ రంగనాథుడు తెలుగు ఉగాదే జరుపుకుంటాడు. భాషా ప్రయుక్త రాష్ట్రాలు అనగానే భౌతికమైన ప్రాంతాలు అనే నిర్వచనాన్ని అలవోకగా తీసుకోవడం వల్ల కొన్ని కీలకమైన విషయాలు చేజారిపోయాయేమో అని అనిపిస్తుంది. ప్రతి ఏటా నరసింహ జయంతికి తంజావూరుకు సమీపంలో ఉండే మేళత్తూరు అనే గ్రామంలో తెలుగు భాగవతమేళ సాంప్రదాయం సుమారు ఐదు శతాబ్దాలుగా ఉందంటే తెలుగు పునాదులు ఏ స్థాయిలో ఉన్నాయో గమనించాలి. కావేరీ తీరంలో ఉండే ఈ మేళత్తూరు, తెలుగు భాషతో కర్ణాటక సంగీతానికి పీఠాన్ని, చట్టాన్ని సిద్ధం చేసిన త్యాగరాజస్వామి సమాధి ఉండే తిరువయ్యూరుకు ఎంతో దూరంలో లేదు.

1550లో విజయనగర సామ్రాజ్య చక్రవర్తులు చెవ్వప్ప నాయకుని కుమారుడైన అచ్యుతరాయలను తంజావూరు పాలకుడిగా నియమించారు. కళాదృష్టితో భాగవతమేళ సంప్రదాయ నైపుణ్యంలో నిష్ణాతులైన 500 మంది బ్రాహ్మణులకు భూదానం సమృద్ధిగా చేసి ఆశ్రయం కల్పించారు. అదే అచ్యుతాపురం లేదా ఉన్నతాపురం. దీనినే తమిళంలో మేళత్తూర్ లేదా మేళట్టూర్ అని అంటారు. త్యాగరాజ స్వామికి సమకాలీనులైన మేళత్తూరు వెంకటరామశాస్త్రి రచించిన పది నాట్య నాటకాలను ఇప్పుడు ఈ మేళత్తూరు భాగవత మేళ కళారూపానికి ప్రామాణికంగా పరిగణిస్తున్నారు. వెంకట్రామ శాస్త్రి తండ్రి గోపాలకృష్ణయ్య, కూచిపూడి సిద్ధేంద్రయోగికి మిత్రులు, సమకాలీనులనీ; వీరిద్దరూ నారాయణ తీర్థుల శిష్యులని అంటారు. అంతకుమించి నారాయణ తీర్థులు కూడా కొంతకాలం ఈ మేళత్తూరులో ఉన్నారని కూడా నమ్ముతున్నారు.



కూచిపూడి, భరతనాట్యం వలే సంపద్వంతమైన శాస్త్రీయ కళ 'మేళత్తూరు భాగవతమేళ'. అయితే ఇది నాట్య పద్ధతుల కన్నా విభిన్నమైనది. ఎందుకంటే ఈ కళారూపం నాట్యం, నాటకం మేళవింపు. అంతకుమించి నాట్యంలో అవకాశాలు లేని పురుషులకు అవకాశం కల్పించాలని ఈ ప్రయోగం జరిగింది కనుకనే, ఇందులో నటన, నాట్యం, గానం, సంగీతం ఈ మూడింటిని పురుషులే నిర్వహిస్తారు. అంతకుమించి స్త్రీ పాత్రలను కూడా (ఇప్పటికీ) పురుషులే ధరిస్తున్నారు. అందువల్లనే స్త్రీ పాత్రలకు సంభాషణలు చాలా చాలా తక్కువగా ఉంటాయి లేదా ఉండనే ఉండవు. భరతనాట్యం తమిళ ప్రాంతంలోనూ కూచిపూడి తెలుగు ప్రాంతంలోనూ వృద్ధి చెంది ప్రాచుర్యం గడించాయి. అయితే మేళత్తూరు భాగవతమేళ పూర్తి సాంప్రదాయ బద్ధంగా, కొన్ని కుటుంబాల మధ్యనే నిలిచిపోయింది. సరైన గుర్తింపు, వేదిక లేక పోవడంతో దీనిని జానపద కళారూపంగా కూడా పేర్కొనడం కూడా ఉంది. ఇది తెలుగు కళారూపం కానీ, నిలబడి సాగుతున్నది తమిళ ప్రాంతానికి కేంద్ర స్థానం వంటి తంజావూరు చెంత. కనుకనే రెండు, మూడు దశాబ్దాల క్రితం దాకా ఈ భాగవతమేళ గురించి ప్రధాన స్రవంతి సమాచారంగా కూడా మనకు తెలుగు ప్రాంతంలో అందుబాటులో ఉండేది కాదు.

ఒకప్పుడు చాలా ప్రాంతాల్లో ఈ భాగవతమేళ నడిచేది. మొన్న మొన్నటిదాకా తంజావూరు ప్రాంతంలో శాలియమంగళం, శూలమంగళం, నల్లూరు, ఊతకాడు, పులిమేడు, గోవిందాపురం, తిరువిళ నెల్లూరు, తేపేరమానల్లూరు వంటి గ్రామాల్లో విరివిగా ప్రదర్శనలు జరిగేవి. ఇప్పటికీ చెదురుమదురుగా జరుగుతున్నాయి కూడా. అయితే వీటిలో ఊరు ఊరుకూ ప్రదర్శనల్లో కొంత తేడా కూడా కనబడుతుంది. కొన్ని చోట్ల నాట్యం ప్రధానంగా ఉండడం, కొన్నిచోట్ల నాటకంలాగా ఎక్కువ సంభాషణలు ప్రధానంగా ఉండడం కూడా గమనించవచ్చు. నిజానికి తెలుగు, తమిళ భాషల్లో మహోర్క్తి కట్టిన 'భక్త ప్రహ్లాద' సినిమాకు కూడా ఈ కళారూపమే మాతృక అని అన్నా ఆశ్చర్యం లేదు. ఏడెనిమిది సంవత్సరాల క్రితం మేళత్తూరు ప్రదర్శనకు వెళ్ళినప్పుడు, తెల్లవారుజామున మూడు, నాలుగు ఊర్లు కూడా వెళ్లి ఆయా ప్రదర్శనలను కొంత కొంత పరిశీలించిన అనుభవం భవదీయుడుకు ఉంది. అయితే కేంద్ర స్థానం మాత్రం మేళత్తూరు మాత్రమే. ఇప్పటికీ ప్రతి నరసింహ జయంతికి విద్యుత్ దీపాలు లేకుండా, అరటి బోదెల మీదుంచిన ఆముదం దీపాల వెలుగులో ఈ ప్రదర్శనను మహానిష్ఠగా చేస్తున్నారు.

వెంకట్రామశాస్త్రికి ముందే ఈ కళారూపం మొదలై స్థిరపడి ఉండాలి. అయితే శాస్త్రి పది నాట్యనాటకాలను రచించి చట్రాన్ని సిద్ధం చేశారు అందులో 9 తెలుగు కాగా ఒకటి తమిళం. ప్రహ్లాద చరిత్ర, రుక్మిణి కళ్యాణం, సీతా కళ్యాణం, ఉషా పరిణయం, కృష్ణ జనన లీల, మార్కండేయ చరిత్ర, పార్వతీ కళ్యాణం, ధ్రువ చరిత్ర, హరిహర లీలా విలాసం, హరిశ్చంద్ర. తంజావూరు ప్రాంతం తెలుగు నాయకులు, తర్వాత మరాఠీ ప్రభువుల చేతికి వెళ్ళింది. వారు కూడా ఈ కళా సంప్రదాయాన్ని ప్రోత్సహించారనడానికి ఆధారాలు ఉన్నాయి. 1696–1797 మధ్యకాలంలో జీవించిన మహారాజు రెండవ ఏకోజి 'శాకుంతలం' అనే మరాఠీ భాగవత మేళను రచించారు. ఈ కళాసంప్రదాయాలు తాళపత్ర గ్రంథాల కాలం నాటివి. అవి ఉచ్ఛ దశలో ఉన్నప్పుడు అచ్చు సదుపాయాలు అందుబాటులోకి రాలేదు. కనుక ప్రధానంగా మౌఖికంగానే వాటిని నేర్చుకొని, నైపుణ్యం సాధించారు. తర్వాతి కాలంలో ఈ కళారూపంలో ప్రవేశించిన వారు తమిళ లిపిలో రాసుకుని ప్రదర్శించడం మొదలైంది. భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడటానికి ముందు, తర్వాత ఈ కళారూపం పట్ల పెద్దగా ఆసక్తి చూపినట్టు లేదు. అంతకుముందు కాలంలో రాజ సంస్థానాల తోడ్పాటుతో పరిఢవిల్లాయి. గడచిన ఏడు దశాబ్దాలలో మేళత్తూరు గ్రామం తెలుగు ప్రాంతపు సరిహద్దుకు 500 కిలోమీటర్లు కావడంతో మనం చాలా సాంస్కృతిక మూలాలను మరిచిపోయినట్టే దీన్ని కూడా మరచిపోయామేమో!

1964లో భాగవతమేళా నాట్య విద్యా సంఘం ఏర్పడింది. అంతకు ముందు ఎటువంటి బ్యానర్ లేకుండా ఈ ప్రదర్శనలు జరిగేవి. అయితే భారతం నటేశమయ్యర్ ఎంతో కృషి చేశారు. అంటే 60 ఏళ్లుగా ప్రతి నరసింహ జయంతికి తప్పనిసరిగా ఈ మేళత్తూరు వెంకట్రామ శాస్త్రి రచించిన 'ప్రహ్లాద చరిత్ర'ను ప్రదర్శింపబడుతూనే ఉంది. అలాగే మద్రాస్, కాంచీపురం, తిరవయ్యారు, తిరువనంతపురం ఇలా ఈ ప్రదర్శనలు ఆదరణ పాత్రమయ్యాయి. 'హరిశ్చంద్ర' నాట్య నాటకం తాళపత్ర ప్రతి ఈ విద్యా సంఘం దగ్గర జాగ్రత్తగా భద్రపరచబడింది. అలాగే నటేశమయ్యర్ చేసిన పరిశోధనలకు సంబంధించిన ఆధారాలు కూడా ఈ సంస్థ దగ్గరే ఉన్నాయి. 1995లో 'మార్కండేయ' ప్రతిని తొలిసారి వ్యాఖ్యానంతో ప్రచురించారు. 2013లో 'ఏన్షియంట్ టెంపుల్ థియేటర్ ఫామ్స్ ఆఫ్ సౌత్ ఇండియా' మోనోగ్రాఫ్‌ను కూడా ఈ విద్యా సంఘం ప్రచురించింది.

> కూచిపూడి, భరతనాట్యం వలే సంపద్వంతమైన శాస్త్రీయ కళ 'మేళత్తూరు భాగవతమేళ'. ఇది తెలుగు కళారూపం కానీ, నిలబడి సాగుతున్నది తమిళనాడులోని తంజావూరు చెంత. ఈ కళారూపం నాట్యం, నాటకం మేళవింపు. ఇందులో నటన, నాట్యం, గానం, సంగీతం మూడింటిని పురుషులే నిర్వహిస్తారు. మేళత్తూరు భాగవతమేళ సాంప్రదాయ బద్ధంగా, కొన్ని కుటుంబాల మధ్యనే నిలిచిపోయింది.




ఇప్పుడు రెండు బృందాలు ఈ మేళత్తూరు భాగవతమేళ కళారూపాన్ని పరిరక్షిస్తూ ప్రచారం చేస్తున్నాయి. ఒక బృందానికి సారథి అయిన నటరాజన్ కొన్ని సంవత్సరాల క్రితం కనుమూయగా వారి తమ్ముడు కుమార్ ఈ కృషి కొనసాగిస్తున్నారు. మరొక వ్యక్తి ఆర్.మహాలింగం అయ్యర్. మేళత్తూరులో కె.రామలింగ అయ్యర్, భాగ్యలక్ష్మి దంపతులకు 1954 సెప్టెంబర్ 13న జన్మించిన మహాలింగం ఎనిమిదేళ్ల వయసులో ఈ కళారూపంలోకి స్త్రీ పాత్రల ద్వారా ప్రవేశించారు. 1975లో ఎకనామిక్స్‌తో బీఏ పూర్తి చేసినా, ఈ కళారూపం మీద మక్కువతో ఏ ఉద్యోగంలో చేరకుండా అదే ఊరులోనే ఉండిపోయారు. పద్మశ్రీ బాలు భాగవతార్‌తో పాటు కలైమామణి పీకే సుబ్బయ్యర్, కలైమామణి టిజి పావు పిళ్ళై, కలైమామణి హేమాంబరనాథన్ వంటి వారు మహాలింగం గురువులు.

1989 నుంచి ఒక నిష్ఠగా, మహాలింగం ఈ కార్యక్రమాన్ని ప్రతి ఏటా ఉత్సవంగా కొనసాగిస్తున్నారు. దాతల విరాళం ఉంటుంది, కానీ కొన్నిసార్లు అది సరిపోక ఇబ్బంది పడిన సందర్భాలు లేకపోలేదు. ఒకసారి అగ్ని ప్రమాదంలో ఎంతో నష్టం సంభవించింది కూడా. సినీనటుడు అరవిందస్వామి తండ్రి విడి.స్వామి మేళత్తూరు గ్రామానికి చెందినవారే. వీరు స్థాపించిన 'మెలట్టూరు భాగవతమేళా నాట్య నాటక ట్రస్ట్' నల్లి కుప్పస్వామి చైర్మన్‌గా ఈ కార్యక్రమాలు చేస్తోంది. ఆ గ్రామంలో ఉండే నరసింహ దేవాలయం ప్రాంగణంలోనే ఒక స్థిరమైన ఆడిటోరియం కూడా ఇప్పుడు నిర్మాణమైంది. వీటన్నిటికీ కేంద్ర బిందువుగా నిలిచింది మహాలింగం అయ్యర్. మహాలింగం తన బృందంతో ప్రదర్శనలను మేళత్తూరులో ఏటా నిర్వహిస్తూనే; తిరుపతి, హైదరాబాదు, గుంటూరు, రాజమండ్రి వంటి తెలుగు ప్రాంతాలతో సహా ఇతర ప్రాంతాల్లో ప్రదర్శనలు ఇచ్చారు. దీనికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలతో పాటు తిరుమల తిరుపతి దేవస్థానం, తెలుగు విశ్వ విద్యాలయం వంటివి ఎంతో కొంత సాయం చేస్తున్నాయి. కానీ ఇంకా పెద్ద ఎత్తున దోహదపడాల్సిన అవసరం ఉంది. ఈ భాగవతమేళలో పాల్గొనే నటులు వేర్వేరు ఊళ్ళలో ఉద్యోగాలు చేస్తూ ప్రదర్శన ఉన్న సమయంలో మాత్రం తప్పనిసరిగా వచ్చి పాల్గొనడం రివాజు.

ప్రధాన మేళత్తూరు భాగతమేళా ప్రతులన్నీ తెలుగులోనే ఉన్నాయి, వీటిని తెలుగు తెలియని వారు కంఠస్థం చేసి ప్రదర్శన ఇస్తున్నారు. ఇలా జరిగినప్పుడు జరగబోయే, జరిగే ప్రమాదాలు గమనించి మహాలింగం అయ్యర్ 2016 నుంచి వీటిని పరిష్కరించి ప్రచురిస్తున్నారు. అది కూడా తెలుగులో ఒక పేజీ, దాని కెదురు పేజీలో సంస్కృతంలో ఉంటుంది. ఇంతవరకు ప్రహ్లాద చరిత్ర, సీతా కళ్యాణం, మార్కండేయ చరిత్ర, ఉషా పరిణయం, కృష్ణ జననం ప్రచురించారు. ఈ సంవత్సరం మే 21వ తేదీ నరసింహ జయంతి రోజున మేళత్తూరులో 'హరిశ్చంద్ర' పుస్తక ఆవిష్కరణతో పాటు 'ప్రహ్లాద చరిత్ర' ప్రదర్శన కూడా ఉంటుంది.

■ డాక్టర్ నాగసూరి వేణుగోపాల్
(మే 21న నరసింహ జయంతి. మేళత్తూరులో 'ప్రహ్లాద చరిత్ర' ప్రదర్శన, 'హరిశ్చంద్ర' పుస్తకావిష్కరణ)



చెత్తపన్ను వసూళ్లపై పురపాలక సంఘాలు మళ్లీ దృష్టిపెట్టాయి. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్, మచిలీపట్నం మున్సిపల్ కార్పొరేషన్‌తోపాటు వైఎస్సార్ తాడిగడప, గుడివాడ, ఉయ్యూరు మున్సిపాలిటీల్లో చెత్తపన్ను వసూలు చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. విజయవాడ కార్పొరేషన్‌లో అయితే శనివారం మధ్యాహ్నం వార్డు సచివాలయాల వారీగా లక్ష్యాలను నిర్దేశించారు. సాయంత్రంలోగా ఆ మొత్తాన్ని చెల్లించేయాలని ఆదేశాలు జారీ చేశారు.

చిరుజల్లులు



జిల్లాను శనివారం కూడా వర్షం తడిపేసింది. కొన్ని ప్రాంతాల్లో ఉదయం నుంచి చిరుజల్లులు, ఓ మోస్తరు వర్షం కురవడంతో జనజీవనం అస్తవ్యస్తమైంది. నగరంలో ఉదయం నుంచి వాతావరణం చల్లగానే ఉంది. చిరుజల్లులు కురుస్తూనే ఉన్నాయి. కాగా, రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షానికి నగరంలోని ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

చెత్త టార్గెట్



- తలలు పట్టుకుంటున్న శానిటరీ అసిస్టెంట్లు
- విజయవాడలో రూ.24 కోట్లు.. మచిలీపట్నంలో రూ.5.04 కోట్లు

చెత్త పన్ను వసూలు చేయాలని ఒక్కసారిగా టార్గెట్లు

మళ్లీ చెత్తపన్ను వసూలు చేయాలని ఆదేశాలు

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : వైసీపీ అధికారంలోకి వచ్చాక 2021, నవంబరు 1 నుంచి చెత్తపన్ను వసూలుకు తెరతీశారు. తొలుత నెలవారీగా వసూలు చేయాలని భావించినా ప్రజల్లో వ్యతిరేకత రావడంతో ఆస్తిపన్నుతో కలిపి ఆరు నెలలకోసారి వసూలు చేసేలా నిర్ణయం తీసుకున్నారు. అయినప్పటికీ చెత్తపన్ను చెల్లింపునకు ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. అదే సమయంలో టీడీపీ అధినేత చంద్రబాబు.. తాము అధికారంలోకి రాగానే చెత్తపన్ను రద్దు చేస్తామని ప్రకటించారు. దీంతో తొలి నుంచి చెత్తపన్నుపై ఆగ్రహంతో ఉన్న జనం పన్ను కట్టేందుకు విముఖత చూపడం మొదలుపెట్టారు.

జనం నుంచి వ్యతిరేకత రావడంతో వెనక్కి..

విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో మొత్తం 2.85 లక్షల కుటుంబాల నుంచి చెత్త పన్ను వసూలు చేయాలని నిర్ణయించారు. నగరంలో కాల్వగట్ల పక్కన, కొండప్రాంతాలు సహా నగరంలో 109 మురికివాడలను గుర్తించారు. వీటిలో 82 వేలకుపైగా కుటుంబాలు నివాసం ఉంటున్నట్లు లెక్క తేల్చారు. వీరి నుంచి నెలకు రూ.30 చెత్తపన్ను వసూలు చేయాలని నిర్ణయించారు. మిగిలిన ప్రాంతాలు, అపార్ట్‌మెంట్లు, వాణిజ్య సముదాయాలకు నెలకు రూ.120గా నిర్ణయించారు. వాణిజ్య సంస్థల నుంచి రూ.5 వేల వరకు వసూలు చేస్తున్నారు. చెత్తపన్ను ద్వారా ఏటా రూ.45.50 కోట్లను వసూలు చేయాలని భారీ లక్ష్యాలను నిర్దేశించుకున్నారు. జనం నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో అధికారులు వెనక్కి తగ్గారు.

తాజాగా మళ్లీ..

నెలకు రూ.2 కోట్ల చొప్పున ఏటా రూ.24 కోట్ల వసూలు లక్ష్యంగా నిర్ణయించారు. ప్రస్తుతం వీఎంసీ పరిధిలో నెలకు రూ.1.2 కోట్ల చెత్తపన్ను వసూలవుతోంది. ఈ నేపథ్యంలో శనివారం మధ్యాహ్నం వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్ని వార్డు సచివాలయాలకు సర్క్యులర్ జారీ చేశారు. సాయంత్రంలోగా రూ.50 లక్షలు వసూలు చేయాలని ఆదేశించారు. అసలే చెత్తపన్ను కట్టడానికి జనాలు విముఖత చూపుతుంటే, ఈ ఒత్తిడి ఏమిటని శానిటరీ అసిస్టెంట్లు తలలు పట్టుకుంటున్నారు. మచిలీపట్నం మున్సిపల్ కార్పొరేషన్‌లో చెత్తపన్ను ద్వారా ఏడాదికి రూ.5.04 కోట్లు వసూలు చేయాలని లక్ష్యం కాగా, అందులో సగం కూడా వసూలు కావడం లేదు. దీంతో ఇక్కడ కూడా శానిటరీ అసిస్టెంట్లకు లక్ష్యాలను నిర్దేశించి వసూలు చేయాలని ఆదేశిస్తున్నారు. రెండు జిల్లాల్లోని మున్సిపాలిటీలన్నింటిలోనూ చెత్త పన్ను వసూళ్ల లక్ష్యాలను నిర్దేశిస్తున్నారు.

చెత్తపన్ను కట్టొద్దు

అధికారంలోకి రాగానే చెత్తపన్ను రద్దు చేస్తామని టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించారు. వైసీపీ పాలనలో ప్రజలపై భారాలు మోపడంపై చూపిన శ్రద్ధ పాలనపై చూపలేదు. ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగిన వీఎంసీ బడ్జెట్ సమావేశంలో చెత్తపన్ను రద్దు చేసే సమస్యే లేదని మేయర్ రాయన భాగ్యలక్ష్మి ప్రకటించారు. పాలన చేతకాని పాలకులు ఉంటే ప్రజలపై భారాలు మోపడం తప్ప ప్రజల సంక్షేమంపై దృష్టి పెట్టరనడానికి ఇదే నిదర్శనం.

- ముమ్మనేని ప్రసాద్, 13వ డివిజన్ కార్పొరేటర్

పూడిక తీసేదెలా..?

పనులు ఫుల్.. నిధులు మాత్రం నిల్



- తూటుకాడతో నిండిపోయిన కాల్వలు
- ఓఅండ్ఎం ప్రతిపాదనలన్నీ పెండింగ్
- వర్షాకాలం సమీపిస్తున్నా స్పందన శూన్యం
- నిండుకున్న నీటి తీరువా నిధులు

వర్షాలు పడుతున్నాయి.. జూన్ మొదటి వారంలోనే నైరుతి ప్రవేశించే సూచనలు కనిపిస్తున్నాయి.. ఖరీఫ్ సీజన్ ప్రారంభమయ్యే అవకాశాలూ ఉన్నాయి.. అయినా ఇంతవరకు కాల్వల సమస్యను కొలిక్కి తెచ్చింది లేదు. తూటుకాడతో నిండిన కాల్వలను తొలగించకుండా పంటపొలాలకు సాగునీరెలా అందుతుందని రైతులు సందిగ్ధంలో ఉండగా, నిధులు లేక ఎలా తూటుకాడ తొలగింపు పనులు చేపట్టాలోనని అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : బందరు.. ఏలూరు.. రైవస్.. ఈ మూడు కాల్వలు.. కృష్ణా తూర్పు ప్రధాన కాల్వ నుంచి మూడు భాగాలుగా విడిపోయి దిగువకు ప్రవహిస్తాయి. అక్కడి నుంచి మరికొన్ని భాగాలు విడిపోతాయి. ఈ కాల్వలే కృష్ణాజిల్లాకు సాగు, తాగునీటిని అందజేస్తాయి. వీటిద్వారా నీరు ప్రవహించాలంటే పేరుకుపోయిన పూడిక, గుర్రపుడెక్కను తొలగించాలి. ఈ ఏడాది ఈ రెండు పనులు జరిగే పరిస్థితి లేదు.

మార్చి నెలాఖరున కాల్వలు మూసివేశాక ఎక్కడెక్కడ ఏయే పనులు చేపట్టాలో ప్రతిపాదనలు తయారుచేస్తారు. ఈ ఏడాది రూపొందించిన ప్రతిపాదనలు జలవనరుల శాఖ ఎస్ఈ కార్యాలయంలో మూలుగుతున్నాయి. సాధారణంగా రైతుల నుంచి వసూలు చేసిన నీటితీరువా నిధులతో ఈ పనులు చేస్తుంటారు. అధికార పార్టీ ప్రజాప్రతినిధులు ఈ నిధులను మొత్తం ఖాళీ చేశారు. కమీషన్లు కురిపించే పనులు ప్రతిపాదించుకుని ఖజానాను మొత్తం ఖాళీ చేశారు.

పూడికతీత ఏదీ..?

గడిచిన ఏడాది పూడికతీత కాకుండా కాల్వల్లో ఉన్న తూటికాడ తొలగింపునకు చర్యలు తీసుకున్నారు. వాస్తవానికి మూడేళ్లకోసారి కాల్వల్లో కచ్చితంగా పూడికతీత తీయాల్సి ఉంది. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఈ పనులు చేయలేదని రైతులు చెబుతున్నారు. చేశామన్న పేరుకు మాత్రం యనమలకుదురు లాకులు నుంచి కంకిపాడు వరకు ఒక ఏడాది పైపైన పనులు చేశారు.

30 పనులకు ప్రతిపాదనలు

ఉమ్మడి కృష్ణాజిల్లా జలవనరుల శాఖలో మొత్తం నాలుగు డివిజన్లు ఉన్నాయి. కృష్ణా సెంట్రల్, కృష్ణా తూర్పు, డ్రెయినేజీ, స్పెషల్ డివిజన్లు ఉన్నాయి. ఈ నాలుగు డివిజన్ల పరిధిలోని ఆయకట్టుకు సాగునీటి సరఫరా సక్రమంగా జరగాలంటే ఆపరేషన్ అండ్ మెయింటినెన్స్ (ఓఅండ్ఎం) పనులు ఏటా నిర్వహించాలి. ఈ పనులను కాల్వలకు నీటి సరఫరా నిలుపుదల చేశాక చేపడతారు. ఈ ప్రతిపాదనలు జిల్లా ఎస్ఈ కార్యాలయం నుంచి కాడా కార్యాలయానికి వెళ్తాయి. అక్కడ ఆమోదముద్ర వేశాక పనులకు టెండర్లు ఆహ్వానిస్తారు. ఆ తర్వాత ప్రతిపాదించిన పనులు చేస్తారు. స్పెషల్, డ్రెయినేజీ డివిజన్లలోనే ఎక్కువ పనులు జరుగుతాయి. ఈ ఏడాది మొత్తం 30 పనుల వరకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. డీఈలు రూపొందించిన ఈ ప్రతిపాదనలు కొద్దిరోజుల క్రితమే విజయవాడలోని ఎస్ఈ కార్యాలయానికి చేరాయి. వాటిని కమాండ్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (కాడా)కు పంపే సాహసం అధికారులు చేయలేకపోతున్నారు. ఈ పనులకు కాడా ఆమోదముద్ర వేస్తే టెండర్లు ఆహ్వానించి పనులు చేపట్టాలి. కాంట్రాక్టర్లకు డబ్బులు చెల్లించడానికి నిధుల్లేవు. సాధారణంగా ఈ పనులను రైతుల నుంచి వసూలు చేసిన నీటితీరువా నిధులతో చేయాలి. జిల్లాలో నీటితీరువా నిధులు నిండుకున్నాయి. ఈ పరిస్థితుల్లో ఓఅండ్ఎం పనులను ఏ నిధులతో నిర్వహించాలో అధికారులకు తెలియడం లేదు.



ఆగని ఇసుక దోపిడీ

- కీసర స్టాక్ యార్డు వద్ద కొనసాగిన అక్రమ తరలింపు
- టీడీపీ ఆందోళన చేసినా పట్టించుకోని అధికారులు

కంచికచర్ల, మే 19 : కీసర స్టాక్ యార్డు వద్ద ఇసుక దోపిడీ శనివారం కూడా కొనసాగింది. అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని టీడీపీ నాయకులు ఆందోళన చేసినా, మీడియాలో కథనాలు వచ్చినా అధికారుల్లో కనీస చలనం లేదు. ఇసుక అక్రమ దోపిడీ విషయం తెలుసుకున్న టీడీపీ నేతలు నెమలపురి అమ్మారావు (గాంధీ), కలతోటి అజయ్‌కుమార్ తదితరులు శుక్రవారం మధ్యాహ్నం స్టాక్‌యార్డు వద్ద ఆందోళనకు దిగిన విషయం తెలిసిందే. దీంతో ట్రాక్టర్లు, యంత్రాలను కొద్దిసేపు బయటకు పంపించారు. దీనిపై 'ఆంధ్రజ్యోతి'లో కథనం కూడా వచ్చింది. అంతటితో ఆగని అక్రమార్కులు శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం మధ్యాహ్నం వరకూ ఇసుకను భారీగా తరలించారు. శుక్రవారం రాత్రంతా స్టాక్ యార్డు ఇసుకను యంత్రాలతో ట్రాక్టర్లకు, లారీలకు లోడ్ చేస్తూనే ఉన్నారు. టన్నుకు రూ.680 చొప్పున వసూలు చేశారు. లోడింగ్‌ను బట్టి ఒక్కో లారీకి రూ.25 వేల నుంచి రూ.30 వేలకు పైగా వసూలు చేస్తున్నారు. వేబిల్లులు కూడా లేవు. శనివారం మధ్యాహ్నం వరకు లోడింగ్ జరుగుతూనే ఉంది. విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై ఇంత జరుగుతున్నా అధికారులు కనీస చర్యలు తీసుకోలేదు. ఈ దోపిడీని మరోసారి ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లేందుకు టీడీపీ నాయకులు సిద్ధమవుతున్నారు. కాగా, శనివారం రాత్రి కంచికచర్ల పోలీసులు కీసర స్టాక్ యార్డుపై దాడులు చేశారు. ఒక లారీ, ఎక్స్‌కవేటర్‌తో పాటు ఇద్దరు ఆపరేటర్లను అదుపులోకి తీసుకున్నారు.

కేసు దర్యాప్తు జరిగేనా?

ఒకవైపు కృష్ణానది, మరోవైపు మునేటిలో ఇసుక అక్రమ తవ్వకాలపై కంచికచర్ల మండలం కొత్తపేటకు చెందిన అబ్బూరు నాగమల్లేశ్వరరావు గతనెల 27న ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఈసీ ఆదేశాలతో కంచికచర్ల పోలీసులు నాగమల్లేశ్వరరావు నుంచి ఫిర్యాదు తీసుకుని 30వ తేదీన 142/2024 నెంబర్‌తో సెక్షన్ 379, 171-హెచ్, ఐపీసీ 27, 35 ఏపీ వాల్టా చట్టం కింద కేసు నమోదు చేశారు. అయితే, కేసు కట్టి చేతులు దులుపుకొన్నారు తప్ప దర్యాప్తు మాత్రం ముందుకు సాగలేదని టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు.

మౌనానికి కారణమేంటి?

ప్రభుత్వానికి చెందిన కీసర స్టాక్ యార్డు నుంచి అనుమతులు లేకుండా ఇసుక దోపిడీ చేస్తున్నప్పటికీ వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు మౌనంగా ఉండటానికి కారణమేమిటని టీడీపీ నేతలు ప్రశ్నిస్తున్నారు. ఒకవేళ ఇసుక తరలింపునకు అనుమతులు ఉంటే బయటపెట్టకపోవటంలో అంతర్యమేముందని అంటున్నారు.

మాపైనే ఫిర్యాదు చేస్తారా..!

ఏపీటీడీసీ డిప్యూటీ మేనేజర్ శివారెడ్డి సస్పెన్షన్

- కోడ్ ఉండగా ఉద్యోగ నియామకాలు
- కొందరు ఉద్యోగుల ఫిర్యాదులు
- ఈసీకి ఫిర్యాదు చేశారన్న కారణంతో ఉన్నతాధికారుల చర్యలు

- 6లో..


గులకరాయి దాడి కేసులో వాంగ్మూలం నమోదు

విజయవాడ, మే 18 (ఆంధ్రజ్యోతి) : అజిత్‌సింగ్ నగర్‌లోని వివేకానంద స్కూల్ వద్ద సీఎం జగన్‌పై గులకరాయి దాడికి సంబంధించి ఇద్దరు మైనర్ల వాంగ్మూలాన్ని మొదటి ఏసీఎంఎం కోర్టులో శనివారం నమోదు చేశారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు సతీష్ కుమార్‌తో పాటు మరో ఐదుగురు మైనర్లను పోలీసులు అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. తర్వాత వారిని ఇళ్లకు పంపేశారు. ఈ ఐదుగురిలో ఇద్దరిని సాక్ష్యులుగా గుర్తించి సీఆర్పీసీ 164 ప్రకారం వాంగ్మూలం నమోదు చేయాలని పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. ఆ ఇద్దరి వాంగ్మూలాన్ని శనివారం కోర్టు నమోదు చేసింది.

అనుమానం పెనుభూతమై..

రోకలి బండతో కొట్టి భార్యను హతమార్చిన భర్త

- బందరు మండలం బొర్రపోతుపాలెంలో ఘటన



శివనాగరాణి (ఫైల్)

మచిలీపట్నం టౌన్, మే 18 : పదిహేడేళ్ల పాటు కాపురం చేసిన భార్యను రోకలిబండతో అతికిరాతకంగా హతమార్చాడు ఓ భర్త. బందరు మండలం బొర్రపోతుపాలెం గ్రామంలో శనివారం జరిగిన ఈ హత్య స్థానికంగా కలకలం రేపింది. ఆర్‌పేట సీఐ శ్రీనివాసరావు కథనం ప్రకారం.. బొర్రపోతుపాలెం గ్రామానికి చెందిన శివనాగరాజుకు, జింజేరు గ్రామానికి చెందిన శివనాగరాణి (36)తో పదిహేడేళ్ల కిందట వివాహమైంది. వీరికి ముగ్గురు పిల్లలు. రోజువారీ కూలీ చేసుకుంటూ జీవిస్తున్నారు. మొదటి నుంచి భార్యపై అనుమానంతో ఉన్న శివనాగరాజు శనివారం మరింత రెచ్చిపోయాడు. శనివారం మధ్యాహ్నం కుమార్తెతో కలిసి నిద్రపోతున్న నాగరాణిని విచక్షణారహితంగా రోకలిబండతో కొట్టాడు. కుమార్తె అనిత వద్దని వారించినా వినిపించుకోలేదు. కాళ్లు పట్టుకుని బతిమాలినా అనితను తోసేసి మరీ హత్య చేశాడు. కాగా, వీరి పెద్ద కుమార్తె అనిత బుద్దాలపాలెం హైస్కూల్‌లో 10వ తరగతిలో స్కూల్ ఫస్ట్ వచ్చింది. రెండో కుమార్తె కవిత బుద్దాలపాలెం హైస్కూల్‌లో 8వ తరగతి, కుమారుడు అర్జునరావు బొర్రపోతు పాలెం స్కూల్‌లో 5వ తరగతి చదువుతున్నాడు. కాగా, సంఘటనా స్థలాన్ని డీఎస్పీ ఎండీ అబ్దుల్ సుభాన్, సీఐ శ్రీనివాసరావు, రూరల్ ఎస్ఐ వీరప్రసాద్ పరిశీలించారు. శివనాగరాణి తల్లి ఆదిలక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మచిలీపట్నం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నాగరాజును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

మాపైనే ఫిర్యాదు చేస్తారా..!

● ఏపీటీడీసీ డిప్యూటీ మేనేజర్ శివారెడ్డి సస్పెన్షన్ ● ఎన్నికల కోడ్ ఉండగా ఉద్యోగ నియామకాలు చేపట్టిన ఉన్నతాధికారులు
● సీ విజిల్, సీఈవో మెయిల్‌కు కొందరు ఉద్యోగుల ఫిర్యాదులు ● ఈసీకి ఫిర్యాదు చేశారన్న కారణంతో ఉన్నతాధికారుల చర్యలు ● ఉద్యోగుల జేఏసీ ఏర్పాటుపైనా గుర్రు



ఆంధ్రజ్యోతి, విజయవాడ: పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ)లో కోడ్ అమల్లో ఉండగా నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన ఉద్యోగ నియామకాలపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారన్న కారణంతో పలువురు అధికారులపై ఉన్నతాధికారులు వేటుకు రంగం సిద్ధం చేశారు. నాగార్జున సాగర్ బోటింగ్, ఎత్తిపోతల డిప్యూటీ మేనేజర్ శివారెడ్డిపై తొలి వేటు పడింది. ఈసీకి ఫిర్యాదు చేసి ఉంటారన్న అనుమానంతో ఆయన్ను సస్పెండ్ చేశారు. శివారెడ్డి సస్పెండ్ కావటంతో పర్యాటకాభివృద్ధి సంస్థ ఉద్యోగులు మండిపడుతున్నారు. శివారెడ్డి ఫిర్యాదు చేశారో, లేదో తెలియదు కానీ ఏపీటీడీసీలో జరుగుతున్న అక్రమాలు బయటకు వస్తున్నాయన్న ఉద్దేశంతో కొందరిపై ఉన్నతాధికారులు టార్గెట్ చేశారు. ఆంధ్రజ్యోతిలో కథనాలు వచ్చాయన్న పేరుతో అంతకు ముందు కూడా పలువురిని టార్గెట్‌గా చేసుకుని షోకాజు నోటీసులతో పాటు సస్పెండ్ కూడా చేశారు. ఇలా అనుమానాలతో చర్యలు తీసుకోవటాన్ని ఉద్యోగుల సంఘం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా జరిపిన నియామకాలపై ఈసీ చర్యలు తీసుకుంటుందన్న భయంతో ఉన్నతాధికారులు శివారెడ్డిని బాధ్యుడిని చేస్తూ సస్పెండ్ చేశారు. కోడ్ ఉండగా పర్యాటకాభివృద్ధి సంస్థలో నియామకాలు ఎంత వాస్తవమో, ఉద్యోగులు ఈసీకి ఫిర్యాదు చేసిన మాట కూడా అంతే నిజం. ఉద్యోగులు సీ విజిల్ యాప్‌తో పాటు, సీఈవో మెయిల్‌కు కూడా ఫిర్యాదులు చేశారు. సీ విజిల్‌లో ఫిర్యాదుపై 60 గంటల్లో చర్యలు తీసుకోవాల్సి ఉంది. కానీ ఇప్పటి వరకు ఆ దిశగా చర్యలు చేపట్టిన ఉదంతాలు కనిపించలేదు. ఈసీ ఎందుకు ప్రేక్షక పాత్ర పోషించిందన్నది చర్చనీయాంశంగా మారింది. ఈసీకి ఫిర్యాదు చేశారన్న కారణంతో ఇంకెంతమందిపై వేటు వేస్తారోనని ఉద్యోగులు భయపడుతున్నారు. ఇటీవల ఏపీటీడీసీలో బస్ ట్రాన్స్‌పోర్టు ప్రైవేటీకరణ, కాటేజీల ప్రైవేటీకరణ, కమిషన్ల కోసం కాటేజీల ఆధునీకరణ, టీటీడీ టికెట్లను ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెట్టడం, సంస్థలో నిబంధనలకు విరుద్ధంగా ఉద్యోగ నియామకాలు చేపట్టడం, అవినీతి కార్యకలాపాలు విపరీతంగా పెరిగిపోవటం వంటివి అట్టుడికిస్తున్నాయి. వీటిపై పోరాడేందుకు ఇటీవల ఉద్యోగులంతా జేఏసీని ఏర్పాటు చేసుకున్నాయి. ఉద్యోగులంతా జేఏసీగా ఏర్పడితే తమ అక్రమాలు బయటకు వస్తాయన్న ఉద్దేశంతో వారిని భయాందోళనలకు గురి చేయాలన్న ఉద్దేశంతో ఇలాంటి చర్యలకు దిగుతున్నారన్న విమర్శలు వస్తున్నాయి.

చంద్రబాబును కలిసిన సుజనా



వన్‌టౌన్, మే 18: మాజీ సీఎం, టీడీపీ అధినేత చంద్రబాబునాయుడును హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో విజయవాడ పశ్చిమ నియోజకవర్గం నుంచి పోటీచేసిన కూటమి బలపరచిన బీజేపీ అభ్యర్థి సుజనా చౌదరి శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. చంద్రబాబునాయుడు ఆయన్ను సాదరంగా ఆహ్వానించారు. వారిద్దరి మధ్య ఇటీవల జరిగిన పోలింగ్ సరళి, విజయావకాశాలు వంటి అంశాలు చర్చకు వచ్చినట్టు సమాచారం.

పవన్ రాజకీయాల్లో రాణిస్తారు

● సినీనటి ప్రణీత

విజయవాడ, మే 18 (ఆంధ్రజ్యోతి): జనసేన అధినేత పవన్ కల్యాణ్ భవిష్యత్తులో రాజకీయాల్లో రాణిస్తారని సినీనటి ప్రణీత అన్నారు. ఆయనలో ప్రజలకు మంచి చేయాలన్న ఆకాంక్ష బలంగా ఉందన్నారు. ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనేందుకు శనివారం విజయవాడ వచ్చిన ఆమె ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. పవన్ కల్యాణ్‌తో అత్తారింటికి దారేది చిత్రంలో నటించానని, ఆయన నటనలోనే కాకుండా రాజకీయాల్లోనూ రాణిస్తారన్నారు. పవన్ కల్యాణ్‌తో మరోచిత్రంలో నటించాలని ఉందన్నారు.

నేనైతే ఈ పగుళ్లు దాటలేను!

● ఏపీ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డైరెక్టర్ పద్మావతి

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]



నార్తువల్లూరు ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం ప్రధాన ద్వారం వద్ద భారీ పగుళ్లను పరిశీలిస్తున్న ఏపీ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డైరెక్టర్ పద్మావతి

తోట్లవల్లూరు, మే 18: 'నేనైతే ఈ మెట్ల పగుళ్ల దాటలేను' అని నార్తువల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని చూసిన ఏపీ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డైరెక్టర్ కె పద్మావతి అన్న మాటలివి. ఆంధ్రజ్యోతి దినపత్రికలో శనివారం 'పీహెచ్ఎస్‌సీలోకి వెళ్లాలంటే గర్భిణులు, బాలింతలకు ప్రయాసే' అన్న శీర్షికతో వార్తా కథనం వచ్చిన విషయం విదితమే. ఈ వార్తకు స్పందించిన ఏపీ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డైరెక్టర్ పద్మావతి శనివారం ఉదయం తోట్లవల్లూరు వచ్చి నార్తువల్లూరు ఆరోగ్య ఉపకేంద్రాన్ని సందర్శించి అధ్వాన్న స్థితిని పరిశీలించారు. లోపలికి ప్రవేశించే ప్రధాన మెట్ల మార్గం భారీ పగుళ్లతో ఉండటాన్ని చూసి ఈ పగుళ్ల నేను దాటలేనంటూ ఏఎన్ఎం సహాయం తీసుకోవాల్సి వచ్చింది. లోపల గదుల్లో కుంగి చెదలు పట్టిన ఫ్లోరింగ్‌ని చూశారు. బయట అరుగును పరిశీలించారు. అంతా పాడైపోయాయయని, చాలా ప్రమాదకర పరిస్థితులున్నాయని ఆమె వ్యాఖ్యానించారు. లోపల పాములు సంచరిస్తున్నాయని, తాము తీవ్ర భయానక పరిస్థితిని ఎదుర్కొంటున్నామని, గర్భవతులు, బాలింతలు ఇబ్బంది పడుతున్నారని సిబ్బంది పద్మావతికి వివరించారు. ఈ ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రానికి చేయాల్సిన మరమ్మతుల అంశాన్ని సంబంధిత శాఖకు నివేదిస్తానని పద్మావతి తెలిపారు. అయితే గ్రామస్థుల సహకారం తీసుకుని తక్షణమే పగుళ్లను గ్రావెల్ వేయమని కోరాలని ఏఎన్ఎంకు సూచించారు. ఈ భవనంలోకి రాలేకుంటే గర్భవతులు, బాలింతల ఇళ్లకే వెళ్లి వైద్య సహాయం అందించాలని కోరారు. అనంతరం రికార్డులు పరిశీలించి అందుబాటులో ఉన్న మందులను తనిఖీ చేశారు. రాబోయేది వర్షాకాలం కానుక అతిసార వ్యాధి మందులు, సెలైన్ బాటిళ్లు, అన్ని మందులు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. పీహెచ్ఎన్ పద్మావతి, ఏఎన్ఎం వీ కమలాక్షి సిబ్బంది పాల్గొన్నారు.



కుంగిపోయిన అరుగును పరిశీలిస్తున్న పద్మావతి

బంకు తగులబెట్టేస్తాం

● లూజు పెట్రోల్ పోయాలంటూ బ్లేడ్‌బ్యాక్ సభ్యుడి హుకుం
● బందరు రోడ్డులోని ఒక పెట్రోల్ బంకు నిర్వాహకులను బెదిరించిన వైనం
● ఎన్నికల దృష్ట్యా లూజు పెట్రోల్ పోయొద్దని ఎన్నికల సంఘం ఆదేశాలు



పెట్రోల్ బంకు సిబ్బందితో గొడవ పడుతున్న బ్లేడ్ బ్యాచ్ సభ్యుడు

వన్‌టౌన్,మే 18: సీసాలో లూజు పెట్రోల్ పోయకపోతే రాత్రికి రాత్రికే పెట్రోల్ బంకును తగులబెడతామని ఒక బ్లేడ్‌బ్యాచ్ సభ్యుడు బెదిరించిన వైనం శనివారం బందరు రోడ్డులో సూపర్‌మార్కెట్ ఎదురుగా ఉన్న పెట్రోల్ బంకు వద్ద జరిగింది. బ్లేడ్‌బ్యాచ్ సభ్యులు సీసా పట్టుకుని పెట్రోల్ పోయమనడం, సిబ్బంది నిరాకరించడం, వారిని బ్లేడ్‌బ్యాచ్ సభ్యులు బెదిరించడం సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. వీటి ఆధారంగా గవర్నర్‌పేట పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. బంకు మేనేజర్ వద్ద ఫిర్యాదు తీసుకుని బ్లేడ్ బ్యాచ్ సభ్యుల కోసం గాలిస్తున్నారు. తొలుత పెట్రోల్ బంకుకు వద్దకు వచ్చిన వ్యక్తి సీసాలో పెట్రోల్ పోయమని అడిగాడు, సిబ్బంది వీలుపడదని చెప్పడంతో వారితో అతను వాదులాడాడు. అంతేకాక పెట్రోల్ పోయకపోతే రాత్రికి రాత్రే పెట్రోల్ బంకును తగులబెడతామని హెచ్చరించడంతో సిబ్బంది భయభ్రాంతులకు గురయ్యారు. దీంతో పోలీసులకు సమాచారం అందించారు. సీఐ వెంకటరమణ బంకు వద్దకు వచ్చి సమాచారం సేకరించారు. రిపోర్టు తీసుకుని బ్లేడ్ బ్యాచ్ సభ్యుల్ని పట్టుకునేందుకు రెండు బృందాలను నియమించారు. ఇదిలా ఉండగా ఎన్నికల అనంతరం పలుచోట్ల జరుగుతున్న గొడవల దృష్ట్యా అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా నివారించేందుకు లూజు పెట్రోల్‌ను పోయవద్దని, కేవలం బండ్లలోనే పోయాలని ఎన్నికల సంఘం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఎవరైనా ఉల్లంఘిస్తే బంకు అనుమతులను రద్దుతో పాటు చర్యలను తీసుకుంటామని తెలిపింది. దీంతో అన్ని పెట్రోల్ బంకులు లూజు పెట్రోల్ పోయడాన్ని నిలిపేశాయి. పెట్రోల్ బంకు వద్ద జరిగిన సంఘటన నేపథ్యంలో గవర్నరుపేట సీఐ వెంకటరమణ తన పరిధిలోని పెట్రోల్ బంకువారితో అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. ఎన్నికల అనంతరం జరుగుతున్న గొడవలను దృష్టిలో పెట్టుకుని పెనుప్రమాదాలను నివారించేందుకు లూజుగా పెట్రోల్ పోయవద్దని, ఎవరైనా అడిగితే తమకు సమాచారం ఇవ్వాలని మార్గదర్శకాలను జారీ చేశారు. ఈ సమావేశంలో ఎస్ఐలు నారాయణమ్మ, కృష్ణబాబు పాల్గొన్నారు.



పోలీసు స్టేషన్‌లో పెట్రోల్ బంకు నిర్వాహకులతో సమావేశం

పైకి గెలుపు గాంభీర్యం లోపల అనుమానం

● అధికారం తథ్యమంటూ వైసీపీ శ్రేణుల ప్రగల్భాలు
● టీడీపీకే ఓటర్లు పట్టం కట్టారంటూ కూటమి నేతల ధీమా



పామర్రు: ఎస్సీ రిజర్వు నియోజకవర్గమైన పామర్రులో అధికారం మాదంటే మాదేనంటూ అధికార వైసీపీ, ప్రతిపక్ష టీడీపీ ధీమా వ్యక్తం చేస్తున్నాయి. కులమతాలకు అతీతంగా పేదలకు అందించిన పింఛన్లు, ఇతర సంక్షేమ పథకాలతో వైసీపీ అభ్యర్థి రెండోసారి గెలుపొందటం ఖాయమని ఆ పార్టీ శ్రేణులు ప్రగాల్భాలు పలుకుతుండగా, వారికి దీటుగా ఎన్డీయే కూటమికి చెందిన టీడీపీ, జనసేన, బీజేపీ వర్గాలు గత ఐదేళ్ల వైసీపీ పాలనతో అభివృద్ధిని విస్మరించి ఇసుక, పేదల ఇళ్లస్థలాల్లో జరిగిన అవినీతి పాలనకు ప్రజలు విసుగు చెంది ఉన్నారని, అంతేకాక ప్రభుత్వ మార్పును కోరుకుంటున్నారని, చంద్రబాబు పేదల సంక్షేమానికి పెట్టిన సూపర్ సిక్స్ పథకాల పట్ల ఆకర్షితులై సైకిల్, గాజు గ్లాసు గుర్తుకు అధికంగా ఓట్లు వేశారనే ధీమాతో ఉన్నారు. అంతేకాక నియోజవర్గంలో అధికంగా ఉన్న ఓ బలమైన సామాజిక వర్గానికి చెందిన యువ ఓటర్లతోపాటు, ఆ కులానికి చెందిన వారి ఓటుబ్యాంకు నూటికి 80 శాతం ఈసారి టీడీపీకి లభించిందని దాంతో ఈసారి టీడీపీ గెలుపును ఆపడం ఎవరి తరం కాదంటున్నారు. 2019లో 87.44 శాతంగా ఉన్న ఓటింగ్ శాతం ప్రస్తుత 88.11 శాతంగా నమోదై జిల్లాలోనే రెండోస్థానంలో అత్యధిక శాతం నమోదైంది. మహిళల ఓట్లు కూడా గతం కంటే ఎక్కువగా నమోదైంది. దీంతో ప్రజలు తమకే అనుకూలంగా తీర్పునిచ్చారని గ్రామాల్లో ఇరుపార్టీలు ఆశాభావం వ్యక్తం చేశాయి. నియోజకవర్గంలో ఎస్సీల తరువాత అధికంగా ఉన్న కాపు, బీసీ వర్గాల ఓట్లు వైసీపీకి పడినట్టు జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని కూటమి నేతలు స్పష్టం చేస్తున్నారు. ముస్లిం మైనార్టీ, ఆర్య వైశ్య, బ్రాహ్మణ ఓటర్లు నూటికి నూరు శాతం వైసీపీ వైపునే ఉన్నారని, ఇది తమ పార్టీ గెలుపునకు తోడ్పడతాయంటున్నారు. ఇదిలా ఉండగా టీడీపీ సైతం మాజీ సీఎం చంద్రబాబు పామర్రులో నిర్వహించిన ప్రచారంతో పార్టీనేతలు కలిసికట్టుగా పనిచేశారని, అందుకే ఆయా వర్గాలు తమ అభ్యర్థికే ఓటు వేశారని చెబుతున్నారు. అధికార పార్టీ అభ్యర్థి చేసిన తప్పిదాల కారణంగా ఆ పార్టీలోని కొందరు నేతలు సహకరించి తమ పార్టీ గెలుపునకు చేయూతనిచ్చారని టీడీపీ వర్గాలు బాహాటంగానే చెబుతున్నాయి. ఏదిఏమైనా జూన్4న ఫలితాలు వెలువడే వరకు ఉత్కంఠ కొనసాగుతూనే ఉంటుంది. నేతలు మాత్రం పైకి విజయం మాదేనంటూ గాంభీర్యం ప్రదర్శిస్తున్నప్పటికీ ఎక్కడో అనుమానం ఆందోళన వెంటాడుతూనే ఉంది.

విజయావకాశాలపై విస్తృత సమీక్షలు

ఇదిలా ఉండగా అసెంబ్లీ స్థానాలకు పోటీచేసిన అభ్యర్థుల కార్యాలయాల్లో విజయావకాశాలపై విస్తృత సమీక్షలు నిర్వహించేందుకు పొలిటికల్ ఆడిటర్లు రంగంలోకి దిగారు. గ్రామాలు, బూత్‌ల వారీగా ఏ అభ్యర్థికి ఎన్ని ఓట్లు పోలయ్యాయోనని బూత్ ఏజెంట్లు గ్రామస్థాయి నేతలతో సమీక్షలు చేస్తున్నారు. ఇందులో భాగంగా ప్రధాన పార్టీల అభ్యర్థులు ఎక్కడ వీక్‌గా ఉన్నారనే అంశాలపై చర్చలు జరుపుతూ బిజీగా ఉన్నారు. బూత్‌ల వారీగా పోలైన ఓట్లు, ప్రత్యర్థి పార్టీకి ఎన్ని, అనుకూలంగా ఎన్ని పోలయ్యాయనే అంచనాల్లో తల మునకలై ఉన్నారు. ఫలితాలకు ఇంకా పక్షం రోజుల పైనే వ్యవధి ఉండటంతో అభ్యర్థులతో పాటు ఓటర్లలోనూ ఉత్కంఠ నెలకొంది. నియోజకవర్గంలో ఐదు మండలాల్లో తోట్లవల్లూరులో వైసీపీ కొంతబలంగానే ఉన్నట్టు, మొవ్వలో కొన్ని గ్రామాలు వైసీపీ ప్రభావం ఉన్నా చివరికి సల్ప అధికృత టీడీపీకే ఉంటుందని, పెదపారుపూడి 50-50గా నిలిచినా, పమిడిముక్కల, పామర్రు మండలాల్లో అత్యధిక మెజార్టీ టీడీపీదేనని పొలిటికల్ ఆడిటర్లు లెక్కలు వేసినట్టు తెలుస్తోంది. ఈ ఉత్కంఠ చివరకు భారీస్థాయిలో బెట్టింగ్‌కు దారితీస్తుందని విశ్లేషకులు చెబుతున్నారు. ఇప్పటికే బెట్టింగ్ రాయుళ్లు రంగంలోకి దిగినట్టు తెలుస్తోంది. అయితే బెట్టింగుల్లోనూ వైసీపీ గెలుపుపై పందెం కాసేందుకు పందెం రాయుళ్లు కొంత వెనకడుగు వేస్తున్నట్టు భోగట్టా.



ప్రబీర్ పుర్కాయస్థ ఆత్మకథ 'అలుపెరుగని పోరాటం' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న గోళ్ల నారాయణరావు, నల్లూరి మాధవరావు, కేఎస్ లక్ష్మణరావు, సుంకర రాజేంద్రప్రసాద్ తదితరులు

ప్రబీర్ అరెస్టుపై సుప్రీంతీర్పు హర్షణీయం

● ఐలు నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర రాజేంద్రప్రసాద్

గవర్నర్‌పేట, మే 18: న్యూస్‌వీక్ వ్యవస్థాపకుడు ప్రబీర్ పురకాయస్థ అరెస్టు చెల్లదని సుప్రీంకోర్టు తీర్పునివ్వడం స్వాగతిస్తున్నామని ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఐలు) నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర రాజేంద్రప్రసాద్ అన్నారు. ప్రబీర్ పుర్కాయస్థ అక్రమ అరెస్టుపై సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తూ ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఐలు), రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక, పోలవరపు సాంస్కృతిక సమితి సంయుక్త ఆధ్వర్యంలో శనివారం రాత్రి ఎంజీ రోడ్డులోని బాలోత్సవ్ భవన్‌లో సభ జరిగింది.

ఈ సందర్భంగా సుంకర మాట్లాడుతూ ఉగ్రవాద నిరోధక చట్టం కింద ప్రబీర్‌ను ఢిల్లీ పోలీసులు అరెస్టు చేయడాన్ని తప్పుపడుతూ సుప్రీంకోర్టు ధర్మాసనం తీర్పునిస్తూ తక్షణమే ఆయన్ని విడుదల చేయాలని ఆదేశించడం సముచిత తీర్పు అన్నారు. రిమాండ్ కాపీని సమర్పించలేదన్న సుప్రీంకోర్టు, రిమాండ్ ఆదేశాలు చెల్లవని తీర్పులో స్పష్టం చేసినట్లు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు ప్రబీర్ పుర్కాయస్థ ఆత్మకథ అలుపెరుగని పోరాటం ఆవిష్కరణ జరిగింది. ప్రజాశక్తి బుక్ హౌస్ పూర్వ సంపాదకులు కె.ఉషారాణి పుస్తకాన్ని పరిచయం చేశారు. సభలో సిద్ధార్థ లా కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ దివాకర్‌బాబు, ఐలూ ప్రధాన కార్యదర్శి నల్లూరి మాధవరావులు, గోళ్ల నారాయణరావు తదితరులు ప్రసంగించారు.

పచ్చిరొట్ట విత్తనాల సరఫరా: జిల్లా వ్యవసాయాధికారిణి

కంచికచర్ల, మే 18: ఖరీఫ్ సీజన్‌లో భూమి సత్తువని, పంట ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంపొందించేందుకు పశువుల ఎరువుకు ప్రత్యామ్నాయంగా 50శాతం రాయితీపై పచ్చిరొట్ట పైర్ల విత్తనాలు సరపరా చేయనున్నట్టు జిల్లా వ్యవసాయాధికారిణి ఎస్.నాగమణెమ్మ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాకు జీలుగ విత్తనాలు 3710 క్వింటాళ్లు, పిల్లిపెసర విత్తనాలు 1,333 క్వింటాళ్లు, జనుము 149 క్వింటాళ్లు, వెరశి 5,192 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలు ఈ నెల 25 నాటికి రైతులకు అందుబాటులో ఉంచుతామన్నారు. జీలుగ, జనుము కిలో రూ. 88 కాగా 50 శాతం రాయితీపై రూ.44లకు, పిల్లిపెసర కిలో రూ.134 కాగా రూ. 67కు అందిస్తామన్నారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని, తొలకరి వర్షాలు పడగానే పచ్చిరొట్ట పైర్లు వేసుకోవాలన్నారు. ఖరీఫ్ పంటకాలానికి జిల్లాకు 74,823 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమని అంచనా వేయగా, ఇప్పటికే 46,251 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. నకిలీల బారిన పడకుండా ఉండేందుకు విత్తనాలు కొనే సమయంలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఏవైనా సమస్య వచ్చినట్టయితే మండల వ్యవసాయాధికారుల దృష్టికి తీసుకురావాలని జిల్లా వ్యవసాయాధికారిణి నాగమణెమ్మ విజ్ఞప్తి చేశారు.

పశుపోషణలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

చిట్టినగర్/కాటూరు (ఉయ్యూరు), మే 18: ఇంజనీరింగ్ పూర్తిచేసిన యువకులు ఐటీ కంపెనీల్లో స్థిరపడాలనుకుంటున్న రోజులివి. అలాంటిది ఇంజనీరింగ్ పూర్తిచేసిన ఓ యువకుడు పశుపోషణలోకి దిగాడు. ఉయ్యూరు మండలం కాటూరు గ్రామానికి చెందిన వి.సృజన్ మెకానికల్ ఇంజనీరింగ్ పూర్తి చేశారు. అడాప్ట్ ఐటీ సొల్యూషన్స్ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తూ పశుపోషణపై ఆసక్తితో రెండు గేదెలను కొనుగోలు చేశాడు. గేదెల నుంచి సేకరించిన 6 లీటర్లను పాలను కృష్ణా మిల్క్ యూనియన్‌కు సంబంధించిన కాటూరు సొసైటీకి సరఫరా చేస్తున్నాడు. ఆయన్ను మిల్క్ యూనియన్ అధ్యక్షుడు చలసాని అంజనేయులు శనివారం కలిసి సత్కరించారు.

పశుపోషణపై ఆసక్తి అభినందనీయం: చైర్మన్

విద్యావంతులైన యువకులు పాడి పరిశ్రమ వైపు ఆకర్షితలు కావడం అభినందనీయమని కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని అంజనేయలు అన్నారు. సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తూ పశుపోషణపై ఆసక్తి పెంచుకున్న సృజన్ గురించి ఆయన వివరాలు తెలుసుకున్నారు. శనివారం ఆయన పాలకేంద్రాన్ని సందర్శించిన సందర్భంలో సృజన్‌ను కలిసి పాడిరైతుల సంక్షేమానికి యూనియన్ అమలుచేస్తున్న పథకాలు, పాలధర వంటి అంశాలపై అభిప్రాయం అడిగి తెలుసుకున్నారు. పాలసేకరణ ధర, బోనస్, సంక్షేమ పథకాలు, టెక్నికల్ ఇన్‌పుట్స్ ఎంతగానో తోడ్పడుతున్నాయని సృజన్ తెలిపారు. పాడిపరిశ్రమపై ఉన్న మక్కువతో భవిష్యత్తులో మరిన్ని పశువులు సమకూర్చుకుని డెయిరీఫామ్ ఏర్పాటు చేయాలన్నది లక్ష్యమని చైర్మన్‌కు వివరించారు. మరిన్ని పశువులను ఏర్పాటు చేసుకుని పరిశ్రమ విస్తరింపజేసేందుకు యూనియన్ తరపున సహాయ సహకారాలు అందిస్తామని, విద్యావంతులైన యువకులు పాడిరంగం వైపు ఆకర్షితులు కావడం అభినందనీయమని సృజన్‌ను ఆదర్శంగా తీసుకుని యువకులు ముందుకొచ్చి డెయిరీ ఫారమ్‌లు ఏర్పాటుచేసి పాడి పరిశ్రమ అభివృద్ధికి తోడ్పడాలని చైర్మన్ పిలుపునిచ్చారు.

అభినందించిన కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్



యువ పాడిరైతు సృజన్‌ను సత్కరిస్తున్న కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు

పకడ్బందీగా ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు: కలెక్టర్

మచిలీపట్నం: ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు పక్బందీగా నిర్వహించాలని కలెక్టర్ డీకే బాలాజీ విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ క్యాంప్‌కార్యాలయం నుంచి గూగుల్‌మీట్ ద్వారా శనివారం ఆయన విద్యాశాఖాధికారులతో ఆయన మాట్లాడారు. ఈనెల 24 నుంచి జూన్ 1 వరకు ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు జరుగుతాయన్నారు. ఈ నేపథ్యంలో పరీక్షా కేంద్రాల వద్ద పూర్తిస్థాయి ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లాలో 27 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని, ఫస్టియర్ విద్యార్థులు 8,968 మంది, సెకెండియర్ విద్యార్థులు 1,373 మంది ఉన్నారన్నారు. జూనియర్ ఇంటర్ విద్యార్థులకు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, సీనియర్ ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. ఆయా కేంద్రాలవద్ద పోలీస్ బందోబస్తు, 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. ఫ్లయింగ్‌స్క్వాడ్ బృందాలతో నిత్యం పర్యవేక్షణ చేయాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద వెబ్‌కాస్టింగ్, సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేయాలన్నారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని తాగునీరు, వైద్యసిబ్బందిని పరీక్షా కేంద్రాల వద్ద అందుబాటులో ఉంచాలన్నారు. డీఆర్వో కే చంద్రశేఖరరావు, ఆర్ఐవో రవికుమార్, స్పెషల్‌బ్రాంచ్ సీఐ వెంకటరమణ, డీఈవో తాహెరాసుల్తానా, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రంగమ్మ తొలగింపునకు రాజకీయ కారణాలు కాదు

● ఎంపీడీవో విశ్వనాథ్, ఏపీవో శరత్

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

నందిగామ రూరల్, మే 18: మండలంలోని గోళ్లమూడి గ్రామంలో బరిగెల రంగమ్మ భర్త వీరయ్య టీడీపీకి ఓటేశారని ఉపాధి హామీ పథకంలో తన పేరు తీసేశారని రంగమ్మ ఆంధ్రజ్యోతికి తెలపటంతో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. శనివారం ఆమెకు పని కల్పించారు. ఆమె తొలగింపునకు రాజకీయ కారణాలు కాదని ఎంపీడీవో విశ్వనాథ్, ఏపీవో శరత్ తెలిపారు. ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనాలతో అధికారులు స్పందిస్తూ ఉపాధి హామీ పథకం గ్రామ క్షేత్ర సహాయకుడు నంద్రు కాటయ్య ఈ నెల 13,14న ఎన్నికల విధుల నిమిత్తం విజయవాడ వెళ్లాడని, దీనిపై సంజాయిషీతో కూడిన లిఖితపూర్వక వివరణ అందించాడన్నారు. అంతేకాక ఎన్నికల విధుల్లో ఉండటం, అలసట, నిద్రలేమితో కొంత మందికి పని కల్పించలేకపోయామని తెలిపారు. రంగమ్మకు ఇప్పటి వరకు 5రోజులకు ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి రూ.1300 వేతనం చెల్లించినట్టు చెప్పారు. రంగమ్మకు గ్రామంలోని పంట కాల్వ పూడికతీత పనులు కేటాయించినట్టు తెలిపారు. అందరితో పాటు తనకు ఉపాధి హామీ పథకం పనులు కల్పించిన ఆమె ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతలు తెలిపారు.



పంట కాల్వ పూడికతీత పనుల్లో రంగమ్మ

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	159, 168, 179
చికెన్ విత్ స్కిన్	310
చికెన్ స్కిన్‌లెస్	320

నెక్ కోడిగుడ్డు ధర
విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.40

22 నుంచి యోగా ఉచిత శిక్షణ తరగతులు

విజయవాడ స్పోర్ట్స్, మే 18 : ఉమ్మడి కృష్ణా జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 22 నుంచి మూడు చోట్ల ఉచిత యోగా శిక్షణ తరగతులను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో నిర్వహిస్తున్నట్లు జిల్లా అసోసియేషన్ సెక్రటరీ ఎల్. మురళీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. సింగ్‌నగర్‌లో వివేకానంద సెంటినరీ స్కూల్, సత్యనారాయణపురం శివాజీ కేఫ్, ఏలూరు రోడ్డు విజయ టాకీస్ వద్ద శ్రీ గాయత్రి ఆయుర్వేద మల్టీ స్పెషాలిటీ సెంటర్ వద్ద ఉదయం, సాయంత్రం యోగా శిక్షణ ఇస్తామన్నారు. రిజిస్ట్రేషన్ కోసం 9441119909, 9440276648 నెంబర్లలో సంప్రదించాలని మురళీకృష్ణ తెలిపారు.

మూణ్ణాళ్ల ముచ్చటగానే సుందరీకరణ

● మెయిన్ రోడ్లలో పేవర్ బ్లాక్స్ ధ్వంసం

భవానీపురం, మే 18 : నగరంలో సుందరీకరణ పేరుతో ప్రధాన రోడ్ల మార్జిన్ల వద్ద అంటిస్తున్న పేవర్ బ్లాక్స్ మూణ్ణాళ్ల ముచ్చటగానే మారుతున్నాయి. కోట్లాది రూపాయల వ్యయంతో భవానీపురం పరిధిలో స్వాతి, కుమ్మరిపాలెం, ఆర్టీసీ వర్కుషాపురోడ్డు, జోజినగర్ చర్చి, హెచ్‌బి కాలనీ, పోలీస్ కాలనీ, బైపాస్ రోడ్లపై వేసిన పేవర్ బ్లాక్స్ వద్ద వివిధ వ్యాపారాలను సాగించడం వల్ల లారీలు, ఆటోలు, ఇతర వాహనాలు నిలుపుతుండటంతో అవి కుంగిపోతున్నాయి. కొన్నిచోట్ల బ్లాక్స్ లేచి పైకి వచ్చేస్తున్నాయి. ఇవి ఏర్పాటు చేసి నెలలు తిరగకుండానే నామరూపాల్లేకుండా కొట్టుకుపోతున్నాయి. వాటర్ లీకేజీతో విద్యాధరపురం స్టేడియం ప్రాంతంలోను ఇవి పాడవుతున్నాయి. ఇక్కడే బ్లాక్స్‌పైనే ఆటోలు, ఇతర తినుబండారాలు చేసుకుని వాహనాలను నిలుపుతున్నారు. దీని వలన ప్రజాధనం వృధా అవుతోంది. వీటి రక్షణకు చర్యలు తీసుకోలేని ఇంజనీరింగ్ అధికారులు కాంట్రాక్టర్లకు లబ్ధిచేయడానికి ఉపకరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఆర్టీసీ వర్కుషాపు రోడ్డు వద్ద చాలా రాళ్లు పైకి లేచిపోగా, తహసీల్దార్ కార్యాలయం సమీపంలో మెయిన్ రోడ్డులో పేవర్ బ్లాక్స్ కుంగిపోయాయి. ఇంజనీరింగ్ అధికారులను వీటి వలన ఉపయోగమేమిటని ప్రశ్నించగా, ఇటువైపుగా పైపులైన్ వేసేటప్పుడు ఈ బ్లాక్స్‌ను తొలగించి ఏర్పాటు చేసి మళ్లీ అంటిస్తామని చెబుతున్నారు. అన్నిచోట్ల పైపులైన్లు వేయరన్న విషయం వారికి తెలియదా అన్న ప్రశ్న ఉత్పన్నం అవుతోంది. రోడ్ల వెంబడి గ్రావెల్‌తో మార్జిన్‌లు ఏర్పాటు చేసి మొక్కలు నాటితే పర్యావరణానికి మేలు జరుగుతున్న ఆలోచన ఎవరికి రావడం లేదు. కోట్ల వ్యయంతో ఏర్పాటు చేస్తున్న పేవర్ బ్లాక్స్ పరిరక్షణకు అధికారులు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.


విద్యాధరపురం స్టేడియం సమీపంలో మెయిన్‌రోడ్డుపై బ్లాక్స్‌పైనే నిలిపిన బడ్డీలు


తహసీల్దార్ కార్యాలయం రోడ్డులో కుంగిన పేవర్ బ్లాక్స్

తాళం వేసిన ఇంట్లో చోరీ

పాయకాపురం, మే 18 : తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగిన ఘటనపై నున్న రూరల్ పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం విశాలాంధ్ర కాలనీకి చెందిన వి. రాజ్‌కుమార్ ఈనెల 15న కుటుంబ సభ్యులతో కలిసి మంగళగిరిలోని బంధువుల ఇంటికి వెళ్లాడు. తిరిగి శనివారం సాయంత్రం వచ్చారు. ఇంట్లోకి వెళ్లి చూడగా వెనుక తలుపు తెరిచి ఉండటం, సామాన్లు చిందర వందరగా పడి ఉండటాన్ని గుర్తించారు. ఇంట్లో చోరీ జరిగినట్లు నిర్ధారణకు వచ్చి నున్న రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే బీరువాలో ఉండాల్సిన రూ. 1.50 లక్షలు, బంగారపు ఆభరణాలు చోరీకి గురైనట్లు పోలీసుల ఫిర్యాదులో పేర్కొన్నారు.



ఆహార పొట్లాల పంపిణీ

అజిత్‌సింగ్‌నగర్, మే 18 : కస్తూరిబాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో అజిత్‌సింగ్‌నగర్ ప్రాంతంలో శనివారం ఆహార పొట్లాలు, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ కార్యక్రమం జరిగింది. స్థానిక లూనా సెంటర్, డాబా కొట్లు సెంటర్ తదితర ప్రాంతాల్లో ట్రస్ట్ సభ్యులు రోడ్లపై ఉండే నిర్వాసితులకు 200 మందికి ఆహార పొట్లాలను అందజేశారు. సభ్యులు చల్లగాలి అనిల్, వేల్పుల రాజేష్, దావూద్ ఖాన్, తంగిరాల కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

కొనకళ్లకు నారాయణమ్మ పరామర్శ



వన్‌టౌన్, మే 18: విజయవాడ రమేష్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బందరు మాజీ ఎంపీ కొనకళ్ళ నారాయణ రావును శనివారం టీడీపీ జిల్లా మహిళా అధికార ప్రతినిధి ముక్కంటి నారాయణమ్మ పరామర్శించారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆమె ఆకాంక్షించారు.



వేసవి విజ్ఞాన శిబిరంలో సంగీత తరగతులు ప్రారంభం

గవర్నర్‌పేట, మే 18: ఎంజీ రోడ్డులోని ఠాగూర్ గ్రంథాలయంలో వేసవి విజ్ఞానం శిబిరం కార్యక్రమంలో భాగంగా శనివారం సరస్వతీ సామ్రాజ్యం సంస్థ ఆధ్వర్యంలో సంగీతం తరగతులు ప్రారంభించారు. సప్త స్వరాలు పలికే విధానాన్ని సంగీత టీచర్ దివ్య మాధురి విద్యార్థులకు నేర్పించారు. సంగీతంలో వాటి ప్రాముఖ్యతను వివరించారు. స్వరాలను విద్యార్థులచే పలికించి, సాధన చేయించారు. గ్రంథాలయాధికారిణి కె. రమాదేవి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలి

చిట్టినగర్, మే 18: నగరంలో చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ అధికారులను ఆదేశించారు. నగరంలో ఆయన శనివారం పలు ప్రాంతాల్లో పర్యటించారు. కేఎల్‌రావు నగర్‌లో అవుట్‌లెట్ డ్రెయిన్‌ను పరిశీలించారు. సీవీఆర్ ఫ్లైఓవర్ కింద, అవుట్‌ఫాల్ డ్రెయిన్‌లో పేరుకుపోయిన చెత్తను చూసి ఆయన అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ఆంజనేయవాగులో పర్యటించారు. ఎంజీ రోడ్డులో మిషన్ల ద్వారా చెత్తను తొలగిస్తున్న ప్రక్రియను పరిశీలించారు.

దుర్గగుడిలో భక్తుల రాకపోకల పరిశీలన

వన్‌టౌన్, మే 18: దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో ఈవో రామరావు శనివారం క్యూల్లో భక్తుల రాకపోకల సరళిని పరిశీలించారు. టికెట్ కౌంటర్‌లో సిస్టమ్‌లో ఎంటర్ అయిన టికెట్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన స్వయంగా భక్తులతో పాటే క్యూలో నడిచి భక్తుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు.● ఆలయంలో జరుగుతున్న నిత్య ఆర్జిత సేవల్లో పలువురు భక్తులు పాల్గొని వారి మొక్కులను తీర్చుకున్నారు.చండీహోమం, లక్ష కుంకుమార్చన, ఇతర పలు ఆర్జిత సేవల్లో పాల్గొన్నారు.

24, 25 తేదీల్లో చాగంటి కోటేశ్వరరావు ప్రవచనాలు

ప్రముఖ ప్రవచకుడు చాగంటి కోటేశ్వరరావు ప్రవచన కార్యక్రమాలను ఈనెల 24, 25 తేదీల్లో తుమ్మలపల్లి వారి క్షేత్రయ కళాక్షేత్రంలో దేవస్థానం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినట్లు ఈవో రామరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రెండు రోజులు ప్రతిరోజూ సాయంత్రం 6 గంటల నుంచి 8 గంటల వరకు ప్రవచనం సాగుతుందని తెలిపారు.

ధర్మపథం వేదికపై కూచిపూడి నృత్య ప్రదర్శన



వన్‌టౌన్, మే 18: దుర్గామల్లేశ్వర దేవస్థానంలోని ధర్మపథం వేదికపై శనివారం బి శైలజ ఆధ్వర్యంలోని ముద్ర కూచిపూడి డ్యాన్స్ ఇన్‌స్టిట్యూట్ కళాకారిణులు కూచిపూడి నృత్య ప్రదర్శన చేశారు. 15 మంది కళాకారిణులు వివిధ కీర్తనలకు చక్కని అభినయం చేసి ఆహూతులను ఆకట్టుకున్నారు.

ఎన్టీఆర్ సర్కిల్ బురదమయం

పటమట, మే 18 : నగరంలో శుక్ర, శనివారాల్లో కురిసిన వర్షాలకు ఎన్టీఆర్ సర్కిల్ పరిసర ప్రాంతాలు పూర్తిగా బురదమయం అయ్యాయి. ఒక పక్క డ్రెయినేజీ నిర్మాణం జరుగుతుండగా, ఆ మట్టి కూడా రోడ్డు మీద వేయడంతో ఆ ప్రాంతమంతా బురదతో చిత్తడి, చిత్తడిగా తయారైంది. ద్విచక్ర వాహనదారులు వేగంగా వెళుతుంటే పాదచారుల మీద బురదపడుతోంది. వర్షాకాలంలో ఎన్టీఆర్ సర్కిల్ ప్రాంతాల్లో వర్షపునీరు నిల్వ ఉండకుండా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు, పరిసర ప్రాంత వ్యాపారులు కోరుతున్నారు.



ఆంధ్రాను అరాచకాలకు అడ్డాగా మార్చిన జగన్‌రెడ్డి

టీడీపీ కృష్ణాజిల్లా బీసీ సాధికారిక కన్వీనర్ శౌంఠి

విద్యాధరపురం, మే 18: జగన్‌రెడ్డి తన పాలనలో ఆంధ్రాను అరాచకాలకు అడ్డాగా మార్చాడని కృష్ణా జిల్లా టీడీపీ బీసీ సాధికారిక కన్వీనర్ శౌంఠిశివరామ ప్రసాద్ గౌడ్ విమర్శించారు. ఆటోనగర్‌లోని టీడీపీ జిల్లా కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ముగిసిన తరువాత కూడా టీడీపీ నాయకులు, సానుభూతిపరులు, కార్యకర్తలపై వైసీపీ నాయకులు దాడులు చేస్తున్నారన్నారు. వారికి పోలీసు యంత్రాంగం సహకరించడం విచారకరమన్నారు. ఓటమిని అంగీకరించే ఇటువంటి చర్యలక వైసీపీ శ్రేణులు తెగబడుతున్నారని, పైగా బాధితులపైనే కేసులు పెడుతున్నారని అన్నారు. వచ్చేది కూటమి ప్రభుత్వమేనన్నారు. చంద్రబాబు సీఎం అవుతారని, వైసీపీ నాయకులకు సహకరించిన అధికారులను వదిలిపెట్టే ప్రసక్తి లేదని, వారిని బోనులో నిలబెడతామని తెలిపారు. పీతా గోవింద్, సంగెపు రంగారావు, కుటుంబరావు, దాసు, ప్రసాద్ పాల్గొన్నారు.

వైసీపీ గూండాలకు సహకరించిన ఉన్నతాధికారులకు శిక్ష తప్పదు : లుక్కా

విద్యాధరపురం, మే 18: వైసీపీ గూండాలకు సహకరించిన ఉన్నతాధికారులకు న్యాయస్థానాల్లో శిక్ష తప్పదని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి లుక్కా సాయిరాంప్రసాద్ గౌడ్ హెచ్చరించారు. ఆటోనగర్‌లోని టీడీపీ జిల్లా కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జగన్ బటన్ నొక్కుడు ఈ ఏడాది జనవరి నెల నుంచి అబద్ధమని స్పష్టమైందన్నారు. ఓడిపోతున్నామని తెలుసుకున్న జగన్‌రెడ్డి అక్రమ జీవోలను దాచేయడంతో పాటు, మిగతా అక్రమాలు ఏవీ తెలియకుండా ఉండడం కోసం ఈ ఆఫీస్ ఆధునీకరణ పేరిట కొత్త డ్రామాకు తెరతీశాడన్నారు. ఇది పసిగట్టిన చంద్రబాబు ఈసీకి లేఖ రాయడం ద్వారా బ్రేక్ వేశారన్నారు. చంద్రబాబు సీఎం అయితేనే జగన్‌రెడ్డి అరాచకాలకు, అధికారుల మోసాలకు తెరపడుతుందని తెలిపారు.

రాష్ట్రంలో మళ్లీ ఎన్నికలు నిర్వహించాలి: షేక్ జలీల్

ధర్నాచౌక్, మే 18: ఇటీవల రాష్ట్రంలో జరిగిన ఎన్నికల సజావుగా జరగని నేపథ్యంలో వీటిని రద్దు చేసి మళ్లీ ఎన్నికలు నిర్వహించాలని నవరంగ్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు షేక్ జలీల్ డిమాండ్ చేశారు. గాంధీనగర్‌లోని ప్రెస్ క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని రెండు ప్రధాన పార్టీలు ఓటుకు రూ. 2 నుంచి రూ. 3 వేలు ఇచ్చాయన్నారు. దేశంలో ఇటువంటి పరిస్థితి ఎక్కడా లేదన్నారు. ఢిల్లీలోని ఏడు పార్లమెంట్ స్థానాల్లో తమ అభ్యర్థులు పోటీ చేస్తున్నారన్నారు. చాందినీచౌక్ నుంచి తాను పోటీ చేస్తున్నట్టు చెప్పారు.

ఆల్ ఇండియా వర్సిటీ పవర్‌లిఫ్టింగ్‌కు ఇద్దరు ఎంపిక

విజయవాడ స్పోర్ట్స్, మే 18 : చెన్నైలోని తమిళనాడు ఫిజికల్ ఎడ్యుకేషన్, స్పోర్ట్స్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఈ నెల 20 నుంచి 25 వరకు జరిగే ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ పవర్ లిఫ్టింగ్‌కు డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ నుంచి ఇద్దరు మహిళా క్రీడాకారి ణులతో కూడిన టీమ్ అక్కడకు బయల్దేరిందని వర్సిటీ స్పోర్ట్సుబోర్డు సెక్రటరీ ఇ. త్రిమూర్తి ఒక ప్రక టనలో తెలిపారు. షేక్ అస్సియా (ఇబ్రహీంపట్నం నిమ్రా మెడికల్ కళాశాల), రావాడ వందన (విజయనగరం శ్రీరామ ఎడ్యుకేషనల్ ఫిజియోథెరపీ కళాశాల) క్రీడాకారిణులు బరిలో దిగుతున్నారని ఆయన వివరించారు.


జ్యోతి వెలిగించి షోరూమ్‌ను ప్రారంభిస్తున్న సినీ నటి ప్రణీత

చాముండి సిల్క్స్ అండ్ శారీస్ షోరూమ్ ప్రారంభం

విజయవాడ, మే 18 (ఆంధ్రజ్యోతి) : విజయవాడలోని పాలిక్లినిక్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన చాముండి సిల్క్స్ అండ్ శారీస్ షోరూమ్‌ను సినీ నటి ప్రణీత శనివారం ప్రారంభించారు. ప్రణీతను చూసేందుకు జనం భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా కొద్దిసేపు ట్రాఫిక్ నిలిచిపోయింది. కార్యక్రమంలో షోరూం అధినేతలు చిల్లపల్లి శ్రీనివాస్, శ్రీకర్, దామర్ల శ్రీదేవి పాల్గొన్నారు.



జిల్లా సీనియర్ చెస్ విజేతలుగా తేజశర్మ, నిశ్చల

విజయవాడ స్పోర్ట్స్, మే 18 : ది విజయవాడ చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక నలంద విద్యానికేతన్‌లో జరిగిన జిల్లా సీనియర్ ఓపెన్, ఉమెన్ చెస్ చాంపియన్‌షిప్‌లో శివ పవన్ తేజ శర్మ, పంచుమర్తి భావన, తేజ వజ్రాక్ష్ వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. ఉమెన్స్ విభాగంలో వై. నిశ్చల, అక్షర, షేక్ నబీహా వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. ఏపీ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ వీజీ. వెంకటరెడ్డి, నలంద స్కూల్ ప్రిన్సిపాల్ మాదల పద్మజ, జిల్లా చెస్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎండీ అక్బర్ పాషా, మందుల రాజీవ్‌లు విజేతలకు బహుమతులు అందజేశారు.

ఘనంగా శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతి


కుంకుమ పూజలో పాల్గొన్న భక్తులు, వెండి రథంపై అమ్మవారి ఊరేగింపు

పాయకాపురం, మే 18 : స్థానిక కండ్రిక కాలనీలోని సాయిబాబా ఆలయంలో శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతి కార్యక్రమం శనివారం ఘనంగా జరిగింది. పాయకాపురం వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ఉదయం ఆలయంలో స్వామికి పంచామృతాలతో విశేషంగా అభిషేకాలు, లలితా సహస్ర పారాయణ, సామూహిక కుంకుమార్చలను నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు పందిరి బాల వెంకట సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు త్యాగానికి, సహనానికి ప్రతీక అని పేర్కొన్నారు. క్లబ్ సభ్యులు పందిరి లక్ష్మీ పద్మావతి, రావూరి ప్రసాద్, వెంకట సుబ్బారావు పాల్గొన్నారు.

మర్రిచెట్టు సెంటర్‌లో ..

భవానీపురం: 44వ డివిజన్ ఆర్యవైశ్య సేవా సంఘం అధ్యక్షుడు కోట గురున్నాధరావు ఆధ్వర్యంలో విద్యాధరపురం మర్రిచెట్టు సెంటర్‌లో వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతి శనివారం ఘనంగా నిర్వహించారు. వెండి రథంపై అమ్మవారి ఊరేగింపు, కుంకుమార్చన జరగ్గా, ఈ కార్యక్రమంలో మర్చంట్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కొనకళ్ల విద్యాధరరావు, కార్పొరేటర్లు మైలవరపు రత్నకుమారి, గుడివాడ నరేంద్ర, వైసీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ మైలవరపు దుర్గారావులు పాల్గొన్నారు. 2వేల మంది పేదలకు అన్నదానం నిర్వహించారు.

వృద్ధాశ్రమాల్లో భోజన ఏర్పాట్లకు విరాళం



గవర్నర్‌పేట/పటమట, మే 18: వృద్ధాశ్రమాల్లో ఉండే పేదల భోజన ఏర్పాట్లు కోసం పటమట ప్రాంతానికి చెందిన నల్లూరు పాపయ్య చౌదరి కుటుంబ సభ్యులు విజయ కుమారి, మణిచంద్, చంద్రదేవ్‌లు రూ. 11 వేలు విరాళం అందజేశారు. బందరు లాకుల సెంటర్‌లోని సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ కార్యాలయంలో శనివారం అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వేమూరి బాబూరావు, మోతుకూరి వెంకటేశ్వర రావుల సమక్షంలో వాంబేకాలనీలోని మాతృదేవోభవ ఆశ్రమం, పాతపాడులోని అనాథ ఆశ్రమం, వణుకూరులోని ఆదరణ మహిళా వృద్ధాశ్రమాల నిర్వాహకులకు నగదు అందజేశారు. సామాజిక కార్యకర్త మోతుకూరి అరుణ్‌కుమార్, అసోసియేషన్ కోశాధికారి దావులూరి సాంబశివరావులు పాల్గొన్నారు.

21న కొల్లి నాగేశ్వరరావు వర్ధంతి సభ

ధర్నాచౌక్, మే 18: రైతాంగ, కమ్యూనిస్టు ఉద్యమనేత కొల్లి నాగేశ్వరరావు నాల్గవ వర్ధంతి సభ ఈ నెల 21న స్థానిక దాసరి భవన్‌లో జరుగుతుందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు జి.ఈశ్వరయ్య, కేవీవీ.ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ప్రముఖ సామాజిక విశ్లేషకుడు టి.లక్ష్మీనారాయణ 'కృష్ణాజలాల హక్కుల పరిరక్షణ– కొత్తప్రభుత్వం ముందున్న సవాళ్లు' అనే అంశంపై రచించిన పుస్తకావిష్కరణ జరుగుతుందన్నారు. ఈ సభకు ముఖ్య అతిథులుగా సీపీఐ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శులు కె.రామకృష్ణ, వి.శ్రీనివాస రావు, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, వివిధ రాజకీయ పార్టీలు, రైతు, ప్రజా సంఘాల నేతలు పాల్గొంటారన్నారు.

ఎన్నికల పేరుతో ప్రజా సమస్యలను విస్మరించిన ప్రభుత్వ యంత్రాంగం

● సీహెచ్ బాబూరావు

పాయకాపురం, మే 18 : ఎన్నికల పేరుతో ప్రభుత్వ యంత్రాంగం ప్రజా సమస్యలను విస్మరించిందని సీపీఎం సెంట్రల్ నియోజకవర్గ అభ్యర్థి సీహెచ్ బాబూరావు విమర్శించారు. సెంట్రల్ నియోజకవర్గం 60వ డివిజన్ వాంబేకాలనీలో శనివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఓట్లు వేసేందుకు భారీగా తరలివచ్చిన ప్రజానీకానికి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం బాబూరావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల్లో రౌడీయిజం, ఫ్యాక్షనిజం, ధన ప్రవాహం కనిపించిందన్నారు. ఓటర్లను భయభ్రాంతులకు గురి చేసి డబ్బులతో అభ్యర్థులు ప్రలోభపెట్టారని ఇది మంచి పరిణామం కాదని అన్నారు. వైసీపీ, టీడీపీ అభ్యర్థులు విచ్చలవిడిగా డబ్బులు పంచుతూ ఒకరిపై ఒకరు దాడులకు పాల్పడి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశారన్నారు. నిజాయితీగా ఓటు వేసిన ఓటర్లను ఆయన అభినందించారు. కాలనీలో నెలకొన్న మంచినీరు, డ్రెయినేజీ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

హిట్ లిస్ట్‌లో ఏముంది?



తమిళ దర్శకుడు విక్రమన్ తనయుడు విజయ్ కనిష్క హీరోగా నటిస్తున్న చిత్రం 'హిట్ లిస్ట్'. సూర్య కతిర్ కాకల్లార్, కార్తికేయన్ సంయుక్తంగా దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం టీజర్‌ను తమిళ హీరో సూర్య శుక్రవారం విడుదల చేశారు. ప్రస్తుతం ప్రేక్షకులు క్రైమ్, సస్పెన్స్ జానర్ చిత్రాలను ఎక్కువగా ఆదరిస్తున్నారనీ, అదే జానర్‌లో వస్తున్న ఈ సినిమా కూడా అందరినీ అలరిస్తుందనీ నిర్మాతలు ధీమా వ్యక్తం చేశారు. శరత్‌కుమార్, సముద్రఖని, గౌతమ్ వాసుదేవ మీనన్, సితార తదితరులు నటిస్తున్న ఈ చిత్రాన్ని తెలుగు రాష్ట్రాల్లో శ్రీనివాసా ఫ్రిక్స్, బెక్కం ప్రొడక్షన్స్ సంస్థలు విడుదల చేస్తున్నాయి.

క్యూట్‌గా స్వీట్‌గా



చైతన్యారావు, హెబ్బాపటేల్ జంటగా నటించిన చిత్రం 'హనీమూన్ ఎక్స్‌ప్రెస్'. తనికెళ్ల భరణి, సుహాసిని ముఖ్య పాత్రలు పోషించారు. బాల రాజశేఖరుని దర్శకత్వంలో కేకేఆర్, బాలరాజ్ నిర్మించారు. ఈ చిత్రం నుంచి 'క్యూట్‌గా స్వీట్‌గా' అంటూ సాగే గీతాన్ని హీరో అడివిశేష్ చేతుల మీదుగా చిత్రబృందం విడుదల చేసింది. కిట్టూ విస్సాప్రగడ సాహిత్యం అందించగా, దీపు ఆలపించారు. కల్యాణి మాలిక్ స్వరాలు సమకూర్చారు. 'క్యూట్‌గా స్వీట్‌గా పాట సాహిత్యం బావుంది. 'హనీమూన్ ఎక్స్‌ప్రెస్' చిత్రం ఘన విజయం సాధించాలి' అని అడివి శేష్ ఆకాంక్షించారు. ఇదొక మ్యూజికల్ రొమాంటిక్ కామెడీ ఎంటర్టైనర్ అని దర్శకుడు చెప్పారు. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తామని నిర్మాతలు తెలిపారు.

సినిమావాళ్ల కథ



అభిరామ్, వెన్నెల, మనోహర్, పవన్ ప్రధాన తారాగణంగా హరీష్ చావా దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'ఇట్లు... మీ సినిమా'. నోరి నాగప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రం పోస్టర్‌ను దర్శకుడు కోదండరామిరెడ్డి చేతుల మీదుగా యూనిట్ విడుదల చేసింది. సినీరంగంలో రాణించాలనే తపనతో నలుగురు స్నేహితులు చేసిన ప్రయత్నాల నేపథ్యంలో కథ సాగుతుందని దర్శకుడు తెలిపారు. ప్రతి సినిమా వ్యక్తి, ఇది తన కథే అని ఫీలయ్యేలా ఉంటుందని నిర్మాత చెప్పారు. ఈ చిత్రానికి సంగీతం: మీరావలి.

సిద్ధార్థ్ 40వ చిత్రం



తెలుగు, తమిళ భాషల్లో మంచి నటుడుగా గుర్తింపు పొందిన సిద్ధార్థ్ తన తాజా చిత్రం వివరాలు వెల్లడించారు. ఇది ఆయనకు 40వ చిత్రం కావడం విశేషం. తెలుగు, తమిళ భాషల్లో రూపుదిద్దుకొనే ఈ చిత్రానికి శ్రీగణేశ్ దర్శకత్వం వహించనున్నారు. అరుణ్ విశ్వ నిర్మాత. ఈ సినిమా గురించి సిద్ధార్థ్ మాట్లాడుతూ 'ఈ మధ్య నేను చాలా కథలు విన్నా. శ్రీగణేశ్ చెప్పిన కథ బాగా నచ్చింది. మంచి నిర్మాత అరుణ్ విశ్వతో పని చేయడం ఆనందంగా ఉంది' అన్నారు. 'నేను స్క్రిప్ట్ మీద వర్క్ చేస్తున్నప్పుడు యూత్‌తో పాటు పరిణితి కలిగిన నటుడు కావాలనుకున్నాను. అప్పుడే సిద్ధార్థ్ గుర్తుకు వచ్చారు. ఆయన కథ విని మెచ్చుకుని, కొన్ని సూచనలు కూడా ఇచ్చారు' అని దర్శకుడు గణేశ్ చెప్పారు. 'శాంతి టాకీస్ అని మా అమ్మ పేరు బేనరుకు పెట్టాం. ఆవిడ థియేటర్‌లో చూసి ఆనందించే సినిమాలే తీస్తాను. ఫ్యామిలీ ఆడియన్స్‌ను అలరించే కమర్షియల్ చిత్రాలు తీస్తాను. వచ్చే నెలలో ఈ సినిమా షూటింగ్ మొదలవుతుంది. పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తాం' అని నిర్మాత అరుణ్ విశ్వ చెప్పారు.

అనంతపురం అమ్మాయి ప్రేమకథ



అనంతపురం అమ్మాయి సుమయా రెడ్డి చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టి నిర్మాతగా, కథారచయిత్రిగా, హీరోయిన్‌గా 'డియర్ ఉమ' చిత్రంతో తన అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నారు. సాయి రాజేశ్ మహదేవ్ ఈ సినిమాకు దర్శకుడు. సుమయా రెడ్డి పుట్టినరోజు సందర్భంగా శనివారం సినిమా నుంచి స్పెషల్ పోస్టర్, 'నీవెవ్వరో' పాట విడుదల చేశారు. మెలోడీ ట్యూన్‌తో ఈ పాట ఆకట్టుకుంటోంది. నిర్మాతగా తనకు ఇదే తొలి సినిమా అయినా ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా భారీస్థాయిలో ఈ ప్రేమకథను నిర్మించారు సుమయా రెడ్డి. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది. త్వరలో విడుదల తేదీ ప్రకటించనున్నారు.



రొమాంటిక్ సిల్క్ శారీ

వాసుదేవ్‌రావు, రీనా చౌదరి, ప్రీతీ గోస్వామి హీరోహీరోయిన్లుగా నటించిన 'సిల్క్ శారీ' చిత్రం ఈ నెల 24న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో శనివారం ప్రసాద్ ప్రీవ్యూ థియేటర్‌లో నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు మురళీమోహన్, శ్రీకాంత్, శివాజీ రాజా, ఉత్తేజ్ తదితరులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో నిర్మాత రమలేష్ కుమార్ మాట్లాడుతూ 'ఒక మంచి సినిమాతో బాలీవుడ్‌లోకి అడుగు పెడుతున్నందుకు ఆనందంగా ఉంది. మా బేనరుపై వరుసగా చిత్రాలు నిర్మిస్తాం' అని చెప్పారు. దర్శకుడు టి.నాగేందర్ మాట్లాడుతూ 'ఇదొక సరికొత్త రొమాంటిక్ లవ్ స్టోరీ. అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చే అంశాలు ఉన్నాయి. హీరో వాసుదేవ్‌రావు కెరీర్‌లో గుర్తుండిపోయే చిత్రమవుతుంది' అని చెప్పారు.

మ్యూజికల్ జర్నీ



ప్రియతమ్ మంతిని, విజయ విక్రాంత్, అనంత పద్మశాల, అంజన బాలాజీ తదితరులు నటించిన మ్యూజికల్, ఫీల్‌గుడ్ ఫిల్మ్ 'నీ దారే నా కథ'. వంశీ జొన్నలగడ్డ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తూ తేజేశ్ వీర, శైలజ జొన్నలగడ్డతో కలసి నిర్మించారు. జూన్ 14న సినిమాను విడుదల చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. 'ఇది మ్యూజికల్ బేస్డ్ ఫిల్మ్. స్నేహం, కలలు సాధించాలనే సంకల్పం, తండ్రీకొడుకుల బంధం.. వంటి అంశాలతో ఆసక్తికరంగా సాగుతుంది. ప్రేక్షకులు భావోద్వేగాల రోలర్ కోస్టర్‌లా ఫీల్ అవుతారు. సంగీతం స్వరాన్ని సెట్ చేస్తుంది. అద్భుతమైన సంగీతం, ఎమోషన్స్‌తో ఓ మధురమైన ప్రయాణంలా చిత్రం ఉంటుంది' అని శివ జొన్నలగడ్డ చెప్పారు. ఈ చిత్రానికి రచన: మురళీకాంత్, వంశీ జొన్నలగడ్డ, సంగీతం: ఆల్బర్టో గురియోలి, సినిమాటోగ్రాఫర్: ఎలెక్స్ కావు.

శ్రీ సిటీ ఐఐఐటీలో పీహెచ్‌డీ



చిత్తూరు, శ్రీసిటీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐఐఐటీ) - పీహెచ్‌డీ (మాన్‌సూన్ 2024) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఫుల్ టైమ్, పార్ట్ టైమ్ విధానాల్లో ప్రోగ్రామ్ అందుబాటులో ఉంది. ఫుల్ టైమ్ ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. గరిష్ఠంగా ఆరేళ్లలో పూర్తిచేయాల్సి ఉంటుంది. పార్ట్ టైమ్ ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. గరిష్ఠంగా ఏడేళ్లలో పూర్తిచేయాల్సి ఉంటుంది. ఫుల్ టైమ్ ప్రోగ్రామ్‌లో చేరిన అభ్యర్థులకు నిబంధనల ప్రకారం ఫెలోషిప్ ఇస్తారు.

స్పెషలైజేషన్‌లు: కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, మేథమెటిక్స్ అండ్ డేటా సైన్స్.

అర్హత: సీఎస్ఈ, ఈసీఈ విభాగాల్లో బీఈ/బీటెక్ ఉత్తీర్ణతతోపాటు ఎంఈ/ ఎంటెక్/ఎంఎస్ రీసెర్చ్ లేదా ఎమ్మెస్సీ(కంప్యూటర్స్/ఎలక్ట్రానిక్స్/ఫిజిక్స్) పూర్తిచేసి ఉండాలి. మేథమెటిక్స్ అండ్ డేటా సైన్స్ విభాగానికి మాస్టర్స్(స్టాటిస్టిక్స్/మేథమెటిక్స్) ఉత్తీర్ణులై ఉండాలి. డిగ్రీ, పీజీ స్థాయిల్లో ప్రథమ శ్రేణి మార్కులు తప్పనిసరి. కనీసం 8 సీజీపీఏ స్కోర్‌తో (బీఈ/బీటెక్)(సీఎస్ఈ/ ఈసీఈ) ఉత్తీర్ణులైన అభ్యర్థులు నేరుగా పీహెచ్‌డీలో చేరవచ్చు. వీరు సంబంధిత రీసెర్చ్ పేపర్స్ సబ్మిట్ చేయాల్సి ఉంటుంది. పార్ట్ టైమ్ ప్రోగ్రామ్‌నకు ఐటీ ప్రొఫెషనల్స్; డీఆర్‌డీఓ, ఇస్రో తదితర సంస్థల్లో పనిచేస్తున్న రీసెర్చ్ సైంటిస్టులు అప్లయ్ చేసుకోవచ్చు. కనీసం మూడేళ్ల అనుభవం ఉండాలి. పీహెచ్‌డీ అడ్మిషన్ కమిటీ రికమండ్ చేసిన అభ్యర్థులు కూడా అర్హులే.

ఎంపిక: ఫుల్ టైమ్ ప్రోగ్రామ్‌నకు రాత పరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూల ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. రాత పరీక్ష సిలబస్‌ను వెబ్‌సైట్‌లో చూడవచ్చు. పార్ట్ టైమ్ ప్రోగ్రామ్‌నకు టెక్నికల్ ఇంటర్వ్యూ, రీసెర్చ్ ప్రపోజల్ ప్రజంటేషన్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.500; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.200
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 20
- **వెబ్‌సైట్:** iiits.ac.in

దిక్సూచి
DIKSUCHI

ఐఐఎస్సీలో బీటెక్

బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్(ఐఐఎస్సీ)- బీటెక్(మేథమెటిక్స్ అండ్ కంప్యూటింగ్) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. ఎనిమిది సెమిస్టర్లు ఉంటాయి. ప్రోగ్రామ్‌లో భాగంగా కోర్ కోర్సులు, సాఫ్ట్ కోర్ కోర్సులు, ఎలక్టివ్ కోర్సులు, ప్రాజెక్ట్ వర్క్‌లు ఉంటాయి. ఈ ప్రోగ్రామ్‌లో మొత్తం 52 సీట్లు ఉన్నాయి. అభ్యర్థులు మరో ఏడాది చదివి ఎంటెక్ డిగ్రీ పొందే వీలుంది. హాస్టల్ సౌకర్యం ఉంది. ఈ ప్రోగ్రామ్ పూర్తిచేసిన అభ్యర్థులు ఐటీ, డేటా అనలిటిక్స్, ఫిన్‌టెక్ సంస్థల్లో ప్లేస్‌మెంట్స్ పొందవచ్చు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. 2024 జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో అర్హత తప్పనిసరి.

ఎంపిక: 2024 జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో సాధించిన ర్యాంక్ ఆధారంగా కౌన్సెలింగ్ నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 17
- **వెబ్‌సైట్:** btechug.iisc.ac.in/

ఎన్ఐఈపీఐడీలో ప్రోగ్రామ్‌లు



సికింద్రాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ద ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ ఇంటెలెక్చువల్ డిజెబిలిటీస్(ఎన్ఐఈపీఐడీ)- డిప్లొమా, డీఈడీ, బీఈడీ, ఎంఈడీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. సికింద్రాబాద్ సహా కోల్‌కతా, నవీ ముంబై, నోయిడా, సీఆర్‌సీ సెంటర్లలో ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. డిప్లొమా వ్యవధి ఏడాది. మిగిలిన ప్రోగ్రామ్‌ల వ్యవధి రెండేళ్లు. డీఈడీ, డిప్లొమా ప్రోగ్రామ్‌లకు కౌన్సెలింగ్, ఇంటర్వ్యూల ద్వారా; బీఈడీ, ఎంఈడీ ప్రోగ్రామ్‌లకు ఎంట్రెన్స్ టెస్ట్, కౌన్సెలింగ్‌ల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. ప్రోగ్రామ్‌లన్నింటికీ ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది. ఆసక్తి గల అభ్యర్థులు ఆయా సెంటర్లకు దరఖాస్తు చేసుకోవాలి. పూర్తి వివరాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

సికింద్రాబాద్ సెంటర్‌లోని ప్రోగ్రామ్‌లు - సీట్లు

- డిప్లొమా ఇన్ ఎడ్యుకేషన్(స్పెషల్ ఎడ్యుకేషన్-ఐడీడీ) - 38 సీట్లు
- డిప్లొమా - ఎర్లీ చైల్డ్‌హుడ్ స్పెషల్ ఎడ్యుకేషన్ 33 సీట్లు, ఒకేషనల్ రీహాబిలిటేషన్ 33 సీట్లు

అర్హత: బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్‌నకు ద్వితీయ శ్రేణి మార్కులతో బీఏ/బీకాం/బీఎస్సీ ఉత్తీర్ణులై ఉండాలి. ఎంఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్‌లో ప్రవేశానికి బీఈడీ(స్పెషల్ ఎడ్యుకేషన్/జనరల్ ఎడ్యుకేషన్) లేదా ఇంటిగ్రేటెడ్ బీఏ/బీకాం/బీఎస్సీ-బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ చేసి ఉండాలి. డిప్లొమా, డిప్లొమా ఇన్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్‌లకు ద్వితీయ శ్రేణి మార్కులతో ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలి.

ఎంట్రెన్స్ ఎగ్జామ్ వివరాలు: ఇది ఆబ్జెక్టివ్ టెస్ట్. ఇందులో జనరల్ మెంటల్ ఎబిలిటీ, జనరల్ నాలెడ్జ్, జనరల్ ఇంగ్లీష్, బ్రాడ్ యాస్పెక్ట్స్ ఆఫ్ జనరల్ ఎడ్యుకేషన్ అండ్ స్పెషల్ ఎడ్యుకేషన్ అంశాల నుంచి 100 ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం మార్కులు 100. పరీక్ష సమయం గంటన్నర.

- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** సికింద్రాబాద్, కోల్‌కతా, సీఆర్‌సీ సెంటర్లు-జూన్ 14; నవీ ముంబై సెంటర్-ఎంఈడీ, బీఈడీ ప్రోగ్రామ్‌లకు జూలై 26, డీఈడీ, డిప్లొమా ప్రోగ్రామ్‌లకు జూన్ 13; నోయిడా సెంటర్-జూన్ 5
- **ఎంట్రెన్స్ టెస్ట్ తేదీలు:** కోల్‌కతా సెంటర్ - జూన్ 30; నవీ ముంబై - ఆగస్టు 10
- **వెబ్‌సైట్:** www.niepid.nic.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/VTVnpuoలో చదవండి.



పాలతో ఇలా చేస్తే...

వయసు పెరిగే కొద్దీ పలు కారణాల వల్ల జుట్టు తగ్గిపోతోందని ఆందోళన చెందనివారు ఉండరు. జుట్టు పోషణ కోసం, సంరక్షణ కోసం చాలామంది ఎంతో ఖర్చు పెడుతూ ఉంటారు. జుట్టును సహజంగా బలోపేతం చేయగల పదార్థాల్లో పాలు ముఖ్యమైనవి.

- ఆరోగ్యానికి పాలు మంచి పోషకాహారం అని మనకు తెలుసు. అంతేకాదు, పాలలో ఉండే కేసీన్ అనే ప్రోటీన్ వల్ల జుట్టు ఒత్తుగా, బలంగా పెరుగుతుందని నిపుణులు చెబుతున్నారు. జుట్టు పోషణలో పాలను ప్రధాన భాగంగా చేసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలేమిటో తెలుసుకుందాం.
- పాలు జుట్టు కుదుళ్లకు బలాన్నిస్తాయి. జుట్టులో తేమను పెంచుతాయి. జుట్టును మెత్తగా, మృదువుగా మార్చుతాయి.
- ఎక్కువ సేపు ఎండలో తిరగాల్సివచ్చినపుడు... సూర్యకాంతిలో ఉండే అతినీల లోహిత కిరణాల వల్ల జుట్టు పొడిబారిపోయి, బిరుసుగా తయారవుతుంది. ఇలాంటి సందర్భాల్లో పాలను ఆహారంగానే కాకుండా జుట్టును శుభ్ర పరచడానికి కూడా వాడవచ్చు.
- పాల మీగడ జుట్టు పొడిబారడాన్ని, బిరుసుదనాన్ని తగ్గించి... వెంట్రుకల చివర్లు చిట్లిపోవడాన్ని నిరోధిస్తుంది. పాలలోఉండే విటమిన్ సి, పలు యాంటీ ఆక్సిడెంట్లు... కొల్లాజెన్ ఉత్పత్తికి తోడ్పడతాయి.
- జుట్టు ఒత్తిడికి గురై, బలహీనమై, పొడిబారి, తెగిపోతూఉన్నప్పుడు, పాలు ఆ సమస్యను తగ్గిస్తాయి.

ఆఫీస్ యోగా

వేగంగా మారుతున్న ప్రపంచం, మారుతున్న జీవన విధానంతో పాటు, ఉద్యోగాల సరళి కూడా మారిపోతోంది. ఎక్కువగా కంప్యూటర్ తెర ముందు గంటల పాటు కదలకుండా కుర్చీలో కూర్చొని చేసే ఉద్యోగాలే కనిపిస్తున్నాయి. అన్నేసి గంటల పాటు ఒకే భంగిమలో



కదలకుండా కూర్చోవలసి రావడం వల్ల కొన్ని నొప్పులు, ఆరోగ్య సమస్యలు కూడా వస్తున్నాయి. దీనికి డాక్టర్ల దాకా వెళ్లకుండా... ముందు జాగ్రత్తలు, చిట్కాలు ఏమైనా ఉన్నాయా అంటే... అవునని చెబుతోంది. భారతీయ యోగా.

ఆఫీస్‌లో కుర్చీలో కూర్చుని ఉండగానే ఒక ఐదు నిమిషాలు శరీరాన్ని చిన్న యోగా భంగిమల్లో సాగదీయడం ద్వారా... ఎక్కువ సమయం కూర్చుని ఉండటం వల్ల కలిగే ఇబ్బందులను అధిగవింంచవచ్చు.

ఆ యోగాసనాలు

1. కూర్చుని చేసే తాడాసనం
తాడాసనం అంటే మొత్తం శరీరాన్ని పాదాల మునివేళ్లమీద నిలబెట్టి సాగదీయడం. ఇపుడు నిలబడవలసిన అవసరం లేకుండా, కుర్చీలో కూర్చుని, రెండు చేతులను పైకెత్తాలి. శరీరాన్నిపై వైపు కొన్ని సెకన్ల పాటు సాగదీయాలి.(స్ట్రెచ్)

2. కూర్చుని ముందుకు వంగాలి. రెండు చేతులను చెవుల పక్కనుండి సాధ్యమైనంత పైకి సాగదీయాలి. .అలాగే కుర్చీలో కూర్చుని, తలను మోకాళ్ల దాకా తీసుకు రావాలి.

3. మార్జాలాసనం
కూర్చుని ముందుకు వంగకుండా శరీరాన్ని పిల్లి మాదిరిగా... వెన్నెముక ముందుకు వంచకుండా సాగదీయాలి. గడ్డాన్ని మోకాళ్ల దాకా తీసుకురావాలి.

4. మెడను అన్ని వైపులా తిప్పడం
మెడను ముందుగా గడ్డానికి తగిలేలా వంచి, అక్కడినుంచి భుజాల మీదుగా గుండ్రగా తిప్పడం వల్ల మెడ కండరాలు విశ్రాంతిని పొందుతాయి.

5 చేతులను బాగా ముందుకు చాచి, ఒక చేతితో రెండవ అర చేతిని కొద్దిగా వెనక్కి వంచాలి. దీనివల్ల చాలాసేపు కంప్యూటర్ కీబోర్డు మీద ఒకే భంగిమమలో ఉన్న చేతులు, వేళ్లు విశ్రాంతిని పొందుతాయి.

కూర్చున్న చోటనే ఒక్క ఐదు నిమిషాలు ఇవన్నీ చేయడం వల్ల... వెన్ను నొప్పి తగ్గుముఖం పట్టే అవకాశం ఉంటుంది.

కుంగుబాటు లక్షణాలివే...



ఎప్పటికప్పుడు మారుతున్న ఈ ఆధునిక ప్రపంచంలో జీవనం చాలమందికి ఎంతో ఒత్తిడితో, మరెంతో అలసటతో కూడుకున్నది. మనం ఎంతో మామూలుగా భావించి వదిలేసే కొన్ని లక్షణాలు దీర్ఘకాలిక అలసటకు, కుంగుబాటుకు సూచనలు కావచ్చు. అలాంటి కొన్ని లక్షణాలను తెలుసుకుందాం.

- ఎల్లప్పుడూ అలసిపోయినట్లుగా, నీరసంగా అనిపించడం. మామూలుగా చేసుకునే పనుల విషయంలో కూడా అయోమయానికి గురవుతుండటం.
- రాత్రంతా నిద్ర సరిగా పట్టక పడక మీద అటు ఇటు తిరుగుతూ దొర్లుతూ ఉండటంవల్ల మరుసటి రోజు ఉత్సాహంగా పని చేసుకోలేక పోవడం, అది తీవ్రమైన మానసిక అలసటకు, కుంగుబాటుకు సూచన కావచ్చు.
- ఎప్పుడో ఓసారి అనారోగ్యం బారిన పడటం అందరికీ మామూలే. పూర్తి ఆరోగ్యవంతుడైన మనిషికి ఏడాదిలో రెండు, మూడుసార్లు మాత్రమే జలుబు వంటి ఆరోగ్య సమస్యలు వస్తాయి. కానీ పదేపదే చిన్న ఆరోగ్య సమస్యల బారిన పడుతూ ఉంటే మాత్రం అది కుంగుబాటు సూచనగా భావించి తగు జాగ్రత్తలు తీసుకోవడం మంచిది. ఛాతీలో పట్టేసినట్లు, శ్వాస సరిగా ఆడనట్లు అనిపించడంకూడా కుంగుబాటుకు మరొక సూచనగా చెప్పవచ్చు.
- సెలవు రోజులల్లోనో లేక ఆదివారమో మధ్యాహ్నం కాసేపు కునుకు తీయడం వల్ల మరింత విశ్రాంతి లభిస్తుంది. కానీ పదేపదే సమయం సందర్భంలేకుండా కూడా నిద్ర పోవాలని అనిపిస్తే అది కుంగుబాటుకు సూచన కావచ్చు. అంతేకాకుండా...
- కారణం లేకుండా లేదా చిన్న చిన్న విషయాలకే కుటుంబ సభ్యులమీద, దగ్గరి వారిపై చిరాకు పడటం
- పెదవులు ఎండిపోయి, పగిలిపోయి ఉండటం. జుట్టు, చర్మం పొడిబారి కాంతిహీనంగా తయారవటం
- వ్యాయామంమీద ఆసక్తి తగ్గిపోవటం, ఫాస్ట్ ఫుడ్‌మీద ఎక్కువ మక్కువ చూపించటం

సండే సెలబ్రిటీ



ఇక్కడ చాలా విషయాలు దాచలేం..

ప్రస్తుతం సోషల్ మీడియా చాలా విస్తృతంగా వ్యాపిస్తోంది. దీని ప్రభావం అన్ని రంగాలపైనా కనిపిస్తోంది. ఒకప్పుడు బుల్లి తెర నటులకు స్టార్‌డమ్ వచ్చినట్లే- సోషల్ మీడియాలో స్టార్స్‌కు ప్రజల్లో ఆదరణ లభిస్తోంది. వారిలో కొందరు సినిమాలలోకి ప్రవేశిస్తున్నారు. అలాంటి ఇన్‌ఫ్లుయన్సర్స్‌లో ఒకరు **నిఖిల్ విజయేంద్ర సింహ**. మూడు వందలకు పైగా ఇంటర్వ్యూలతో లక్షల మంది ఫాలోవర్స్‌ను సంపాదించుకున్న నిఖిల్ సినిమా హీరోగా కూడా మారాడు. ఈ నేపథ్యంలో- ప్రస్తుతం సోషల్ మీడియాలో పరిస్థితుల గురించి 'నవ్య'కు వివరించారు.

సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయన్సర్‌గా ఉన్న మీరు హీరోగా రంగ ప్రవేశం చేయడం ఎలా జరిగింది?

చిన్నప్పటి నుంచి నాకు కళారంగం అంటే చాలా ఇష్టం. అమ్మ కూడా నన్ను ఎంతో ప్రోత్సహించేది. స్కూల్లో, కాలేజీలో అనేక కల్చరల్ యాక్టివిటీస్‌లో పాల్గొనేవాడిని. నేను వైజాగ్ గీతమ్ కాలేజీలో చదివాను. ఆ తర్వాత హైదరాబాద్ వచ్చేశాను. నా రెజ్యూమ్ పట్టుకొని ఎన్నో ఆఫీసులకు తిరుగుతూ ఉండేవాడిని. ఒకరోజు అనుకోకుండా ఒక డిజిటల్ మీడియా సంస్థకు వెళ్లాను. అక్కడ నాకు తొలి అవకాశం లభించింది. నేను ఎప్పుడూ డిజిటల్ మీడియా ఇన్‌ఫ్లుయన్సర్ కావాలని అనుకోలేదు. అనుకోకుండా అయ్యా. తెలుగు సినీ రంగంలో పెద్ద పెద్ద స్టార్స్ అందరినీ ఇంటర్వ్యూలు చేశా. ఆ మధ్య నాకు బెంగుళూరు నుంచి ఒక కాల్ వచ్చింది. "లహరీ ఫిల్మ్స్ వారు సినిమా తీస్తున్నారు.. మీరు బెంగుళూరుకు వస్తే కథ చెబుతాం" అన్నారు. బెంగుళూరుకు వెళ్లా. కథ బాగా నచ్చింది. వెంటనే ఒప్పేసుకున్నా.

డిగ్రీ చదివిన పిల్లలు ఉద్యోగాలు చేయాలని తల్లితండ్రులు అనుకుంటారు.. సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయన్సర్ అవుతానంటే ఇంట్లో వాళ్లు అభ్యంతరం చెప్పలేదా?

అమ్మ రాజముఖి, నాన్న వరప్రసాద్ - నాకు చిన్నప్పటి నుంచి చాలా సపోర్ట్‌గా ఉన్నారు. అమ్మ సూర్యావతి ఎన్‌జీఓలో పనిచేసేది. బాగా గిటార్ వాయిస్తుంది. నన్ను కూడా చిన్నప్పటి నుంచి డ్యాన్స్ మ్యూజిక్ క్లాసుల్లో చేర్పించింది. నాన్నకు రియల్ ఎస్టేట్ కంపెనీ ఉంది. ఆయన కూడా చిన్నప్పటి నుంచి నన్ను ప్రోత్సహించారు. మా అన్నయ్య కుద్రు సినీ దర్శకుడు. 'హాయ్ నాన్న' అనే చిత్రానికి దర్శకత్వం వహించాడు. చిన్నప్పటి నుంచి మేమిద్దరం సినిమాలు, సోషల్ మీడియా వెనక తిరుగుతూ ఉండేవాళ్లం. అమ్మ, నాన్నల స్నేహితులు- "ఏంటి... మీ వాళ్లిద్దరూ ఆ దారిలో వెళ్లారు...అక్కడ సక్సెస్ చాలా కష్టం కదా.." అనేవారు. కానీ వాళ్లు ఎప్పుడూ ఆ మాటలను పట్టించుకోలేదు. మాకు ఎప్పుడూ అడ్డు చెప్పలేదు.

రీల్స్, ఇన్‌స్టా, యూట్యూబ్- ఇలా సోషల్ మీడియా అంటే చాలామందిలో ఒక చిన్న చూపు కనిపిస్తూ ఉంటుంది. "రీల్స్ చేయటం సులభమేగా!" అంటూ ఉంటారు. దీనిలో నిజమెంత?



ఒక సినిమాకు ఎంత కష్టపడతామో, ఒక యూట్యూబ్ షూట్‌కు అంత కష్టపడాల్సి ఉంటుంది. కెమెరా, మేకప్, లైటింగ్, సౌండ్- ఇలా అన్నీ కుదరకపోతే మంచి యూట్యూబ్ కంటెంట్ రాదు. బహుశా నిడివి తక్కువగా ఉండటం వల్ల చాలామందికి దాని వెనక ఉన్న కష్టం తెలియదు. రీల్స్ చేయటం కూడా చాలా కష్టం. నేను వచ్చినప్పుడు యూట్యూబ్ అంటే కొంత చులకన భావం ఉండేది. ఇప్పుడు ఆ పరిస్థితులు మారుతున్నాయి. సోషల్ మీడియా వ్యాప్తి బాగా పెరిగింది. లక్షల మంది వీటిని ఫాలో అవుతున్నారు.

యూట్యూబ్‌లో, ఇన్‌స్టాలో లక్షల మంది సబ్‌స్క్రైబర్స్ కనిపిస్తూ ఉంటారు. ఈ సంఖ్యలను ఎంత వరకు నమ్మవచ్చు?

కొందరు థర్డ్ పార్టీ యాప్‌ల ద్వారా సబ్‌స్క్రైబర్స్‌ను కొనుక్కుంటూ ఉంటారు. ముఖ్యంగా ఇది ఇన్‌స్టాలో ఎక్కువగా జరుగుతుంది. యూట్యూబ్‌లో తక్కువగా ఉంటుంది. అయితే ఇక్కడ గుర్తుపెట్టుకోవాల్సిన విషయేమేమిటంటే- మనకు లక్షల సబ్‌స్క్రైబర్స్ ఉన్నట్లు చూపించి మోసం చేయలేం. ఉదాహరణకు ఒకరికి మిలియన్ సబ్‌స్క్రైబర్స్ ఉన్నారనుకుందాం. ఆమె ఒక పోస్ట్ పెడితే వంద లైక్‌లు వస్తే- ఎక్కడో తేడా ఉన్నట్లే లెక్క కదా! సోషల్ మీడియాలో చాలా విషయాలను దాచలేం. అంతేకాకుండా ఇలా సబ్‌స్క్రైబర్స్‌ను కొనుక్కుంటే- మానిటైజేషన్ (యూట్యూబ్ ద్వారా సొమ్ము పొందటం) విషయంలో సమస్యలు ఏర్పడతాయి.

ఈ మధ్యకాలంలో బెట్టింగ్ యాప్‌ల వల్ల అనేక మంది నష్టపోతున్నారు. వీటిని కొందరు ఇన్‌ఫ్లుయన్సర్స్ ప్రమోట్ చేస్తున్నారు కదా... దీనిపై మీ అభిప్రాయమేమిటి?

నా ఉద్దేశంలో బెట్టింగ్ లాంటివి వ్యక్తిగతమైన విషయాలు. ఇది కూడా పేక ఆడటం లాంటిదే. దీనికి రెండు కోణాలు ఉన్నాయి. బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేసే ఇన్‌ఫ్లుయన్సర్స్ - జాగ్రత్తగా ఉండమని ముందు జాగ్రత్తలు తప్పనిసరిగా చెబుతారు. ఇక రెండోది- కొందరు ఇన్‌ఫ్లుయన్సర్స్‌కు ఆర్థికపరమైన ఇబ్బందులు వస్తాయి. వారికి జీవనాధారం వేరే ఏదీ ఉండదు. ఆ సమయంలో బెట్టింగ్ యాప్‌ల వారు ప్రమోషన్ చేస్తే ఎక్కువ మొత్తం డబ్బులు ఇస్తామంటారు. దాంతో వారు ప్రమోషన్ చేయటానికి మొగ్గు చూపుతారు. వేల మంది ఇన్‌ఫ్లుయన్సర్స్ ఉంటే టాప్‌లో ఉన్న కొందరు మాత్రమే వీటిని ప్రమోట్ చేస్తారు. ఈ మధ్య కాలంలో దీనిపై వివాదం నెలకొన్న తర్వాత చాలామంది వీటిని ప్రమోట్ చేయటానికి ఇష్టపడటం లేదు.

• సీవీఎల్ఎన్ ప్రసాద్

గాసిప్



మిలియన్ల మాయ!

మనం అంకెలను నమ్మినట్లు దేనిని నమ్మం! ఒకటి.. రెండు.. మూడు.. వంద.. ఇలా గట్టిగా అరుస్తూ చెబితే మంచి కాలేజీలని నమ్మేస్తాం. పిల్లలకు ర్యాంకులు వస్తాయని వాటిలోనే చేరుస్తాం. క్లాసుకు పది మంది పిల్లలు ఉన్న చోట- మన వాడికి మొదటి ర్యాంకు వస్తే ఆనందపడిపోతాం. ఇదంతా ఎందుకు చెప్పాల్సి వస్తోందంటే - ఈ చిన్నవీక్‌నెక్‌ను మన సినిమా రంగం గమనించింది.. దానిని అందరూ వాడుకోవటం మొదలుపెట్టారు కాబట్టి. మీలో చాలా మందికి ఈ పాటికి విషయమంతా - మాయ వీక్షణాలకు (వ్యూస్) సంబంధించిందని అర్థమైపోయి ఉంటుంది.

ఒకప్పుడు సినిమాలకు వంద రోజుల ఫంక్షన్లు చేసేవారు. కలెక్షన్లను ప్రకటనల రూపంలో ప్రచురించేవారు. ఎన్ని రోజులు ఆడితే- అన్ని ఎక్కువ కలెక్షన్లు వస్తాయి. ఎన్ని ఎక్కువ కలెక్షన్లు వస్తే ఆ సినిమా అంత హిట్ అయినట్లు. కానీ సినిమాలు వందరోజులు ఆడే పరిస్థితులు పోయి- వీకెండ్ సక్సెస్ అయితే చాలు అనుకొనే పరిస్థితులు వచ్చేసాయి. ప్రస్తుత పరిస్థితుల్లో ఏదైనా ఒక సినిమా రెండు వారాలు హౌస్‌ఫుల్ కలెక్షన్లతో ఆడితే - అది గొప్ప హిట్ అని చెప్పుకోవచ్చు. పెద్ద హీరోల సినిమాలైతే పది రోజులు ఆడితే చాలు. ఇలాంటి పరిస్థితుల్లో హీరోకు ఎంత పాపులారిటీ ఉందో ఎలా తెలుస్తుంది? దీనికి మార్కెటింగ్, పీఆర్ వ్యవస్థ కనిపెట్టిన గొప్ప సాధనం 'వ్యూస్'. సోషల్ మీడియాలో ఒక పోస్ట్‌కు ముఖ్యంగా- యూట్యూబ్, ఇన్‌స్టాలలో ఎంత మంది చూశారు అనే విషయంపైనే దానికి ఎంత ఆదరణ లభించిందనే విషయం తెలుస్తుంది. ఉదాహరణకు మనం చిన్న షార్ట్ ఫిల్మ్ తీసి యూట్యూబ్‌లో పెట్టామనకుందాం. మనకు తెలుసున్న వాళ్లు మాత్రమే చూస్తారు. వారు ఎవరికైనా పంపితే - వాళ్లు చూస్తారు. ఇలా చైన్ రియాక్షన్ వెళ్తూ ఉంటుంది. అంటే దానిని ఎంత మంది చూస్తే అంత ఆదరణ లభించినట్లు లెక్క. ఈ సూత్రాన్ని అనుసరించి- మన హీరోలు తమకు సంబంధించిన పోస్టులను, సినిమా టీజర్స్‌ను ఇన్‌స్టాలోను, యూట్యూబ్‌లోను పోస్ట్ చేస్తూ ఉంటారు. అవి విడుదలయిన వెంటనే అభిమానులు చూస్తారు. వాటికి వ్యూస్ వస్తాయి.

> వందల కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి సినిమాలు తీసే నిర్మాతలు.. వాటిలో నటించే హీరోలు ఇంత అమాయకులా? ఈ మాయ వీక్షణాల కోసం లక్షలు ఖర్చుపెడతారా అనే అనుమానం రావచ్చు.

అయితే మీలో కొందరికి ఒక సినిమా టీజర్ విడుదలయిన వెంటనే మిలియన్ వ్యూస్ ఎలా వస్తాయనే అనుమానం వచ్చి ఉండచ్చు. ఆ హీరోకి అంత మంది అభిమానులు ఉన్నారేమోనని సరిపెట్టుకొని ఉండచ్చు. కానీ ఈ వ్యూస్ వెనక లక్షల వ్యాపారం ఉందనే విషయం చాలా తక్కువ మందికి తెలుసు. దీనిని సదోహరణంగా చెప్పుకుందాం. ఈ మధ్య ఒక యువ హీరో పుట్టిన రోజు సందర్భంగా ఒక పాన్ ఇండియా సినిమా టీజర్ రిలీజ్ చేశారు. ఆ టీజర్ వ్యూస్‌లో రికార్డు బద్దలు కొట్టాలని. .100 మిలియన్ (10 కోట్లు) వ్యూస్ రావాలని హీరోగారు హుకుం జారీ చేశారు. దాంతో సదరు నిర్మాణ సంస్థ ఆ వ్యూస్‌ను కొనే పనిలో పడింది. ఈ వ్యూస్‌ను అమ్మటానికి కొన్ని సంస్థలు ఉంటాయి. అవి అత్యాధునిక టెక్నాలజీలను ఉపయోగించి.. నకిలీ అకౌంట్ల ద్వారా వ్యూస్‌ను అమ్ముతాయి. లక్ష వ్యూస్‌కు ఒక రేటు.. రెండు లక్షల వ్యూస్‌కు ఒక రేటు.. పది లక్షల వ్యూస్‌కు ఒక రేటు- ఇలా ఉంటాయి. సాధారణ పరిస్థితులు ఉన్న సమయంలో - డబ్బులుంటే - ఈ వ్యూస్‌ను కొనటం చిటికెలో పని. కానీ ఎన్నికల వేళ- ఎన్నికల కమిషన్ సోషల్ మీడియాకు కొన్ని విధివిధానాలు జారీ చేసింది. దీంతో ఈ వ్యూస్ వ్యవహారం - ఆ చట్రంలో చిక్కుకుంది. నిర్మాణ సంస్థ డబ్బులు చెల్లించిన తర్వాత కూడా వెంటనే 'వ్యూస్'ను జోడించటం కుదరలేదు. దీనితో హీరోగారి పుట్టిన రోజుకు వంద మిలియన్ల వ్యూస్ రాలేదు. రికార్డులు బద్దలు కొట్టలేదు.

ఇదంతా చదివిన తర్వాత వందల కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి సినిమాలు తీసే నిర్మాతలు.. వాటిలో నటించే హీరోలు ఇంత అమాయకులా? ఈ మాయ వీక్షణాల కోసం లక్షలు ఖర్చుపెడతారా అనే అనుమానం రావచ్చు. హీరోల ఇళ్లముందుకు వచ్చి ప్రేక్షకులు జయజయనినాదాలు చేసే రోజులు పోయాయి. ఇక మిగిలింది ఫోన్లే! వాటిలో జయజయ నినాదాలు వింటే తృప్తిగా ఉంటుంది కదా! అవి మాయా వీక్షణాలని తెలిసినా! ఈ మొత్తం వ్యవహారంలో నష్టపోయేది ఎవరు.. నిర్మాతే.. లాభపడేది ఎవరు? ఎక్కడో ఆఫ్రికాలోనో.. యూక్రేన్‌లోనో.. యూరప్‌లోనో ఉండే కంపెనీలు.. వాటికి ఇక్కడి నుంచి బిజినెస్ ఇస్తున్న మార్కెటింగ్.. పీఆర్ కంపెనీలు. ఈ మాయా వీక్షణాల బుడగ కూడా ఎప్పుడో ఒకప్పుడు బద్దలవుతుంది. అప్పుడిక జయజయ నినాదాలు వినిపించవు.



అలనాటి కథ

చరిత్ర మరచిన దివాన్!

హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనం కావాలని కోరుకున్నవారిలో సర్ మీర్జా ఇస్మాయిల్ ఒకరు. 1946లో హైదరాబాద్ దివాన్‌గా పదవిని చేపట్టిన ఇస్మాయిల్ ఎప్పుడూ అవిభాజ్య భారతదేశాన్ని కోరుకున్నారు. ఆయన హైదరాబాద్ సంస్థానానికి రాకముందు- మైసూర్ మహరాజా వద్ద దివాన్‌గా పనిచేశారు. ఆ సమయంలో మేము ఊటీ వెళ్లాలంటే బెంగుళూరు మీద నుంచి వెళ్లేవాళ్లం. ఆ సమయంలో సర్ ఇస్మాయిల్ నాకు పరిచయం.

మేము చిన్నప్పుడు ఊటీకి వెళ్లాలంటే- మద్రాసు మీదగా కాకుండా- బెంగుళూరు మీదగా వెళ్లేవాళ్లం. మేము ఊటీ వెళ్తున్నామని తెలిస్తే- మైసూర్ మహరాజా మమల్ని కొద్ది కాలం బెంగుళూరు, మైసూర్‌లలో విడిది చేయమని ఆహ్వానించేవారు. దాంతో ముందు బెంగుళూరు, మైసూర్‌లకు వెళ్లి అక్కడ కొద్దికాలం ఉండేవాళ్లం. సాధారణంగా మేము వెళ్లే సమయానికి మైసూర్ ప్యాలెస్‌లో గుల్‌మొహర్ పూలు పూసేవి. ప్యాలెస్ చాలా పెద్దదిగా ఉండేది. దీనితో మమల్ని ప్యాలెస్ చూడటానికి కార్లలో తీసుకువెళ్లేవారు. ఆ తర్వాత అమ్మ షాపింగ్‌కు వెళ్లి- మైసూర్ సిల్క్ చీరలు, మంచి గంధం నూనె కొనేది.



ఆ రోజుల్లో మైసూర్ చూడటానికి చాలా అందంగా ఉండేది. ఆ రోజుల్లో మన దేశంలో ఉన్న అందమైన నగరాల్లో మైసూర్ కూడా ఒకటని చెప్పుకొనేవారు. మైసూర్‌కు వెళ్లినప్పుడల్లా- సర్ ఇస్మాయిల్- అమ్మనాన్నలను ఒక రోజు లంచ్‌కి.. మరొక రోజు డిన్నర్‌కు పిలిచేవారు. కొన్ని సార్లు అమ్మనాన్నలతో మేము కూడా లంచ్‌లకు వెళ్లేవాళ్లం. మైసూర్ సంస్థానంలో సర్ ఇస్మాయిల్‌కు మంచి పేరు ఉండేది. మైసూర్ మహరాజా వడయార్‌కు ఆయన చాలా సన్నిహితంగా ఉండేవారు. సర్ సి.వి. రామన్, సి.పి. రామస్వామి అయ్యర్ వంటి వారు ఆయనకు స్నేహితులు. మైసూర్ మహరాజుకు ఏడీసీగా ఉద్యోగాన్ని ప్రారంభించిన సర్ ఇస్మాయల్ తన మేధతో దివాన్ పదవిగా ఎదిగారు.

అలా ఒక సారి మైసూర్ వెళ్లినప్పుడు- సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్యను కలిసాను. మోక్షగుండం విశ్వేశ్వరయ్య అప్పటికే కృష్ణరాజసాగర్ నిర్మాత సారథిగా దేశవ్యాప్తంగా పేరు తెచ్చుకున్నారు. చూడటానికి చాలా సాదాసీదాగా కనిపించే విశ్వేశ్వరయ్య తాను చెప్పదలుచుకున్న విషయాన్ని చాలా స్పష్టంగా.. అందరికీ అర్థమయ్యేలా చెప్పేవారు.



ఆయనతో జరిగిన భేటీకి సర్ ఇస్మాయిల్ కూడా వచ్చిన జ్ఞాపకం. దాదాపు 75 సంవత్సరాల తర్వాత కూడా ఆయనతో సమావేశం ఇంకా గుర్తు ఉందంటే - ఆయన నాపై ఎలాంటి ముద్ర వేశారో అర్థం చేసుకోవచ్చు. ఆ పర్యటనలో మరచిపోలేని మరో జ్ఞాపకం- మహరాజా తోబుట్టువులను కలుసుకోవటం. సాధారణంగా రాజకుటుంబీకులకు కలుసుకోవాలంటే - వారి కుటుంబ పెద్ద అనుమతి తీసుకోవాల్సి ఉండేది. మైసూర్ మహరాజా వారి తోబుట్టువులను కలుసుకోవటానికి మాకు అనుమతి ఇచ్చారు. దాంతో మేమందరం వారిని కలవటానికి ఒక ప్యాలెస్‌కు వెళ్లాం.

ఇక సర్ ఇస్మాయిల్‌ను ఊటీలో కూడా తరచూ కలుస్తూ ఉండేవాళ్లం. ఊటీలోని మైసూర్ ప్యాలెస్ మా ఇంటి వెనకే ఉండేది. అందువల్ల అప్పుడప్పుడు సర్ ఇస్మాయల్ అక్కడికి వచ్చేవారు. వచ్చినప్పుడు ఆయన మా ఇంటికి పార్టీకి వచ్చేవారు. మైసూర్ నుంచి ఆయన జయపూర్ దివానుగా.. ఆ తర్వాత హైదరాబాద్ దివానుగా వచ్చారు. హైదరాబాద్‌లో మా ఇంటికి చాలా సందర్భాలలో వచ్చిన జ్ఞాపకం. 1946లో మనకు స్వాతంత్ర్య రావటానికి ఎక్కువ సమయం పట్టదనే విషయం అందరికీ తెలిసిపోయింది. దీనితో రాజసంస్థాలన్ని బ్రిటన్ వారుతో మంతనాలు జరపటం మొదలుపెట్టాయి. నిజాంకు హైదరాబాద్ సంస్థానాన్ని భారత సమాఖ్యలో విలీనం చేయటం ఏ మాత్రం ఇష్టం లేదు. దీనితో నిజాం తరఫున సర్ ఇస్మాయిల్ బ్రిటిష్ వారితో మంతనాలు జరపటం మొదలుపెట్టారు. అయితే ఈ చర్చలేమి ఫలించలేదు. ఈ లోపులో గాంధీజీ హత్య జరిగింది. దేశవ్యాప్తంగా అల్లకల్లోల పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ పరిస్థితులు తనకు అనుకూలిస్తాయని నిజాం భావించారు. ఎటువంటి పరిస్థితుల్లో భారత సమాఖ్యలో హైదరాబాద్‌ను విలీనం చేయనని స్పష్టం చేశారు. దీనితో సర్ ఇస్మాయిల్ తన పదవికి రాజీనామా చేశారు. హైదరాబాద్ సంస్థానం చాలా క్లిష్టమైన పరిస్థితిలో ఉన్నప్పుడు సర్ ఇస్మాయిల్ తన మేధను ఉపయోగించి మేలు చేయటానికి ప్రయత్నించి విఫలమయ్యారు. చరిత్ర మరచిపోయిన హైదరాబాద్ దివానుల్లో సర్ ఇస్మాయిల్ ఒకరు అనటంలో అతిశయోక్తి లేదు.

• రాజకుమారి ఇందిరాదేవి ధన్‌రాజ్‌గిర్

నవ్య 'దృశ్యం పేజీ' లో ఆసక్తికర కథనాల కోసం... ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/QCfS9Ui లో చదవండి.

22,500 ఎగువకు నిఫ్టీ

మళ్లీ 74,000 దాటిన సెన్సెక్స్

రూ.412 లక్షల కోట్లకు బీఎస్ఈ మార్కెట్ క్యాప్

ముంబై: స్టాక్ ఎక్స్ఛేంజీలు శనివారం నిర్వహించిన ప్రత్యేక ట్రేడింగ్‌లోనూ సెన్సెక్స్, నిఫ్టీ ర్యాలీ కొనసాగింది. ప్రత్యేక ట్రేడింగ్ రెండో సెషన్ ముగిసేసరికి, సెన్సెక్స్ 88.91 పాయింట్ల వృద్ధితో 74,005.94 వద్దకు చేరుకుంది. నిఫ్టీ 35.90 పాయింట్లు పెరిగి 22,502 వద్ద క్లోజైంది. అంతర్జాతీయ మార్కెట్ల సానుకూల సంకేతాలు, విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల పెట్టుబడులు ట్రేడింగ్ సెంటిమెంట్‌ను మెరుగుపరిచాయి. సూచీలు లాభపడటం వరుసగా ఇది మూడో రోజు. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 19 లాభపడ్డాయి.

నెస్లే ఇండియా షేరు 2.33 శాతం పెరిగి సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది. బీఎస్ఈలోని స్మాల్‌క్యాప్ సూచీ 0.77 శాతం, మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.48 శాతం పెరిగాయి. అన్ని రంగాల సూచీలు పాజిటివ్‌గా ముగిశాయి. కొనుగోళ్ల మద్దతుతో స్టాక్ మార్కెట్ వర్గాల సంపదగా పరిగణించే బీఎస్ఈ మార్కెట్ క్యాపిటలైజేషన్ సరికొత్త జీవితకాల గరిష్ఠ స్థాయి రూ.412.37 లక్షల కోట్లకు చేరుకుంది. కాగా, ఈ వారంలో సెన్సెక్స్ 1,341.47 పాయింట్లు (1.84 శాతం), నిఫ్టీ 446.8 పాయింట్లు (2 శాతం) పుంజుకున్నాయి.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	74,620 ▲	68,400 ▲	96,500 ▲
ముంబై	73,383 ▼	67,219 ▼	86,373 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



19వ తేదీ			
హైదరాబాద్	550	విజయవాడ	540
వరంగల్	552	గోదావరి	540
చిత్తూరు	628	విశాఖపట్నం	550
		డజను గుడ్లు రూ.72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	150	గోదావరి	154
వరంగల్	150	విజయవాడ	154
కరీంనగర్	150	గుంటూరు	154
మహబూబ్‌నగర్	152	ఒంగోలు	154
కర్నూలు	152	చిత్తూరు	160
విశాఖపట్నం	146		

ఎన్నికల ఫలితాలు ఎలా ఉన్నా ఈ రంగాలు ముందుకే

ప్రభుదాస్ లీలాధర్

లోక్‌సభ ఎన్నికల్లో ఏ పార్టీ అధికారంలోకి వస్తుందనే అంశంతో సంబంధం లేకుండా ఎఫ్ఎంసీజీ, ఆటో, హెల్త్‌కేర్, ఐటీ సేవలు, ప్రైవేట్ బ్యాంక్‌లు, క్యాపిటల్ గూడ్స్ రంగాలు మెరుగైన పనితీరును కనబర్చనున్నాయని ప్రముఖ ఆర్థిక సేవల సంస్థ ప్రభుదాస్ లీలాధర్ తాజా నివేదికలో పేర్కొంది. ఎన్నికల ఫలితాల ప్రతికూల ప్రభావం నుంచి ఈ రంగాల షేర్లు రక్షణ కల్పించగలవని అభిప్రాయపడింది. తిరిగి ఎన్‌డీఏ అధికారంలోకి వస్తే ఇన్‌ఫ్రా, రక్షణ, క్యాపిటల్ గూడ్స్, పునరుత్పాదక ఇంధనం, పర్యాటక రంగాలు మెరుగైన పనితీరు కనబరచనున్నాయని రిపోర్టులో ప్రస్తావించింది. గ్రామీణ మార్కెట్ గిరాకీ మళ్లీ పుంజుకుంటుడటంతో పాటు ఈసారి సాధారణ వర్షపాతం నమోదు కావచ్చన్న అంచనాలు వినియోగదారు వస్తువులు, ద్విచక్ర వాహనాలు, ట్రాక్టర్ల కంపెనీలకు ఊతమివ్వనున్నాయని ప్రభుదాస్ లీలాధర్ అంటోంది.

ఎఫ్ అండ్ ఓ శాచెటైజేషన్‌ను పునఃపరిశీలించాలి..

సీఈఏ అనంత నాగేశ్వరన్



న్యూఢిల్లీ: ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ (ఎఫ్ అండ్ ఓ) ట్రేడింగ్‌లో గృహ పొదుపును పెట్టుబడిగా పెట్టడంపై ప్రధాన ఆర్థిక సలహాదారు (సీఈఏ) వీ అనంత నాగేశ్వరన్ ఆందోళన వ్యక్తం చేశారు. ఎఫ్ అండ్ ఓ ట్రేడింగ్ శాచెటైజేషన్‌ను పునఃపరిశీలించాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ విభాగంలో పెట్టుబడులు పెట్టేందుకు ప్రత్యేక ఆర్థిక పరిజ్ఞానం అవసరమని శనివారం జరిగిన 'సీఐఐ వార్షిక బిజినెస్ సదస్సు 2024'లో అన్నారు. ప్రస్తుతం ఎఫ్ అండ్ ఓల్లో పెట్టుబడులు పెడుతున్నవారిలో చాలా మందికి వాటిపై పూర్తి అవగాహన లేదన్నారు. ఆర్థిక ఉత్పత్తులు లేదా సేవలను సామాన్యులకు చేరువ చేసేందుకు తక్కువ ధర లేదా పరిమాణంలో అందుబాటులోకి తేవడాన్నే శాచెటైజేషన్ అంటారు. ఉదాహరణకు, గతంలో పెద్ద సైజు ప్యాకింగ్‌లో మాత్రమే అందుబాటులో ఉండే షాంపూ ప్రస్తుతం రూపాయి, రూ.2కు విక్రయించే చిన్న సైజు శాచెట్లలోనూ లభిస్తున్నాయి. తద్వారా కంపెనీలు షాంపూ అందుబాటును విస్తృతం చేయగలిగాయి. సీఐఐ సదస్సులో నాగేశ్వరన్ ఇంకా ఏమన్నారంటే..

- మిగతా దేశాల్లోనూ ఆర్థిక రంగ అభివృద్ధి జాతీయాభివృద్ధిని వి ంచిపోయిన కథలేవీ సుఖాంతమవలేదు. 1997-98 నాటి ఆసియా సంక్షోభమే చాలా ముఖ్య ఉదాహరణ.
- ప్రపంచంలో ఎఫ్ అండ్ ఓ ట్రేడింగ్ లావాదేవీలు అత్యధికంగా నమోదవుతున్నది భారత్‌లోనేనని గర్వపడుతున్నప్పటికీ, ఇది పురోగతా లేదా ఆందోళనకు సంకేతమా అని మనల్ని మనం ప్రశ్నించుకోవాల్సిన అవసరం ఉంది.
- గృహ పొదుపు ఉత్పాదక ప్రయోజనాల కోసం వినియోగించుకోగల రంగాల్లో క్యాపిటల్ మార్కెట్ వృద్ధి చెందేలా చూడాల్సిన బాధ్యత ఆర్థిక సేవల రంగంపై ఉంది.

ప్రభుత్వ డేటా ప్రకారం..

గత మూడేళ్లలో కుటుంబ పొదుపు రూ.9 లక్షల కోట్లు తగ్గి 2022-23 ఆర్థిక సంవత్సరం చివరినాటికి రూ.14.16 లక్షల కోట్ల స్థాయికి పడిపోయింది. కాగా, 2020-21లో రూ.64,084 కోట్ల స్థాయిలో నమోదైన మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడులు.. మూడేళ్లలో దాదాపు మూడింతలై 2022-23 నాటికి రూ.1.79 లక్షల కోట్లకు చేరుకున్నాయి. షేర్లు, డిబెంచర్లలోకి పెట్టుబడిగా వచ్చిన గృహ పొదుపు దాదాపు రెండింతలైంది. 2020-21లో రూ.1.07 లక్షల కోట్ల స్థాయిలో ఉండగా.. 2022-23 నాటికి రూ.2.06 లక్షల కోట్లకు పెరిగింది. ఎఫ్ అండ్ ఓ ట్రేడింగ్‌లో రిటైల్ మదుపరుల పెట్టుబడులు పెరుగుతుండటంపై ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సైతం ఈ మధ్యనే ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విభాగంలో రిటైల్ ట్రేడింగ్‌పై పర్యవేక్షణ లేకపోతే మార్కెట్‌తోపాటు ఇన్వెస్టర్ల సెంటిమెంట్, గృహ ఆర్థిక వ్యవస్థకూ భవిష్యత్‌లో సవాళ్లు ఏర్పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

'ఎఫ్ అండ్ ఓ'ల్లో పెట్టుబడులు పెడుతున్న వారిలో 90 శాతం మంది నష్టపోతున్నప్పటికీ ఈ విభాగ ట్రేడింగ్‌పై ఇన్వెస్టర్లలో ఆసక్తి పెరుగుతుండటం తనకు విస్మయం కలిగించిందని గత ఏడాది నవంబరులో సెబీ చైర్‌పర్సన్ మాధవి పురి బుచ్ అన్నారు. సెబీ అధ్యయన నివేదిక ప్రకారం.. ఎఫ్ అండ్ ఓ సెగ్మెంట్లో ట్రేడింగ్ చేపడుతున్న 45.24 లక్షల మంది వ్యక్తిగత ఇన్వెస్టర్లలో కేవలం 11 శాతం మందే లాభాలు ఆర్జించగలిగారు. కొవిడ్ సంక్షోభ సమయంలో ఎఫ్ అండ్ ఓ ట్రేడింగ్‌ను చేపట్టే రిటైల్ మదుపరుల సంఖ్య అసాధారణ స్థాయిలో పెరిగింది. 2018-19 ఆర్థిక సంవత్సరంలో 7.1 లక్షలుగా నమోదైన వీరి సంఖ్య ఏకంగా 500 శాతం పెరిగింది.

తగ్గిన విమ్టా ల్యాబ్స్ లాభం

హైదరాబాద్: గడచిన ఆర్థిక సంవత్సరం (2023-24) మార్చితో ముగిసిన త్రైమాసికంలో విమ్టా ల్యాబ్స్ రూ.80.2 కోట్ల కన్సాలిడేటెడ్ ఆదాయంపై రూ.12.4 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. అంతకు ముందు ఆర్థిక సంవత్సరం ఇదేకాలంతో పోల్చితే లాభం స్వల్పంగా 2.6 శాతం తగ్గింది. కాగా మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి గాను రూ.322.30 కోట్ల ఆదాయంపై రూ.41 కోట్ల నికర లాభాన్ని కంపెనీ నమోదు చేసింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఆదాయం రూ.321.60 కోట్లుగా ఉండగా లాభం రూ.48.2 కోట్లుగా ఉంది. 2023-24 ఆర్థిక సంవత్సరం ప్రథమార్థం తర్వాత చివరి త్రైమాసికంలో మంచి రికవరీని సాధించినట్లు విమ్టా ల్యాబ్స్ ఎండీ హరిత వాసిరెడ్డి తెలిపారు. గడిచిన ఆర్థిక సంవత్సరంలో అనుకోకుండా కొన్ని ఆటంకాలు ఎదురైనప్పటికీ 2024-25లో మంచి పనితీరును కనబరచవచ్చని అంచనా వేస్తున్నట్లు హరిత చెప్పారు.

దొడ్ల డెయిరీ లాభంలో 108% వృద్ధి

హైదరాబాద్: దొడ్ల డెయిరీ లిమిటెడ్.. గడచిన ఆర్థిక సంవత్సరం మార్చితో ముగిసిన త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలను ప్రకటించింది. జనవరి-మార్చి త్రైమాసికానికి గాను కంపెనీ రూ.787.40 కోట్ల ఆదాయంపై రూ.46.8 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. అంతకు ముందు ఆర్థిక సంవత్సరం (2022-23) ఇదే కాలంతో పోల్చితే ఆదాయం 8.7 శాతం (రూ.724.30 కోట్లు), లాభం ఏకంగా 107.9 శాతం (రూ.22.5 కోట్లు) పెరిగింది. కాగా మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి గాను కంపెనీ రూ.3,125.50 కోట్ల ఆదాయంపై రూ.166.70 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఆదాయం రూ.2,812 కోట్లుగా ఉండగా లాభం రూ.122.30 కోట్లుగా ఉంది. గడచిన ఆర్థిక సంవత్సరంలో విలువ ఆధారిత ఉత్పత్తుల విక్రయాలు (వీఏపీ) 16.3 శాతం వృద్ధి చెంది రూ.861.90 కోట్లుగా ఉన్నాయి.

2023-24లో కంపెనీ పాల సేకరణ, డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్‌ను విస్తరించటంతో పాటు వాల్యూ యాడెడ్ ఉత్పత్తుల (వీఏపీ)పై దృష్టి పెట్టడంతో ఆదాయం తొలిసారిగా రూ.3,000 కోట్ల మైలురాయిని అధిగమించిందని దొడ్ల డెయిరీ ఎండీ సునీల్ రెడ్డి తెలిపారు.

వడ్డీ మీద జీఎస్‌టీ చెల్లించాలా..?



రాంబాబు గొండాల

ఒక జిల్లా కేంద్రంలో మూర్తి ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ షోరూమ్‌ను నిర్వహిస్తున్నారు. ఇందులో వివిధ కంపెనీలకు సంబంధించిన ఏసీ, రిఫ్రిజిరేటర్లు, కూలర్లు సహా ఇతర గృహోపకరణాలను విక్రయిస్తుంటాడు. ఆయా వస్తువులను కంపెనీల నుంచి కొనుగోలు చేసే క్రమంలో సాధారణంగా నగదు చెల్లించి తీసుకుంటాడు. ఒక సందర్భంలో తన షోరూమ్‌ను విస్తరించాలని, దానికి ఎక్కువగా స్టాక్ కావాలని భావించి ఆయా కంపెనీలను సంప్రదించగా అరువు మీద ఎక్కువ స్టాక్ ఇవ్వటానికి ఒప్పుకున్నాయి. మూడు నెలల్లో ఆ మొత్తాన్ని వడ్డీతో చెల్లించాలని, గడువు దాటితే వడ్డీకి అదనంగా పెనాల్టీ చెల్లించే విధంగా ఒప్పందం కుదిరింది. మూర్తి కొంత మొత్తాన్ని మూడు నెలల్లో చెల్లించాడు. మిగతా దానిని తర్వాత చెల్లించాడు. అనుకున్న విధంగా నిర్ణీత సమయంలో చెల్లించిన మొత్తానికి వడ్డీ, తరువాత చెల్లించిన మొత్తానికి వడ్డీతో పాటుగా పెనాల్టీ చెల్లించాడు. కానీ, తాను చెల్లించిన వడ్డీ, పెనాల్టీల మీద జీఎస్‌టీ కూడా చెల్లించాలని ఆయా కంపెనీలు అడగటంతో మూర్తి అవాక్కయ్యాడు. ఎందుకంటే తాను కొనుగోలు చేసినప్పుడు ఆయా వస్తువుల మీద జీఎస్‌టీ చెల్లించాడు. ఇప్పుడు వడ్డీ, పెనాల్టీల మీద కూడా జీఎస్‌టీ చెల్లించటమనేది తనకు అదనపు భారంగా పరిణమిస్తుంది.

నిజానికి మూర్తి లాగానే, వడ్డీ, పెనాల్టీల మీద కూడా జీఎస్‌టీ వర్తిస్తుందని చాలా మందికి తెలియదు. ఏదేనీ సరఫరా జరిగినప్పుడు ఎంత విలువ మీద పన్ను చెల్లించాలనే దానికి జీఎస్‌టీ చట్టంలో కొన్ని నియమ నిబంధనలు ఉన్నాయి. దీని ప్రకారం ఆ సరఫరాకు సంబంధించిన ప్యాకింగ్, ట్రాన్స్‌పోర్టేషన్, కమీషన్ మొదలైనవి విలువలో కలిపి మొత్తం మీద పన్ను చెల్లించాలి. అలాగే జీఎస్‌టీ కాకుండా ఇతర పన్నులు, సెస్సులు కూడా విలువలో కలపాలి. ఆ సరఫరాకు సంబంధించిన వడ్డీ, పెనాల్టీ కూడా ఇదే కోవలోకి వస్తాయి. అంటే వడ్డీ, పెనాల్టీ కూడా సరఫరాదారుడు జీఎస్‌టీ వసూలు చేసి దానిని ప్రభుత్వానికి చెల్లించాలి. దీని మీద ఎంత శాతం జీఎస్‌టీ చెల్లించాలంటే, ఆ సరఫరా (అంటే వస్తువులు కావచ్చు లేదా సర్వీసులు కావచ్చు)కు ఎంత శాతం జీఎస్‌టీ వర్తిస్తుందో అంతే శాతం ఈ వడ్డీ, పెనాల్టీలకు కూడా వర్తిస్తుంది.

మరి అన్ని రకాల వడ్డీలకు జీఎస్‌టీ వర్తిస్తుందా అంటే లేదనే చెప్పాలి. పన్ను పరిధిలోకి వచ్చే సరఫరాలు జరిగినప్పుడే ఇది వర్తిస్తుంది. అంటే, బ్యాంకులకు సంబంధించిన రుణాలు, డిపాజిట్లు బయటి వ్యక్తులకు ఇచ్చే అప్పులకు సంబంధించిన వడ్డీ మీద ఈ జీఎస్‌టీ వర్తించదు. అయితే, క్రెడిట్ కార్డు సంస్థలు వసూలు చేసే వడ్డీ మీద మాత్రం జీఎస్‌టీ వర్తిస్తుంది. ఈ రోజుల్లో చాలా వ్యాపారాలు అప్పు ఆధారంగానే నడుస్తుంటాయి. పెద్ద పట్టణాలను వినహాయిస్తే ఇప్పటికీ మండల కేంద్రాల్లో ఉండే దుకాణాలు అరువు మీద వస్తువులను అమ్మటం, కొనుగోలు చేయటం చేస్తుంటాయి. కాబట్టి వ్యాపారస్తులు ఈ విషయాలను దృష్టిలో పెట్టుకోవాలి.

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.

బ్యాంకింగ్ దిగ్గజం వాఘుల్ కన్నుమూత



ముంబై: బ్యాంకింగ్ రంగ దిగ్గజం, ఐసీఐసీఐ బ్యాంక్ మాజీ చైర్మన్ నారాయణన్ వాఘుల్ ఇకలేరు. 88 ఏళ్ల ఎన్ వాఘుల్ శనివారం మధ్యాహ్నం చెన్నైలోని అపోలో హాస్పిటల్‌లో తుది శ్వాస విడిచారు. ఇంట్లో జారి పడటంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిన ఆయనను రెండ్రోజుల క్రితమే ఆసుపత్రిలో చేర్చారు. ఆయనకు భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. ఇద్దరు సంతానం విదేశాల్లో స్థిరపడ్డారు. ఆయన అంత్యక్రియలు ఆదివారం చెన్నైలో జరగనున్నాయి. ఆయన మృతిపట్ల కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ సహా బ్యాంకింగ్, కార్పొరేట్ రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు సంతాపం తెలియజేశారు.

బ్యాంకింగ్ రంగానికి అందించిన విశేష సేవలకు గాను కేంద్ర ప్రభుత్వం వాఘుల్‌ను 2010లో మూడో అత్యున్నత పౌర పురస్కారం 'పద్మ భూషణ్'తో సత్కరించింది. దేశీయ బ్యాంకింగ్ పరిశ్రమలో వాఘుల్ పలు నాయకత్వ పదవులను చేపట్టారు. ఐసీఐసీఐకి 1985 నుంచి 11 ఏళ్లపాటు చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ)గా వ్యవహరించారు. ఐసీఐసీఐని పబ్లిక్ ఫైనాన్స్ కంపెనీ నుంచి యూనివర్సల్ ప్రైవేట్ బ్యాంక్‌గా తీర్చిదిద్దిన ఘనత ఆయనదే.

మద్రాస్ యూనివర్సిటీ నుంచి గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వాఘుల్.. 1960 దశకంలో ఎస్‌బీఐలో ఆఫీసర్‌గా తన ఉద్యోగ ప్రస్థానాన్ని ప్రారంభించారు. ఎస్‌బీఐలో ఉద్యోగం వీడి పుణెకు చెందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ మేనేజ్‌మెంట్‌లో పాఠాలు చెప్పే కొలువులో చేరారు. అనతికాలంలోనే ఆ సంస్థలో డైరెక్టర్‌గా ఎదిగారు. ఆ తర్వాత సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా తిరిగి బ్యాంకింగ్ రంగంలోకి పునఃప్రవేశం చేశారు. 1981లో బ్యాంక్ ఆఫ్ ఇండియా సీఎండీగా నియమితులయ్యారు. అప్పుడు ఆయనకు 44 ఏళ్లు. అంత చిన్న వయసులో ప్రభుత్వ రంగ బ్యాంక్ పగ్గాలు చేపట్టిన ఘనత కూడా వాఘుల్‌దే. ఆ తర్వాత ఐసీఐసీఐ సీఎండీగా బాధ్యతలు చేపట్టారు.



ఆఖరాట ఆడేశాడా?

మహీ ముద్ర ఎల్లవేళలా

పొట్టి క్రికెట్‌కు ఐపీఎల్ కేరాఫ్ అయితే..ఆ ఐపీఎల్‌కు వన్నె తెచ్చిన క్రికెటర్ మహేంద్ర సింగ్ ధోనీ. అధికారికంగా ప్రకటించకపోయినా మహీకి ఇదే చివరి ఐపీఎల్ అని భావిస్తున్నారు. 42 ఏళ్ల వయస్సులో..అందునా..టీ20 క్రికెట్‌లో కొనసాగడమంటే ఆషామాషీ కాదు. కానీ అటు కీపింగ్ ఇటు బ్యాటింగ్‌లోనూ ఏమాత్రం సత్తా తగ్గలేదు మహీకి. ఈ ఐపీఎల్‌లో యువ కీపర్లను మించి క్యాచ్‌లు అందుకోవడం, బ్యాటింగ్‌లో చివరన వచ్చి అలవోకగా సిక్సర్లు, ఫోర్లు కొట్టిన ధోనీని చూశాం. మరి అలాంటి ఆటగాడు ఐపీఎల్‌కు పర్యాయపదంగా మారడం అతిశయోక్తి కాదు. దేశంలో ఏ వేదికలో చెన్నై బరిలో దిగినా..స్టేడియం యావత్తు పుసుపుమయం అయిందంటే అది చెన్నై జట్టుకున్న క్రేజ్ కంటే.. మహీ మానియానే కారణమని వేరే చెప్పక్కర్లేదు. ఐపీఎల్ ఆవిర్భావం నుంచి (మధ్యలో సీఎస్‌కేపై నిషేధం విధించిన రెండేళ్లు మినహా.) లీగ్‌పై ఆటగాడిగా, సీఎస్‌కే కెప్టెన్‌గా తనదైన ముద్ర వేశాడు ధోనీ. ఈక్రమంలో చెన్నై సూపర్ కింగ్స్ రికార్డు స్థాయిలో ఐదు టైటిళ్లు అందించడం ఆటగాడిగా మహీ అందుకొన్న ఘనత. అందుకే..తమిళ తంబిలకు ధోనీ అంటే క్రేజ్..కాదు ప్రాణం. అలాంటి తమ ఆరాధ్య క్రికెటర్‌కు ఇదే చివరి ఐపీఎల్ అంటే డై హార్డ్ ఫ్యాన్స్ జీర్ణించుకోవడం కష్టమే. కానీ ఏ క్రికెటరైన ఏదో ఒక సమయంలో రిటైర్ కావాల్సిందే. ఇప్పుడు మహీకి ఆ సమయం వచ్చేసినట్టే. వయస్సు కూడా పైబడుతోంది. ఏడాది మొత్తం పోటీ క్రికెట్ ఆడుతూ ఫిట్‌నెస్ కాపాడుకోవడం వేరు. కానీ సంవత్సరంలో రెండు నెలలు జరిగే టోర్నీకోసం ఫిట్‌గా ఉండడం మాటలు కాదు. కానీ నాలుగు పదులు పైబడినా మైదానంలో అంత చురుగ్గా కదులుతున్నాడంటే అది ధోనీకే చెల్లు. కానీ ఎల్లప్పుడూ అలా ఉండడం సాధ్యం కాదు కదా. గత ఏడాది మోకాలి గాయంతోనే ఐపీఎల్ ఆడడమేకాదు జట్టును చాంపియన్‌గానూ నిలిపాడు ధోనీ. ఆ గాయం పూర్తిగా మానలేదని, ఈసారీ అది మహీని బాధిస్తోందట. దీంతో అతడికిదే చివరి ఐపీఎల్ అని విశ్వసనీయ సమాచారం. రిటైరైనంత మాత్రాన ధోనీ చెన్నై జట్టును వీడకపోవచ్చు. కెప్టెన్ రుతురాజ్‌కు మార్గదర్శనం చేస్తూ, యువ ఆటగాళ్లను తీర్చిదిద్దుతూ ఐపీఎల్‌లో సీఎస్‌కేను తిరుగులేని జట్టుగా కొనసాగించడంలో తన ముద్రను అతడు సుదీర్ఘ కాలం కొనసాగించడం ఖాయం.

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

తుది పోరుకు సాత్విక్ జోడీ



బ్యాంకాక్: భారత టాప్ డబుల్స్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ షెట్టి థాయ్‌లాండ్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ ఫైనల్‌కు చేరుకొన్నారు. శనివారం జరిగిన సెమీస్‌లో సాత్విక్-చిరాగ్ జంట 21-11, 21-12తో చైనీస్ తైపీకి చెందిన లు మింగ్ చె-టాంగ్ కై విపై వరుస గేముల్లో అలవోకగా నెగ్గింది. ఆదివారం జరిగే టైటిల్ ఫైట్‌లో చైనా జోడీ చెన్ బొ యంగ్-లు యితో సాత్విక్ ద్వయం అమీతుమీ తేల్చుకోనుంది. 35 నిమిషాలపాటు సాగిన మ్యాచ్‌లో భారత జంట పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది.

నిఖత్ పసిడి పంచ్

ఎలోర్డా కప్ బాక్సింగ్



అస్థానా (కజకిస్థాన్): వరల్డ్ చాంపియన్ నిఖత్ జరీన్ ఎలోర్డా కప్ బాక్సింగ్ టోర్నమెంట్‌లో స్వర్ణ పతకం కొల్లగొట్టింది. ఆమెతోపాటు మీనాక్షి కూడా పసిడి పతకంతో మెరిసింది. శనివారం ముగిసిన ఈ టోర్నీలో భారత్ రికార్డు స్థాయిలో 12 పతకాలు సాధించింది. జరీన్, మీనాక్షిగాక ఇద్దరు భారత బాక్సర్లు రజతాలు, ఎనిమిదిమంది కాంస్య పతకాలు గెలుపొందారు. గత ఏడాది ఇక్కడ మన బాక్సర్లు కేవలం ఐదు పతకాలే నెగ్గడం గమనార్హం. 52 కేజీల విభాగం ఫైనల్లో నిఖత్ 5-0తో ఝజీరా ఉరబయేవా (కజకిస్థాన్)ను చిత్తు చేసి టైటిల్ అందుకుంది. ఇక 46 కిలోల తుది పోరులో మీనాక్షి 4-1తో ఉజ్బెక్ బాక్సర్ రహమొనోవా సిదాహోన్‌పై గెలుపొంది విజేతగా నిలిచింది. అనామిక (50కి.), మనీషా (60కి.) టైటిల్ ఫైట్‌లో ఓటమితో రజత పతకానికి పరిమితమయ్యారు.

చెన్నై ఇంటికి బెంగళూరు ముందుకు

ప్లేఆఫ్స్‌కు డుప్లెసి సేన • 27 పరుగులతో విజయం



విజయానందంలో సిరాజ్, డుప్లెసి, కోహ్లీ

బెంగళూరు: అసాధ్యాన్ని సుసాధ్యం చేస్తూ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ప్లేఆఫ్స్‌లో ప్రవేశించింది. వరుసగా ఆరు పరాజయాలతో ఇక ఇంటికే అనుకున్న ఈ జట్టు ఆ తర్వాత పోరాడితే పోయేదేమీ లేదనే తరహాలో చెలరేగింది. ఓటములను దిగమింగుతూ.. ఉత్కంఠభరిత పోరులో వరుసగా ఆరో విజయంతో వహ్వా అనిపించుకుంది. ఇక చెన్నై అర్హత సాధించేందుకు ఆఖరి ఓవర్‌లో 17 పరుగులే కావాల్సి ఉన్నా.. పేసర్ యష్ దయాల్ పొదుపైన బౌలింగ్‌కు చిత్తయ్యింది. దీంతో 27 పరుగులతో గెలిచిన డుప్లెసి సేన అంబరాన్నంటే సంబరాల్లో మునిగింది. చివరి ఐదు సీజన్లలో వీరికిది నాలుగో ప్లేఆఫ్స్. ఒకవేళ ఓటమి తేడా 18 రన్స్‌లోపే ఉంటే చెన్నై ముందుకెళ్లేది. శనివారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా బెంగళూరు 20 ఓవర్లలో 5 వికెట్లకు 218 పరుగులు చేసింది. డుప్లెసి (39 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్సర్లతో 54), కోహ్లీ (29 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్సర్లతో 47), రజత్ పటీదార్ (23 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్సర్లతో 41), గ్రీన్ (17 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్సర్లతో 38 నాటౌట్) వేగం కనబర్చారు. శార్దూల్‌కు రెండు వికెట్లు దక్కాయి. ఛేదనలో చెన్నై 20 ఓవర్లలో 7 వికెట్లకు 191 పరుగులు చేసి ఓడింది. రచిన్ (37 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్సర్లతో 61), జడేజా (22 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్సర్లతో 42 నాటౌట్), రహానె (22 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్‌తో 33), ధోనీ (13 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్‌తో 25)ల పోరాటం సరిపోలేదు. యష్ దయాల్‌కు రెండు వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా డుప్లెసి నిలిచాడు.

ఒత్తిడికి తలొగ్గి..: ఛేదనలో చెన్నై ఆరంభమే సరిగా లేదు. ఇన్నింగ్స్ తొలి బంతికే కెప్టెన్ రుతురాజ్‌ను మాక్స్‌వెల్ డకౌట్ చేయగా.. డారిల్ మిచెల్ (4)ను మూడో ఓవర్‌లో దయాల్ అవుట్ చేశాడు. ఈ దశలో ఓపెనర్ రచిన్, రహానె సమన్వయ ఆటతీరుతో ఆదుకునే ప్రయత్నం చేశారు. ఇద్దరూ రిస్కీ షాట్లకు వెళ్లకుండా పరుగులు రాబట్టారు. ఆరో ఓవర్‌లో రచిన్ ఫోర్, రహానె రెండు ఫోర్లతో 15 పరుగులు వచ్చాయి. అయితే చక్కగా కుదురుకున్న ఈ జోడీని పదో ఓవర్‌లో ఫెర్గూసన్ విడదీశాడు. రహానె వికెట్ కోల్పోవడంతో మూడో వికెట్‌కు 66 పరుగుల కీలక భాగస్వామ్యం ముగిసింది. ఆ తర్వాత ఆర్‌సీబీ బౌలర్లు రన్స్‌ను కట్టడి చేయడంతో చెన్నై ఆట గతి తప్పింది. అయితే రచిన్ ధాటిని కనబరుస్తూ 12వ ఓవర్‌లో 4,6,6తో 19 రన్స్ రాబట్టడమే కాకుండా 30 బంతుల్లో తొలి ఫిఫ్టీని సాధించాడు. కానీ 13వ ఓవర్‌లో అతడు రనౌట్ కావడంతో గట్టి దెబ్బ పడింది. అటు శివమ్ దూబే (7) క్యాచ్ అవుట్ కావడంతో 119/5 స్కోరుతో పీకల్లోతు కష్టాల్లో పడింది. ఆ వెంటనే శాంట్నర్ (3) క్యాచ్‌ను డుప్లెసి ఒంటి చేత్తో డైవ్ చేసి పట్టేశాడు. జడేజాకు జతగా 16వ ఓవర్‌లో ధోనీ క్రీజులోకి రావడంతో చెన్నై ఆశలు పెట్టుకుంది. అప్పటికి క్వాలిఫై అయ్యేందుకు 30 బంతుల్లో 72 రన్స్ కావాల్సింది. ఇద్దరూ వికెట్ కాపాడుకుంటూ అడపాదడపా బౌండరీలతో విజయానికి చేరువగా తెచ్చారు. క్వాలిఫైకి ఆఖరి ఓవర్‌లో 17 రన్స్ అవసరమవగా, ధోనీ తొలి బంతికి సిక్సర్‌తో జోష్ తెచ్చాడు. కానీ రెండో బంతికే తను అవుట్ కావడంతో పాటు పేసర్ దయాల్ 7 పరుగులే ఇవ్వడంతో చెన్నై కథ ముగిసింది.

చివర్లో దూకుడు: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన బెంగళూరు ఇన్నింగ్స్‌లో క్రీజులోకి వచ్చిన ప్రతీ బ్యాటర్ మెరుగ్గానే ఆడాడు. మధ్య ఓవర్లలో కాస్త వెనుకంజలో నిలిచినా.. ఆఖర్లో రజత్ పటీదార్-గ్రీన్ జోరుతో 200 స్కోరు దాటేసింది. అంతకుముందు ఓపెనర్లు కోహ్లీ, డుప్లెసి బౌండరీల జోరుకు తొలి మూడు ఓవర్లలోనే ఆర్‌సీబీ 30 పరుగులు సాధించింది. అయితే ఆ తర్వాత కురిసిన వర్షంతో 40 నిమిషాలపాటు ఆటకు అంతరాయం కలిగింది. అనంతరం పిచ్ మందకొడిగా మారడంతో ఆర్‌సీబీ కాస్త ఇబ్బందిపడింది. స్పిన్నర్ల ఓవర్లలో బౌండరీలు తగ్గిపోయాయి. ఈ దశలో ఒత్తిడికి లోనైన కోహ్లీ భారీ షాట్ ఆడేందుకు చూసి పదో ఓవర్‌లో శాంట్నర్‌కు దొరికిపోయాడు. దీంతో తొలి వికెట్‌కు 78 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. మరోవైపు డుప్లెసి ఎదురుదాడికి దిగి 11వ ఓవర్‌లో రెండు వరుస సిక్సర్లతో 20 పరుగులు రాబట్టాడు. 35 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేసిన అతను 13వ ఓవర్‌లో అనూహ్యంగా రనౌటయ్యాడు. పటీదార్ ఆడిన షాట్ నేరుగా బౌలర్ శాంట్నర్ చేతిని తాకి నాన్‌స్ట్రయిక్ ఎండ్ వికెట్లను పడగొట్టింది. అప్పటికి డుప్లెసి బ్యాట్ గాల్లోనే ఉండడంతో నిరాశతో వెనుదిరిగాడు. ఈ స్థితిలో గ్రీన్, రజత్ పోటాపోటీ బౌండరీలతో స్కోరును గాడినపెట్టారు. డెత్ ఓవర్లలో వీరు మరింత జోరు చూపడంతో చెన్నై బౌలర్లు ధారాళంగా పరుగులిచ్చుకున్నారు. 18వ ఓవర్‌లో గ్రీన్ రెండు సిక్సర్లు బాదగా పటీదార్‌ను శార్దూల్ అవుట్ చేశాడు. దీంతో మూడో వికెట్‌కు 71 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. దినేశ్ కార్తీక్ (14) ఆరు బంతులే ఆడినా 6,4తో వేగం చూపాడు. ఇక చివరి ఓవర్‌లో 6,4తో ఆకట్టుకున్న మ్యాక్స్‌వెల్ (16) క్యాచ్ అవుటయ్యాడు. ఓవరాల్‌గా ఆఖరి ఐదు ఓవర్లలోనే బెంగళూరు 80 పరుగులు చేయడం విశేషం.

1 ఐపీఎల్‌లో రెండుసార్లు 700+ రన్స్ సాధించిన ఆటగాడిగా గేల్‌తో సమంగా నిలిచిన కోహ్లీ. అలాగే తాజా సీజన్‌లో ఎక్కువ సిక్సర్లు (37) బాదిన ఆటగాడిగానూ నిలిచాడు.


నేటి మ్యాచ్‌లు

మ్యాచ్	సమయం / వేదిక
సన్‌రైజర్స్ x పంజాబ్	మ.3.30 వేదిక హైదరాబాద్
రాజస్థాన్ x కోల్‌కతా	రాత్రి 7.30 వేదిక గువాహటి

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
కోల్‌కతా	13	9	3	1	19	1.428
రాజస్థాన్	13	8	5	0	16	0.273
హైదరాబాద్	13	7	5	1	15	0.406
బెంగళూరు	14	7	7	0	14	0.459
చెన్నై	14	7	7	0	14	0.392
ఢిల్లీ	14	7	7	0	14	-0.377
లఖ్‌నవూ	14	7	7	0	14	-0.667
గుజరాత్	14	5	7	2	12	-1.063
పంజాబ్	13	5	8	0	10	-0.347
ముంబై	14	4	10	0	8	-0.318

హార్దిక్‌పై మ్యాచ్ నిషేధం



ముంబై: స్లో ఓవర్ రేట్ కారణంగా ముంబై ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యాపై ఓ మ్యాచ్ నిషేధం, రూ.30 లక్షల జరిమానా విధించారు. జట్టు ఆటగాళ్లపైనా తలో రూ.12 లక్షలు లేదా మ్యాచ్ ఫీజులో 50 శాతం కోత (ఏది తక్కువైతే అది) విధించారు. సీజన్‌లో ముంబై జట్టు మూడుసార్లు ఈ తప్పిదానికి పాల్పడడంతో ఐపీఎల్ అడ్వయిజరీ కమిటీ ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. దీంతో వచ్చే సీజన్‌లో ముంబై ఆడే తొలి మ్యాచ్‌కు హార్దిక్ అందుబాటులో ఉండడు.

స్కోరుబోర్డు

బెంగళూరు: కోహ్లీ (సి) మిచెల్ (బి) శాంట్నర్ 47, డుప్లెసి (రనౌట్) 54, పటీదార్ (సి) మిచెల్ (బి) శార్దూల్ 41, గ్రీన్ (నాటౌట్) 38, కార్తీక్ (సి) ధోనీ (బి) దేశ్‌పాండే 14, మ్యాక్స్‌వెల్ (సి) ధోనీ (బి) శార్దూల్ 16, లోమ్రోర్ (నాటౌట్) 0, **ఎక్స్‌ట్రాలు: 8; మొత్తం: 20 ఓవర్లలో 218/5; వికెట్ల పతనం:** 1-78, 2-113, 3-184, 4-201, 5-218; **బౌలింగ్:** తుషార్ దేశ్‌పాండే 4-0-49-1, శార్దూల్ 4-0-61-2, తీక్షణ 4-0-25-0, శాంట్నర్ 4-0-23-1, జడేజా 3-0-40-0, సిమర్‌జీత్ 1-0-19-0.

చెన్నై: రుతురాజ్ (సి) యశ్ (బి) మ్యాక్స్‌వెల్ 0, రచిన్ (రనౌట్) 61, మిచెల్ (సి) కోహ్లీ (బి) యశ్ 4, రహానె (సి) డుప్లెసి (బి) ఫెర్గూసన్ 33, శివమ్ దూబే (సి) ఫెర్గూసన్ (బి) గ్రీన్ 7, జడేజా (నాటౌట్) 42, శాంట్నర్ (సి) డుప్లెసి (బి) సిరాజ్ 3, ధోనీ (సి) స్వప్నిల్ (బి) యశ్ 25, శార్దూల్ (నాటౌట్) 1, **ఎక్స్‌ట్రాలు: 15; మొత్తం: 20 ఓవర్లలో 191/7; వికెట్ల పతనం:** 1-0, 2-19, 3-85, 4-115, 5-119, 6-129, 7-190; **బౌలింగ్:** మ్యాక్స్‌వెల్ 4-0-25-1, సిరాజ్ 4-0-35-1, యశ్ దయాల్ 4-0-42-2, స్వప్నిల్ 2-0-13-0, కర్ణ్ శర్మ 1-0-14-0, ఫెర్గూసన్ 3-0-39-1, గ్రీన్ 2-0-18-1.

4 గంటలు ఆలస్యంగా జగన్ లండన్‌కు

- ల్యాండింగ్‌కు అనుమతి లేక తొలుత ఆమ్‌స్టర్‌డ్యామ్‌కు
- తర్వాత లండన్‌కు చేరుకున్న విమానం

అమరావతి, మే 18 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి జగన్ తన కుటుంబ సభ్యులతో కలసి బయలుదేరిన ప్రత్యేక విమానం నాలుగు గంటలు ఆలస్యంగా లండన్ విమానాశ్రయంలో దిగింది. శుక్రవారం రాత్రి 11 గంటలకు గన్నవరం విమానాశ్రయం నుంచి జగన్ కుటుంబ సభ్యులు బయలుదేరిన విమానం శనివారం ఉదయం 10.30 గంటలకు లండన్‌లోని లూటాన్ విమానాశ్రయంలో ల్యాండ్ కావాల్సి ఉంది. అయితే ఎయిర్‌ట్రాఫిక్ కారణంగా ల్యాండింగ్‌కు అనుమతి లభించలేదు. దీంతో 47 నిమిషాలు విమానం గాల్లో చక్కర్లు కొట్టి.. తర్వాత నెదర్లాండ్స్‌లోని ఆమ్‌స్టర్‌డ్యామ్‌లో దిగింది. మధ్యాహ్నం 1:30 గంటల వరకు జగన్ కుటుంబ సభ్యులు అక్కడే ఉన్నారు. ఆ తర్వాత ల్యాండింగ్‌కు అనుమతి రావడంతో మళ్లీ లండన్ బయల్దేరారు. మధ్యాహ్నం 2.30 గంటలకు లూటాన్ విమానాశ్రయంలో విమానం ల్యాండ్ అయింది. జగన్ కుటుంబం లండన్‌కు వెళ్లేందుకు కొలంబో నుంచి గురువారం విస్టా జెట్ కంపెనీకి చెందిన బొంబార్డియర్ 7500 విమానాన్ని గన్నవరం విమానాశ్రయానికి రప్పించిన సంగతి తెలిసిందే. ఈ నెల 31వ తేదీన జగన్ తిరిగి తాడేపల్లికి రానున్నారు.

ఓటర్ల తప్పిదంలేని పోస్టల్ బ్యాలెట్లను ఆమోదించండి

- ఈసీకి తెలుగుదేశం పార్టీ విజ్ఞప్తి

అమరావతి, మే 18(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్ర వ్యాప్తంగా ఓటర్ల తప్పిదంలేని పోస్టల్ బ్యాలెట్లను కౌంటింగ్‌కి పరిగణలోకి తీసుకోవాలి. ఆ మేరకు ఆదేశాలు ఇవ్వాలి' అని ఎన్నికల సంఘాన్ని టీడీపీ కోరింది. శనివారం ఈ మేరకు అమరావతి సచివాలయంలో టీడీపీ ఎమ్మెల్సీ అశోక్‌బాబు, మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ, మీడియా సమన్వయకర్త దారపనేని నరేంద్ర రాష్ట్ర అదనపు ఎన్నికల ప్రధానాధికారి కోటేశ్వరరావుకి వినతిపత్రం అందజేశారు. 'పోస్టల్ బ్యాలెట్ల కోసం ఎన్నికల విధులకు హాజరైన ఉద్యోగులందరూ ఫారం 12 దాఖలు చేసే సమయంలో ఒక డిక్లరేషన్ ఇవ్వవలసి ఉంది. దానిని ఒక గెజిటెడ్ ఆఫీసర్ ధృవీకరించాలి. అయితే కొన్ని చోట్ల గెజిటెడ్ ఆఫీసర్లు స్టాంపు వేయలేదు. అలాగే మరికొన్ని చోట్ల పీవోలు బ్యాలెట్ పేపర్ వెనుక వారి సంతకం కానీ, ముద్రకానీ వేయలేదు. ఇలా ఓటర్ల ప్రమేయం లేకపోయినా జరిగిన తప్పిదాలతో అవి చెల్లకుండా పోయే ప్రమాదం ఉంది. ఈ అంశాన్ని సానుకూలంగా పరిశీలించి ఓటర్ల ప్రమేయం లేకుండా పొరపాటు జరిగిన పోస్టల్ బ్యాలెట్లను లెక్కింపునకు పరిగణలోకి తీసుకోవాలని గతంలోనే మేం రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారిని కోరాం. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారు. ఎన్నికలు ముగిసి ఓట్ల లెక్కింపు సమయం దగ్గర పడుతున్నా ఇప్పటి వరకు ఎలాంటి స్పష్టమైన ఆదేశాలు రాలేదు. వెంటనే రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా వీటిపైన కింది స్థాయి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలి' అని వారు కోరారు.

ఓటమి భయంతోనే రక్తపాతం : వర్ల రామయ్య

అమరావతి, మే 18(ఆంధ్రజ్యోతి): 'ఓటమి భయంతో రాష్ట్రంలో రక్తపాతం సృష్టించి గెలవాలని వైసీపీ నేతలు ప్రయత్నించారు. ఈ విధ్వంసానికి పాల్పడిన వైసీపీ నేతలను వెంటనే అరెస్టు చేయాలి' అని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వర్ల రామయ్య డిమాండ్ చేశారు. శనివారం టీడీపీ ప్రధాన కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాచర్లలో పోలింగ్ సందర్భంలో అరాచకం సృష్టించి రక్తపాతానికి శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే పిన్నెల్లి, అతని తమ్ముడు వెంకట్రామిరెడ్డిని, టీడీపీ నేత నానిపై హత్యాయత్నానికి కారకుడైన చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, అతని కుమారుడు మోహిత్‌రెడ్డిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

ఓటుకు నోటు అందిందా..!

- పశ్చిమగోదావరి జిల్లాలో వైసీపీ ఆరా

యలమంచిలి, మే 18: ఎన్నికల సమయంలో డబ్బుల పంపిణీ సరిగా జరిగిందా? లేదా? అని తెలుసుకునేందుకు పశ్చిమ గోదావరి జిల్లా మండల కేంద్రమైన యలమంచిలిలో శనివారం 20 మంది సభ్యుల బృందం పర్యటించింది. బృంద సభ్యులు పలు ఇళ్లకు వెళ్లి 'అమ్మా... మీ కుటుంబంలోని ఓట్లకు సొమ్ములు అందాయా? ఎన్ని ఓట్లు ఉన్నాయి? ఎంత ఇచ్చారు?' అని ఆరా తీశారు. ఎన్నికలైన తర్వాత ఇలాంటి విచారణ జరగడం తాము గతంలో ఎన్నడూ చూడలేదని గ్రామస్తులు చెబుతున్నారు.

జగన్ ఓ సోషియోపాత్ : నాగబాబు

అమరావతి, మే 18(ఆంధ్రజ్యోతి): 'జగన్‌కు ఈ మధ్యన డొనాల్డ్ ట్రంప్ మానసిక లక్షణాలు వచ్చాయి. ఆయనో సోషియోపాత్' అని జనసేన ప్రధాన కార్యదర్శి నాగబాబు మండిపడ్డారు. "కొద్ది సంవత్సరాల క్రితం అమెరికా అధ్యక్ష ఎన్నికలు జరిగాయి. ట్రంప్ కూడా అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ఓడిపోతున్నాను అని తెలిశాక.. 'నేను గెలుస్తున్నాను. గతం కంటే గట్టిగా ఓట్లు వచ్చాయి' అంటూ ప్రచారం మొదలుపెట్టాడు. ఓడిపోయాడు అని ఫలితాలు వచ్చాక కూడా నానా యాగీ చేసి కుర్చీ వదలను అని భీష్మించుకుని కూర్చున్నాడు. జగన్ కూడా అలాగే తయారవుతున్నారు. అందుకే వచ్చే నెల 15వ తేదీ వరకూ కేంద్ర బలగాను మోహరించాలని చెప్పింది. మనవంతుగా కౌంటింగ్ కేంద్రాల దగ్గర, పార్టీ కార్యాలయాల దగ్గర కూటమి శ్రేణులు అప్రమత్తంగా ఉండాలి. పోలింగ్‌తోనే ఎలక్షనీరింగ్ పూర్తి కాలేదు. కౌంటింగ్ కూడా ఉంది. ఓటమి కళ్ల ముందు కనిపించడంతో వైసీపీ అసుర గణం ఎంతటి అరాచకానికి ఒడిగడుతుందో చూశాం.' అని అన్నారు .

మతం పేరుతో రాజకీయాలు చేస్తున్న ప్రధాని: రామకృష్ణ

రాజమహేంద్రవరం అర్బన్, మే 18: మతం పేరుతో ప్రధాని మోదీ రాజకీయాలు చేస్తున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ఓడిపోతున్నామని తెలిసే ప్రధాని తన స్థాయిని దిగజార్చుకుని చవకబారు విమర్శలు చేస్తున్నారన్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్, జగన్మోహనరెడ్డిలకు మోదీపై ప్రేమలేదని, ఆయనపై భయం ఉందన్నారు. దీనికి ప్రధాన ఉదాహరణ డిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ జైలు ఉదంతమేనని అన్నారు.

స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద పటిష్ఠ భద్రత

- అనధికార వ్యక్తులను అనుమతించకండి: మీనా
- కలెక్టర్, సీపీలతో కలసి ఈవీఎంలు భద్రపరచిన గదులు పరిశీలన


మహారాణిపేట (విశాఖపట్నం), మే 18: స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పటిష్ఠ భద్రతా చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేష్ కుమార్ మీనా ఆదేశించారు. అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా జాగ్రత్త వహించాలని అధికారులకు సూచించారు. ఆయన శనివారం ఏయూ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్ (ఈవీఎంలను భద్రపరచిన గదులు)లను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎ.మల్లికార్జున, పోలీస్ కమిషనర్ ఎ.రవిశంకర్ అయ్యన్నార్‌తో కలసి పరిశీలించారు. విశాఖ పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన స్ట్రాంగ్ రూమ్‌లను ఆయన తనిఖీ చేశారు. తలుపులకు వేసిన సీళ్లను సునిశితంగా పరిశీలించారు. అక్కడ పరిస్థితులను గమనించారు. అన్నిచోట్ల సీసీ కెమెరాలు ఉన్నాయా? లేదా? అన్ని జాగ్రత్తలు తీసుకున్నారా? లేదా అని అడిగి తెలుసుకున్నారు. తనిఖీ అనంతరం అక్కడ ఉన్న లాగ్‌బుక్‌లో సంతకం చేశారు. స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద మూడంచెల భద్రతను పాటించాలని, అక్కడ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్‌కు సూచించారు. అనధికార వ్యక్తులను స్ట్రాంగ్‌రూమ్‌లు ఉన్న ప్రాంతాల్లోకి ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించరాదని స్పష్టం చేశారు. ఎలక్షన్ కమిషన్ నిబంధనల ప్రకారం అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ పర్యటనలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, నియోజకవర్గాల ఆర్వోలు ఇతర అధికారులు ఉన్నారు.



ఏయూలోని స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న సీఈఓ ముఖేష్ కుమార్ మీనా. చిత్రంలో కలెక్టర్ మల్లికార్జున

గిట్టకపోతే వేటేయడమే!

- ఎన్నికల హింసపై చర్యల్లో ఆశ్రిత పక్షపాతం
- అస్మదీయులకు రక్షణ కవచంలా సీఎస్ తీరు
- ఎన్నికల అనంతరం హింస ఘటనల్లో తేటతెల్లం
- పల్నాడు కలెక్టర్ శివకుమార్ బదిలీకి సిఫారసు
- తిరుపతి, అనంత కలెక్టర్లను కదిలించని సర్కారు
- బాధ్యులపై చర్యల్లో పారదర్శకత లేదని విమర్శలు



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

వ్యక్తులను బట్టి రూల్స్ మారిపోతుంటాయి. అతను మనవాడైతే సమర్థించడానికి ఒక రూల్ ఉంటుంది. అదే తస్మదీయుడు అయితే వ్యతిరేకించడానికి మరో రూల్ ఉంటుంది. ప్రస్తుతం రాష్ట్రంలో అదే రూల్ ఆఫ్ లా అమలవుతోంది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్. జవహర్‌రెడ్డి పర్యవేక్షణలో సొంతవారికి పిలిచి పెద్దపీట వేస్తున్నారు. వారు తప్పుచేసినా చూసీచూడనట్లు వదిలేస్తూ మేం ఉన్నామనే భరోసా ఇస్తున్నారు. తస్మదీయులైతే చాలు.. కారణం లేకపోయినా వేటు వేస్తున్నారు. సంబంధం లేని కారణాలు చూపి బదిలీ, సస్పెండ్ చేస్తున్నారు. ఇటీవల జరిగిన జిల్లా కలెక్టర్లు, ఎస్పీల బదిలీలు, సస్పెన్షన్లే దీనికి ప్రత్యక్ష నిదర్శనం. రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ అనంతరం తిరుపతి, అనంతపురం, పల్నాడు, నంద్యాల జిల్లాలో హింస చెలరేగింది. దాడులు, ప్రతిదాడుల నుంచి హత్యాయత్నాల వరకు తెగబడ్డారు. ఈ పరిణామాలపై పల్నాడు ఎస్పీ బిందు మాధవ్, అనంతపురం ఎస్పీ అమిత్ బర్దార్‌ను సస్పెండ్ చేశారు. తిరుపతి ఎస్పీ కృష్ణకాంత్ పటేల్, పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్‌ను ప్రభుత్వం బదిలీ చేసింది. కానీ తిరుపతి, అనంతపురం కలెక్టర్లను మాత్రం కదిలించలేదు. పల్నాడు స్థాయిలో తిరుపతిలోనూ పెద్దఎత్తున గొడవలు జరిగినా అక్కడ ఎస్పీ బదిలీతో సరిపెట్టారు. ఈ చర్యలు సర్కారు పక్షపాత ధోరణిని బయటపెట్టాయి. డీజీపీ నివేదిక ఆధారంగా ఎస్పీలు, సీఎస్ నివేదిక ఆధారంగా కలెక్టర్లపై చర్యలు తీసుకున్నారు. అయితే, చర్యలకు సిఫారసు చేయడంలోనే తీవ్రమైన ఆశ్రిత పక్షపాతం ప్రదర్శించినట్లుగా స్పష్టమవుతోంది.

అస్మదీయులు సేఫ్


ఎన్నికల తర్వాత పల్నాడులో రేగిన హింసను నియంత్రించేందుకు, శాంతిస్థాపనకు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ అనేక సూచనలు, సలహాలు ఇచ్చారు. అయినా, విధి నిర్వహణలో విఫలమయ్యారు కాబట్టి ఆయన్ను బదిలీ చేయాలని సీఎస్ సిఫారసు చేశారు. శివశంకర్ ముక్కుసూటి అధికారి. అధికార పార్టీ కొమ్ముకాసే జాబితాలో, సీఎస్ అస్మదీయుల జాబితాలో లేకపోవడంతో ఆయన్ను బదిలీ చేసేశారు. మరోవైపు తిరుపతి కలెక్టర్ ప్రవీణ్‌కుమార్‌కు సీఎం జగన్, సీఎస్ ఆశీస్సులు దండిగా ఉన్నాయి. తిరుపతి వెళ్లడానికి ముందు ఆయన మిషన్ బిల్డ్ ఏపీ, ఏపీఐఐసీ, ఇతర కీలక విభాగాల్లో పనిచేశారు. ప్రభుత్వ భూములు తెగనమ్మడానికి జగన్ సర్కారు ఏర్పాటు చేసిన సంస్థే మిషన్ బిల్డ్ ఏపీ. చంద్రగిరి నియోజకవర్గం కూచినవారిపల్లి, రామిరెడ్డిపల్లి, తిరుపతిలోని పద్మావతి మహిళా యూనివర్సిటీ పరిధిలో హింస చెలరేగింది. టీడీపీ అభ్యర్థి పులివర్తి నానిపై మహిళా వర్సిటీ ప్రాంగణంలో సమ్మెట, ఇనుప రాడ్లు, బీరు సీసాలు, రాళ్లతో దాడిచేశారు. నాని గన్‌మన్‌పై కూడా సమ్మెటతో దాడిచేశారు. ఇదంతా హత్యాయత్నం కిందకే వస్తుంది. అయినా, ఈ దాడిలో ఐదుగురు వ్యక్తులే పాల్గొన్నారని, కేవలం కర్రలే ఉపయోగించారని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. ఎన్నికల అనంతరం కూచినవారిపల్లికి వైసీపీ అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి నిజాలు తెలుసుకునేందుకు వెళ్లారని, టీడీపీ వారు గొడవలు చేశారని నివేదికలో పేర్కొన్నారు. ఆయన నిజాలు దాచడం వైసీపీ పట్ల ఉన్న అమితమైన స్వామిభక్తిని చాటుకునేలా ఉందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇదిలా ఉంటే, తిరుపతిలో జరిగిన గొడవలను పరిశీలిస్తే పోలీసు, నిఘా వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోంది. అయినా ఆ జిల్లా ఎస్పీని బదిలీతో సరిపెట్టారు. అనంతపురం జిల్లాలో ఎన్నికలకు ముందు, తర్వాత రాజకీయ హింస చెలరేగడం ఖాయమని గత అనుభవాలు అనేకం ఉన్నాయి. సమస్యాత్మక ప్రాంతాల్లో తాడిపత్రి నియోజకవర్గం ఉంది. అక్కడ భారీగా బలగాలను మోహరించి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు శాఖ ముందస్తు జాగ్రతలు తీసుకోవాల్సి ఉంది. కానీ, అవేమీ కనిపించ లేదు. వైసీపీ నేతలు పోలింగ్ రోజు తొలి గంట నుంచే కవ్వింపు చర్యలకు దిగారు. కలెక్టర్ కూడా ముందస్తు చర్యలు తీసుకునేలా పోలీసు శాఖకు దిశా నిర్దేశం చేయాలి. కానీ ఆ దాఖలాలు లేవు. అయినా, ఎస్పీని సస్పెండ్ చేసిన ప్రభుత్వం కలెక్టర్‌పై ఏ చర్యలూ తీసుకోలేదు. కనీసం ఆయన్ను బదిలీ కూడా చేయలేదు. అంటే, ఆయన కూడా సీఎస్ అస్మదీయుల జాబితాలో ఉన్నట్లేనని స్పష్టమవుతోంది.

సీఎస్.. మీరేం చేశారు?

ఎన్నికల అనంతరం హింస చెలరేగుతుందని డీజీపీతో పాటు సీఎస్‌కు సమాచారం ఉంది. పోలింగ్ రోజే హింస చెలరేగింది. అదేరోజు పక్కా ప్రణాళికతో రాజకీయ హింసను అరికట్టడానికి చర్యలు తీసుకునే అవకాశం ప్రభుత్వానికి ఉంది. మరి సీఎస్‌గా జవహర్‌రెడ్డి ఏం చేశారు? జిల్లా కలెక్టర్లు, ఎస్పీలకు ఏం దిశానిర్దేశం చేశారన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. పరిస్థితి అదుపులోకి రాకపోతే వెంటనే ఆ జిల్లా కలెక్టర్‌ను పిలిపించి మాట్లాడాలి. అవసరమైతే సీఎస్ సంబంధిత జిల్లాకు వెళ్లాలి. మరి జవహర్‌రెడ్డి ఈ పనులు చేశారా? మూడు జిల్లాల్లో హింసను నియంత్రించలేని పరిస్థితి వచ్చినప్పుడు ఎస్పీతో పాటు కలెక్టర్లనూ బాధ్యుల్ని చేయాలి. కానీ, ఆ విధానం ఒక పల్నాడుకే వర్తింపజేసి, మిగతా రెండు జిల్లాల్లో అమలు చేయకపోవడం సీఎస్ పరిపాలనా దక్షతలోని కొత్త కోణమా... అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఒకే సమస్యపై ఒక్కో జిల్లాలో ఒక్కోలా చర్యలు తీసుకోవడంపై అఖిల భారత సర్వీసు అధికారుల్లోనే భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. "పల్నాడు, అనంతపురం ఎస్పీలను సస్పెండ్ చేశారు. పల్నాడు కలెక్టర్‌ను మాత్రమే మార్చారు. అనంతపురం కలెక్టర్‌ను ఎందుకు మార్చలేదు? అక్కడ కలెక్టర్ వైఫల్యం సీఎస్‌కు కనిపించలేదా? తిరుపతి ఎస్పీని ఎందుకు బదిలీతో వదిలేశారు? తిరుపతిలో జరిగిన హింస చిన్నదని సీఎస్ భావిస్తున్నారా? తిరుపతి కలెక్టర్ బాగా పనిచేశారని చెప్పదల్చుకున్నారా? పోలింగ్ అనంతరం జరిగిన హింస జాతీయ స్థాయిలో చర్చనీయాంశంగా మారింది. బాధ్యులైన అధికారులను గుర్తించడం, వారిపై చర్యలు తీసుకోవడంలో పారదర్శకత ఉండాలి. కానీ అందులోనూ అస్మదీయ సూత్రాన్ని పాటిస్తే ప్రజల దృష్టిలో చులకన అవుతాం" అని ఓ సీనియర్ ఐఏఎస్ అధికారి 'ఆంధ్రజ్యోతి'తో చెప్పారు.

భావ ప్రకటనపై ఉక్కుపాదం

- జగన్‌పై గతంలో పోస్టులు పెట్టారంటూ ఎన్ఆర్ఐని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- వైద్యుడిపై దాడి చేసిన సీఎం భద్రతా సిబ్బంది



విజయవాడ, మే 18(ఆంధ్రజ్యోతి), గన్నవరం: భావ ప్రకటనా స్వేచ్ఛపై పోలీసులు మరోసారి ఉక్కుపాదం మోపారు. సీఎం జగన్‌పై గతంలో సామాజిక మాధ్యమాల్లో పోస్టు పెట్టారన్న ఆరోపణలతో ఎన్ఆర్ఐ వైద్యుడిపై పోలీసులు దురుసుగా వ్యవహరించారు. దీనికి సీఎం భద్రతా సిబ్బంది తోడై ఆయనపై దాడి చేశారు. ఈ ఘటన విజయవాడ విమానాశ్రయంలో శుక్రవారం రాత్రి జరిగింది. విజయవాడకు చెందిన డాక్టర్ ఉయ్యూరు లోకేశ్ అమెరికాలో స్థిరపడ్డారు. అక్కడి పౌరసత్వాన్ని పొందారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఓటు వేసేందుకు కొద్దిరోజుల క్రితం ఆయన విజయవాడకు వచ్చారు. ఆయన అమెరికాలో ఉన్నప్పుడు జగన్ పాలనలో అవినీతి, అరాచకాలపై సామాజిక మాధ్యమాల ద్వారా స్పందించారు. జగన్‌కు అనేక ప్రశ్నలు సంధించారు. శుక్రవారం రాత్రి కుటుంబంతో లండన్ వెళ్లడానికి జగన్ గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్నారు. అంతకుముందుగానే డాక్టర్ లోకేశ్ అక్కడికి చేరుకున్నారు. ఆయన ఆదివారం అమెరికా వెళ్లాల్సి ఉంది. ఈ క్రమంలో ముందుగా విమానాశ్రయంలో 'పిన్'ను నమోదు చేయాల్సి ఉంటుంది. ఈ పిన్‌ను నమోదు చేసుకోవడానికి లోకేశ్ విమానాశ్రయానికి వచ్చారు. సీఎం జగన్ వస్తున్నారని భద్రతా సిబ్బంది కాసేపు వెయిటింగ్ హాల్లో ఉండాలని సూచించారు. దీంతో ఆయన పక్కకు వెళ్లి కూర్చున్నారు. సీఎం జగన్ వచ్చిన తర్వాత వైసీపీ నేతలు కొందరు వెయిటింగ్ హాలులో ఉన్న లోకేశ్‌ను గుర్తించి పోలీసులకు సైగలు చేశారు. పోలీసులు ఆయన వద్దకు వెళ్లి బలవంతంగా జీపులో ఎక్కించారు. స్టేషన్‌కు తీసుకెళ్లిన తర్వాత లోకేశ్ ఐఫోన్, కారు తాళాలను స్వాధీనం చేసుకున్నారు. సోషల్ మీడియా పోస్టింగ్‌లపై సుదీర్ఘంగా విచారించారు. ఛాతీలో నొప్పిగా ఉందని లోకేశ్ చెప్పడంతో విజయవాడలో ఉన్న ఆయుష్ ఆస్పత్రికి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ నేతలు దేవినేని ఉమామహేశ్వరరావు, దారపునేని నరేంద్ర, న్యాయవాది గూడపాటి లక్ష్మీనారాయణ అక్కడికి వెళ్లారు. ఏ సెక్షన్ కింద లోకేశ్‌ను అరెస్టు చేశారో చెప్పాలని లక్ష్మీనారాయణ డిమాండ్ చేయడంతో పోలీసులు నీళ్లు నమిలారు. అప్పటికప్పుడు సీఆర్పీసీ 151నోటీసు ఇచ్చి, స్వాధీనం చేసుకున్న ఐఫోన్, తాళాలను తిరిగి ఇచ్చేశారు. ఆస్పత్రి నుంచి లోకేశ్ ఇంటికి చేరుకున్నారు.

న్యాయపోరాటం చేస్తా: డాక్టర్ లోకేశ్

"విమానాశ్రయం కేంద్రం పరిధిలో ఉంటుంది. ఏదైనా తప్పు చేసిఉంటే విమానాశ్రయ భద్రతా సిబ్బందికి చెప్పాలి. నేను ఎలాంటి తప్పు చేయలేదు. జగన్ అవినీతి, అరాచకాలపై ప్రశ్నించాను. ఇది తప్పా? దీనిపై కోర్టులో ప్రైవేటు కేసు దాఖలు చేస్తా" అని లోకేశ్ చెప్పారు. కాగా, లోకేశ్ సీఎం జగన్ కాన్వాయ్‌ని అడ్డగించేందుకు ప్రయత్నించడంతో అదుపులోకి తీసుకున్నట్టు గన్నవరం సీఐ ప్రసాద్ తెలిపారు. వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశామన్నారు.

టీఎస్‌ఎప్‌సెట్‌లో ఏపీ టాపర్లు

- ఇంజనీరింగ్ టాపర్‌గా శ్రీకాకుళం విద్యార్థి
- అగ్రికల్చర్-ఫార్మసీ టాపర్‌గా మదనపల్లి అమ్మాయి
- టాప్-10లో ఐదుగురు ఏపీ విద్యార్థులే

హైదరాబాద్, మే 18 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన టీఎస్ ఎప్‌సెట్ ఫలితాల్లో ఏపీ విద్యార్థులు సత్తా చాటారు. రెండు విభాగాల్లో ఫస్ట్, సెకండ్ ర్యాంకులతోపాటు... టాప్-10లో ఐదుగురు ఏపీ విద్యార్థులే సాధించారు. ఇంజనీరింగ్‌లో శ్రీకాకుళం జిల్లా పాలకొండ మండలానికి చెందిన సతివాడ జ్యోతిరాదిత్య, అగ్రికల్చర్-ఫార్మసీ విభాగంలో అన్నమయ్య జిల్లా మదనపల్లికి చెందిన ఆలూరు ప్రణీత మొదటి ర్యాంకులు సాధించారు. రాష్ట్రంలోని సికింద్రాబాద్‌కు చెందిన రిషి శేఖర్ శుక్లా ఇంజనీరింగ్‌లో 3వ ర్యాంకు, హనుమకొండ జిల్లాకు చెందిన గడ్డం శ్రీవర్షిణి అగ్రి-ఫార్మసీలో 3వ ర్యాంకు సాధించారు. జేఎన్టీయూ క్యాంపస్‌లో శనివారం విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం, ఉన్నత విద్యామండలి ఛైర్మన్ లింబాద్రి, జేఎన్టీయూ వీసీ నర్సింహారెడ్డి ఫలితాలను విడుదల చేశారు.

రికార్డు సమయంలో ఫలితాల విడుదల

ఎప్‌సెట్ పరీక్షల ఫలితాలను రికార్డు సమయంలో (7 రోజుల్లోనే) విడుదల చేశామని విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం తెలిపారు. వర్షం కారణంగా ఒకటి, రెండు కేంద్రాల్లో సాంకేతిక సమస్యలు మినహా.. ఎప్‌సెట్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగాయన్నారు.

ఇంజనీరింగ్ తొలి 5 ర్యాంకర్లు వీరే..

ర్యాంకు	పేరు	జిల్లా/రాష్ట్రం	మార్కులు
1	సతివాడ జ్యోతిరాదిత్య	శ్రీకాకుళం(ఏపీ)	155.63
2	గొల్లలేఖ హర్ష	కర్నూలు(ఏపీ)	152.08
3	రిషిశేఖర్ శుక్లా	సికింద్రాబాద్(టీజీ)	150.66
4	భోగలపల్లి సందేశ్	హైదరాబాద్(టీజీ)	149.59
5	మురసాని యశ్వంత్‌రెడ్డి	కర్నూలు(ఏపీ)	145.64

అగ్రికల్చర్, ఫార్మసీ తొలి 5 ర్యాంకర్లు వీరే

ర్యాంకు	పేరు	జిల్లా/రాష్ట్రం	మార్కులు
1	ఆలూరు ప్రణీత	అన్నమయ్య(ఏపీ)	146.44
2	నాగుదాసరి రాధాకృష్ణ	విజయనగరం(ఏపీ)	145.42
3	గడ్డం శ్రీవర్షిణి	హనుమకొండ(టీజీ)	145.25
4	సోంపల్లి సాకేత్ రాఘవ్	చిత్తూరు(ఏపీ)	145.10
5	రేపాల సాయివివేక్	హైదరాబాద్(టీజీ)	144.62

కార్డియాక్ సర్జన్ అవుతా



మా నాన్న హోమియోపతి డాక్టర్‌గా సేవలందించడం చిన్నప్పటి నుంచి చూస్తున్నాను. అప్పట్లోనే డాక్టర్ కావాలని అనుకున్నాను. కళాశాల అధ్యాపకుల సూచనలతో క్రమశిక్షణతో కూడిన చదువుతో ఫస్ట్ ర్యాంకు సాధించాను. సాయంత్రం 6 నుంచి 10 గంటల వరకు ఒక ప్రణాళికతో చదివాను. పాఠాలను అర్థం చేసుకుని, హోంవర్క్ చేస్తే మంచి మార్కులు వస్తాయి. నీట్ పరీక్షలో మంచి ర్యాంకు సాధించి ఢిల్లీలోని ఎయిమ్స్‌లో లేదా జిప్‌మర్ మెడికల్ ఇన్‌స్టిట్యూట్‌లో సీటు సాధించి కార్డియాక్ సర్జన్ కావాలనుంది.

- ఆలూరు ప్రణీత, మదనపల్లె, అగ్రికల్చర్-ఫార్మసీ 1వ ర్యాంక్


ఐఐటీ ముంబైలో చేరతా



తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే ర్యాంకు సాధించా. ఏడో తరగతి నుంచి పదో తరగతి వరకు కృష్ణా జిల్లా గుడివాడలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో చదివాను. పదో తరగతిలో 556 మార్కులు, ఇంటర్‌లో 953 మార్కులు వచ్చాయి. జేఈఈ మెయిన్స్‌లో ఆలిండియా 116వ ర్యాంకు సాధించా. అడ్వాన్స్‌డ్‌లోనూ మంచి ర్యాంకు తెచ్చుకొని ఐఐటీ ముంబైలో చేరతాను.

- సతివాడ జ్యోతిరాదిత్య, శ్రీకాకుళం జిల్లా, ఇంజనీరింగ్ 1వ ర్యాంక్

కంప్యూటర్ సైన్స్ చదువుతా



పదో తరగతిలో 10/10 గ్రేడ్ సాధించా. ఇంటర్మీడియట్‌లో 987 మార్కులు వచ్చాయి. జేఈఈ మెయిన్స్‌లో 252వ ర్యాంకు వచ్చింది. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో కూడా మంచి ర్యాంకు సాధించి ఐఐటీ ముంబైలో సీఎస్ఈలో చేరతా.

- భోగలపల్లి సందేశ్, ఆదోని, ఇంజనీరింగ్ 4వ ర్యాంక్

తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే...



జేఈఈ-మెయిన్స్ పరీక్ష ఫలితాల్లో ఆలిండియా స్థాయిలో 311వ ర్యాంకు వచ్చింది. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో కూడా మంచి ర్యాంకు సాధించి ఐఐటీ ముంబై, ఐఐటీ చెన్నై వంటి ప్రముఖ విద్యాసంస్థల్లో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్‌లో చేరాలన్నదే నా లక్ష్యం. ఉత్తమ ర్యాంకు రావడానికి తల్లిదండ్రుల ప్రోత్సాహంతో పాటు అధ్యాపకుల కృషే కారణం.

- గొల్ల లేఖ హర్ష, కర్నూలు, ఇంజనీరింగ్ 2వ ర్యాంక్

సివిల్స్‌తో సేవ చేస్తా..



సివిల్ సర్వీసుకు ఎంపికై పేద ప్రజలకు సేవ చేయాలనే సంకల్పం ఉంది. మా తల్లిదండ్రులు కూడా ప్రోత్సహిస్తున్నారు. 10వ తరగతి పరీక్షలో 573 మార్కులు సాధించా. ఇంటర్‌లో 980 మార్కులు వచ్చాయి. జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో ఆలిండియా స్థాయిలో ఈడబ్ల్యూఎస్ కేటగిరిలో 36వ ర్యాంకు వచ్చింది. జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు సిద్ధమవుతున్నా. మంచి ర్యాంకు సాధించి అత్యుత్తమ విద్యాసంస్థలో బీటెక్‌లో సీఎస్ఈలో చేరాలని ఉంది.

- ముర్రసాని సాయి యశ్వంత్ రెడ్డి, కర్నూలు, ఇంజనీరింగ్ 5వ ర్యాంక్

నిగ్గు తేలుస్తారా?

(మొదటి పేజీ తరువాయి)

రంగంలోకి దిగింది. ఇంటెలిజెన్స్ ఐజీ వినీత్ బ్రిజిలాల్ నేతృత్వంలో 13మంది అధికారులతో ఏర్పాటైన సిట్ నాలుగు బృందాలుగా విడిపోయి ఘర్షణలు జరిగిన ప్రాంతాల్లో పర్యటిస్తోంది. పల్నాడు జిల్లా మాచర్ల, నరసరావుపేట, అనంతపురం జిల్లా తాడిపత్రితోపాటు తిరుపతిలో సిట్ అధికారులు పర్యటిస్తున్నారు. అధికార పార్టీకి వంతపాడిన దిగువ, మధ్యస్థాయి పోలీసు అధికారుల పాత్రపై విచారణ చేస్తున్నారు. టీడీపీ నేతలు, కార్యకర్తలపై యథేచ్ఛగా దాడులు జరుగుతున్నా, ఆస్తులను ధ్వంసం చేస్తున్నా ఆపకుండా ప్రేక్షక పాత్ర పోషించిన అధికారులు ఎవరు? ఉన్నతాధికారుల ఆదేశాలు పాటించకుండా అధికార పార్టీ నేతలకు సమాచారం చేరవేసిన పోలీసులెవరు? అన్న కోణాల్లో విచారిస్తున్నారు. 'సీడీ ఫైల్ తీసుకురండి. ఎఫ్ఐఆర్‌లో ఏయే సెక్షన్లు వేశారు? ఎవరెవరిని అరెస్టులు చేశారు? వచ్చిన ఫిర్యాదులేంటి? దర్యాప్తులో లభించిన ఆధారాలేంటి?' అంటూ సిట్ అధికారులు.. స్థానిక పోలీసులను ప్రశ్నిస్తున్నారు.

పల్నాడులో విచారణ..

పల్నాడు ప్రాంతానికి డీఎస్పీ రమణమూర్తి, సుబ్బరాజు నేతృత్వంలో వెళ్లిన బృందాలకు అడిషనల్ ఎస్పీ సౌమ్యలత సమన్వయం చేస్తూ పర్యవేక్షిస్తున్నారు. మాచర్ల, నరసరావుపేట ప్రాంతంలో జరిగిన హింసకు సంబంధించిన ఎఫ్ఐఆర్, కేస్ డైరీలను సిట్ అధికారులు స్వాధీనం చేసుకుని అన్ని కోణాల్లోనూ పరిశీలిస్తున్నారు. దాడులు, ప్రతిదాడులు జరిగిన వీడియోలు వీక్షించి, తగిన సెక్షన్లు పోలీసులు నమోదు చేశారా? లేదా? అనే విషయాన్ని పరిశీలించారు. నరసరావుపేటలో జరిగిన అరాచకాలపై రెండో పట్టణ పోలీసు స్టేషన్‌లో నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లను సౌమ్యలత పరిశీలించారు. రెంటచింతల పోలీసు స్టేషన్‌కు వచ్చిన సిట్ బృందం మండలంలో జరిగిన ఘటనలపై వివరాలను సేకరించింది. స్టేషన్ పరిధిలో నమోదైన ఎఫ్ఐఆర్‌లను పరిశీలించింది. దాడుల్లో గాయపడిన వారి వివరాలను తీసుకుంది. ఈవీఎంల ధ్వంసం సంఘటనలకు సంబంధించిన వీడియో ఫుటేజ్, వెబ్‌కాస్టింగ్ దృశ్యాలను కూడా పరిశీలించనున్నారు.

తాడిపత్రిలో...

అనంతపురం జిల్లా తాడిపత్రికి ఒంగోలు ఏసీబీ డీఎస్పీ వల్లూరు శ్రీనివాసరావు నేతృత్వంలోని బృందం వెళ్లింది. దశాబ్దాలుగా ఇక్కడ రెండు కుటుంబాల మధ్య ఫ్యాక్షన్ ఉన్న నేపథ్యంలో పోలీసులు తగిన బందోబస్తు చర్యలు చేపట్టారా? పోగుచేసిన రాళ్ల గుట్టలను ముందుగానే ఎందుకు పసిగట్టలేకపోయారు? జిల్లా ఎస్పీ అమిత్ బర్దార్‌పైనే రాళ్ల వర్షం కురిపించేంతటి హింసను ఎందుకు అదుపుచేయలేక పోయారు? గతంలో ఇక్కడ పనిచేసి వివాదానికి కేంద్ర బిందువైన డీఎస్పీ చైతన్యపై వచ్చిన ఆరోపణల్లో వాస్తవమెంత? అనే కోణాల్లో పరిశీలిస్తోంది. సిట్ బృందంలో డీఎస్పీ వల్లూరు శ్రీనివాసరావుతో పాటు ఏసీబీ డీఎస్పీ భూషణం, ఏసీబీ ఇన్‌స్పెక్టర్ జీఎల్ శ్రీనివాస్ ఉన్నారు. తాడిపత్రి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం డీఐజీ షిమోషీతో సమావేశమయ్యారు. ఎమ్మెల్యే పెద్దారెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ఇళ్ల వద్ద జరిగిన హింసాత్మక ఘటనల గురించి అడిగినట్లు సమాచారం. పోలీసు అధికారులు వ్యవహరించిన తీరుపై ఆరాతీసినట్లు తెలిసింది. అనంతరం ఎన్నికల రోజు దాడులు జరిగిన ఓంశాంతినగర్, పాతకోట, గానుగవీధి ప్రాంతాల్లో పర్యటించారు. గొడవల గురించి స్థానికులను విచారించారు. అనంతరం ఎమ్మెల్యే, మున్సిపల్ ఛైర్మన్ నివాసాలను పరిశీలించారు. ఇరువర్గాలు గొడవపడ్డ కళాశాల మైదానంలో కలియతిరిగారు. రాళ్లదాడి ఏ విధంగా జరిగిందో అక్కడున్న సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. బందోబస్తు సిబ్బందితోనూ మాట్లాడారు. వారివెంట తాడిపత్రి రూరల్ సీఐ లక్ష్మీకాంత్‌రెడ్డి, ఎస్ఐ గౌస్‌బాషా ఉన్నారు.

తిరుపతిలో...

డీఎస్పీ రవి మనోహరాచారి బృందం తిరుపతిలో విచారణ చేపట్టింది. దాడి జరిగిన ప్రాంతానికి వెళ్లి పరిశీలించింది. టీడీపీ అభ్యర్థి పులివర్తి నానిపై హత్యాయత్నం జరిగినప్పుడు అక్కడ విధుల్లో ఉన్న పోలీసులు ఎవరు? ఎందుకు సరిగా స్పందించలేకపోయారు? కేసు దర్యాప్తు ఎలా చేస్తున్నారు? అనే కోణాల్లో పరిశీలించింది. నాలుగు ప్రాంతాల్లోనూ సిట్ బృందాలు పూర్తి స్థాయిలో విచారణ చేపట్టాయి. ఆదివారం సాయంత్రానికి విచారణను దాదాపు ఓ కొలిక్కి తీసుకొస్తామని సిట్ అధికారులు పోలీసు ప్రధాన కార్యాలయానికి సమాచారం అందజేశారు. ఇప్పటికే 12 మంది అధికారులు (డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు)పై వేటు పడగా, మరికొందరి పాత్రను సిట్ వెలుగులోకి తెచ్చే అవకాశం ఉంది.

3 జిల్లాలకు కొత్త ఎస్పీలు

పల్నాడు జిల్లా ఎస్పీగా మాలికా గార్గ్, అనంతపురం ఎస్పీగా గౌతమి శాలి, తిరుపతి ఎస్పీగా హర్షవర్ధన్ రాజును ఈసీ నియమించింది. శనివారం సాయంత్రం 7గంటల్లోగా బాధ్యతలు స్వీకరించాలని ఆదేశించింది. ఇతర రాష్ట్రాల్లో ఎన్నికల పరిశీలకులుగా వెళ్లినవారికి ఆదివారం సాయంత్రం వరకూ సమయం ఇచ్చింది. మాలికా గార్గ్, హర్షవర్ధన్ రాజు ఇతర రాష్ట్రాలకు ఎన్నికలపరిశీలకులుగా వెళ్లారు. కాగా రాష్ట్ర ప్రభుత్వం ఐదుగురు ఐపీఎస్ అధికారుల పేర్లను పంపిన సంగతి తెలిసిందే. అయితే తమ ఆదేశాల మేరకు 9మంది పేర్లను పంపాల్సిందేనని ఈసీ స్పష్టం చేసింది. 'మా దగ్గర ఐపీఎస్‌లు సరిపడా లేరు.. ఎస్పీ ర్యాంకుల్లో కొరత ఉంది.. ఐదుగురిలో నుంచి ముగ్గురిని ఎంపిక చేసుకోండి అంటే కుదరదు. రూల్ పాటించాల్సిందే. ప్రతిజిల్లాకు మూడుపేర్ల చొప్పున మొత్తం తొమ్మిది మంది జాబితా పంపాల్సిందే' అని రాష్ట్ర ప్రభుత్వానికి ఈసీ స్పష్టమైన ఆదేశాలిచ్చింది. చేసేదిలేక ఈసీ చెప్పినట్లే మరో నాలుగు పేర్లు చేర్చి సీఎస్ జవహర్‌రెడ్డి జాబితా పంపారు. పల్నాడు జిల్లాకు మాలికా గార్గ్, అధిరాజ్ సింగ్ రాణా, కె. శ్రీనివాసరావు... అనంతపురం జిల్లాకు గౌతమి శాలి, నచికేత్ విశ్వనాథ్, నరసింహ కిశోర్... తిరుపతి జిల్లాకు సునీక్ శరాక్, రాహుల్ మీనా, హర్షవర్ధన్ రాజు పేర్లను ఢిల్లీకి పంపారు. ఈసీ వీరిలో నుంచి ముగ్గురిని ఎంపిక చేసింది.



కన్నుల పండువగా మలయప్ప పెళ్లి వేడుక

పద్మావతి పరిణయోత్సవాల్లో రెండో రోజైన శనివారం అశ్వవాహనంపై మలయప్పస్వామి ఊరేగింపుగా పెళ్లి మండపానికి వచ్చారు. స్వర్ణపల్లకీలో శ్రీదేవి, భూదేవి అనుసరించగా నారాయణగిరి ఉద్యానవనంలోని పరిణయోత్సవ వేదికపై కొలువుదీరారు.

తిరుమలలో కొనసాగుతున్న రద్దీ

తిరుమల, మే 18(ఆంధ్రజ్యోతి): తిరుమలలో భక్తుల రద్దీ శనివారం కూడా కొనసాగింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరి షెడ్లు భక్తులతో నిండిపోయి క్యూలైన్ శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. స్లాటెడ్ భక్తులను దఫదఫాలుగా క్యూలైన్‌లోకి అనుమతించిన నేపథ్యంలో సాయంత్రం 6 గంటల నుంచి క్యూలైన్ నెమ్మదిగా తగ్గుతూ వస్తోంది. వీరికి 24 గంటల దర్శన సమయం పడుతున్నట్టు టీటీడీ ప్రకటించింది. తలనీలాలు సమర్పించే కల్యాణ కట్టల్లోనూ రద్దీ తగ్గలేదు.

చెస్ అసోసియేషన్ వినతిని పరిగణలోకి తీసుకోండి

- ఆల్ ఇండియా చెస్ ఫెడరేషన్‌కు హైకోర్టు ఆదేశం

అమరావతి, మే 18(ఆంధ్రజ్యోతి): కేంద్రం జారీ చేసిన నేషనల్ స్పోర్ట్స్ కోడ్ మార్గదర్శకాలకు అనుగుణంగా రాష్ట్ర చెస్ అసోసియేషన్లకు గుర్తింపు ఇవ్వాల్సిన బాధ్యత ఆల్ ఇండియా చెస్ ఫెడరేషన్‌పై ఉందని హైకోర్టు స్పష్టం చేసింది. ఏపీ చెస్ అసోసియేషన్ గుర్తింపు విషయంలో ఈ ఏడాది ఫిబ్రవరిలో కోర్టు ఉత్తర్వులు ఇచ్చినప్పటికీ ఆల్ ఇండియా చెస్ ఫెడరేషన్ నిర్ణయాన్ని వెల్లడించకపోవడాన్ని తీవ్రంగా తప్పుబట్టింది. పిటిషనర్ అసోసియేషన్ గుర్తింపు కోసం నేషనల్ స్పోర్ట్స్ కోడ్‌ను అనుసరించి అన్ని మార్గదర్శకాలనూ పాటించిందని గుర్తు చేసింది. ఈ నేపథ్యంలో గుర్తింపు కోసం సమర్పించిన వినతిని పరిగణలోకి తీసుకొని ఆరువారాల్లో ఉత్తర్వులు ఇవ్వాలని ఆదేశించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు ఇటీవల తీర్పు ఇచ్చారు. ఏపీ చెస్ అసోసియేషన్ గుర్తింపును రద్దు చేస్తూ ఆల్ ఇండియా చెస్ ఫెడరేషన్ తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ అసోయేషన్ ప్రధాన కార్యదర్శి వై.సమన్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం ఇటీవల విచారణ జరిపిన న్యాయమూర్తి... గుర్తింపు నిమిత్తం ఏపీ చెస్ అసోసియేషన్ సమర్పించిన వినతులను పరిగణలోకి తీసుకొని ఆరువారాల్లో తగిన ఉత్తర్వులు జారీ చేయాలని ఆదేశించారు.

'మేఘా' మనదేగా రాసిచ్చేద్దాం!

- పోలవరం హైడల్ ప్రాజెక్టు పనుల గడువు పొడిగించాలంటూ ప్రభుత్వ పెద్దల ఒత్తిడి
- అంచనా వ్యయం రూ.3,270 కోట్లు.. పొడిగిస్తే రూ.2,800 కోట్లు అదనం
- నికరంగా మేఘా జేబులోకి రూ.6,070 కోట్లు
- రంగంలోకి వసూల్‌రాజా...జెన్కోకు మేఘా లేఖ
- మరో 36 నెలలకు పెంచాలని ప్రతిపాదన
- అయితే, కోడ్ ఉండటంతో దరఖాస్తు వెనక్కి.
- కొత్త ప్రభుత్వంలోనే నిర్ణయం తీసుకోవాలని బోర్డు తీర్మానం

అమరావతి, మే 18 (ఆంధ్రజ్యోతి) : 'మేఘా' మనదేగా ఇంధన రంగాన్ని రాసిచ్చేద్దాం" అంటూ ఇంధన సంస్థలపై ప్రభుత్వ పెద్దల నుంచి తీవ్రస్థాయిలో ఒత్తిడి పెరుగుతోంది. ఎన్నికల మార్గదర్శకాలు అమలులోఉన్నా, అస్మదీయులకు మేలు చేకూర్చేలా ప్రణాళికా రచన చేస్తున్నారు. దాని అమలు కోసం వసూల్ రాజా రంగంలోకి దిగారు. వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన రెడ్డికి గడచిన ఐదేళ్లుగా తన మీడియా సంస్థ ద్వారా సంపూర్ణ సహకారాన్ని 'మేఘా' అందిస్తోంది. దానికి ప్రత్యుపకారం చేయాలని ప్రభుత్వ పెద్దలు నిర్ణయించారు. ఇప్పటికే రూ.7,380 కోట్ల విలువైన సీలేరు పంప్డ్ స్టోరేజీ జల విద్యుచ్ఛక్తి ప్రాజెక్టును అప్పగించేశారు. పోలవరం హైడల్ ప్రాజెక్టు కాలపరిమితిని మరో 36 నెలలు పొడిగించాలని, తద్వారా అంచనాల సవరణకు వీలు కల్పించాలంటూ ఇప్పుడు జెన్కోపై మరింత ఒత్తిడి తెస్తున్నారు.

అప్పనంగా రూ. పదివేల కోట్లు

పోలవరం హైడల్ పవర్ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.3270 కోట్ల నుంచి మరో రూ.2800 కోట్లు పెంచుతూ .. రూ.6070 కోట్లకు చేర్చేలా ప్రయత్నాలు ముమ్మరమయ్యాయని విద్యుత్తు రంగ నిపుణులు చెబుతున్నారు. సీలేరు హైడల్ పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టు పనుల అంచనా వ్యయం రూ.7380 కోట్లు .. పోలవరం హైడల్ ప్రాజెక్టులో పెంచిన అంచనా వ్యయం రూ.2800 కోట్లు.. మొత్తంగా రూ.10,180 కోట్ల మేర ఆర్థిక ప్రయోజనాన్ని చేకూర్చేలా ఇంధన శాఖపై ప్రభుత్వ పెద్ద ఒత్తిడిని పెంచుతున్నారని సమాచారం. రెండేళ్లలో పోలవరం ప్రాజెక్టు పనులు పూర్తిచేస్తామని చెప్పి 2019 నవంబరులో రూ.1558.13 కోట్ల అంచనా వ్యయంతో 'మేఘా' బాధ్యతలు తీసుకుంది. కానీ, సకాలంలో పనులు పూర్తి చేయలేకపోయింది. అదేవిధంగా రూ.3,270 కోట్ల అంచనా వ్యయంతో పోలవరం జలవిద్యుదుత్పత్తి ప్లాంటును 2024 నాటికి పూర్తి చేస్తానని జెన్కోతో ఆ సంస్థ ఒప్పందం చేసుకుంది. ఈ ఒప్పందాల కాలపరిమితి కూడా ముగిసింది. వాస్తవానికి .. సకాలంలో ప్రాజెక్టు పనులు పూర్తి చేయనందుకుగాను 'మేఘా'కి జరిమానా విధించాలి. లేదంటే 60సీ నిబంధనల కింద కాంట్రాక్టును రద్దు చేయాలి. కానీ, గడువు పొడిగించాలని ఆ సంస్థ కోరడం, ఆగమేఘాలపై ప్రభుత్వ పెద్దలు జెన్కోను తొందరపెట్టడం చకచకా జరిగిపోతున్నాయి. ఈ క్రమంలో జెన్కోకు మేఘా ఒక లేఖ రాసింది. "పోలవరం సాగునీటి ప్రాజెక్టును 2026లో పూర్తి చేస్తామని కేంద్రజల శక్తి మంత్రిత్వ శాఖ వెల్లడించింది. సాగునీటి ప్రాజెక్టు ప్రధాన పనులు పూర్తయితేగాని .. విద్యుదుత్పత్తి ప్లాంటును పూర్తి చేయడం సాధ్యం కాదు" అని ఆ లేఖలో పేర్కొంది. అలాగే, పోలవరం ప్రాజెక్టు దెబ్బతిన్న కట్టడాల పునర్నిర్మాణానికి అంతర్జాతీయ నిపుణులను కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ తాజాగా పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) ద్వారా ఎంపిక చేసిందని తెలిపింది. నిజానికి, ఈ పనుల కోసం జర్మనీ , స్విట్జర్లాండ్‌కు చెందిన నిపుణులను పీపీఏ ఎంపిక చేసింది. వారికి కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ 'వాప్కోస్' వర్క్ ఆర్డర్‌ను (టెర్మ్ ఆఫ్ రిఫరెన్స్ - టీఓఆర్) అందించాల్సి ఉంది. కానీ, ఎన్నికల కోడ్ కారణంగా వర్క్ ఆర్డరును వాప్కోస్ అందజేయలేదు. దీనికి భిన్నంగా.. మన రాష్ట్రంలో కోడ్‌ను ప్రభుత్వ పెద్దలు ఏమాత్రమూ పట్టించుకోవడం లేదు. పోలవరం హైడల్ పవర్ ప్రాజెక్టు కాంట్రాక్టు కాలపరిమితి పెంచేందుకు సిద్ధమవుతున్నారు. ఈనెల 15వ తేదీన జెన్కో బోర్డు సమావేశం జరిగింది. మేఘా పెట్టుకున్న దరఖాస్తును అజెండా అంశంగా చేర్చారు. అయితే, దానిని బోర్డు తిరస్కరించింది. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాతే దీనిపై నిర్ణయం తీసుకోవాలని జెన్కో బోర్డు నిర్ణయించింది.

పోస్టింగ్ ఇప్పించండి

ఎన్నికల కమిషన్‌కు ఏబీవీ లేఖ
సీఈసీకి పంపిన సీఈవో



అమరావతి, మే 18(ఆంధ్రజ్యోతి): కేంద్ర పరిపాలన ట్రైబ్యునల్(క్యాట్) తీర్పును అనుసరించి తనకు పోస్టింగ్ ఇప్పించాలంటూ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారికి సీనియర్ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు శనివారం లేఖ రాశారు. ఈ నెల 31న పదవీ విరమణ చేయనున్న తనకు పోస్టింగ్ ఇవ్వడంలో జాప్యం జరుగుతోందని, న్యాయం చేయాలని కోరారు. రాష్ట్రంలోనే అందరికన్నా సీనియర్ ఐపీఎస్ అయిన తన సస్పెన్షన్ చెల్లదంటూ పది రోజుల క్రితమే క్యాట్ తీర్పు ఇచ్చిందంటూ లేఖతోపాటు ఆ కాపీని జత చేశారు. ఈ లేఖను సీఈవో కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారికి పంపించారు. సీఈసీ నిర్ణయం మేరకు ఏబీవీకి పోస్టింగ్ లభించే అవకాశం ఉంది.

పోలింగ్ ముగిసినా స్పందించని సర్కారు

రాష్ట్రంలో ఐదేళ్ల క్రితం అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఏ తప్పూ చేయని ఏబీ వెంకటేశ్వరరావుపై కక్ష సాధింపులకు పాల్పడింది. అసలు కొనుగోలే చేయని పరికరాల్లో అవినీతి జరిగిందంటూ ఆయనపై సస్పెన్షన్లు విధిస్తూ వేధించింది. న్యాయ పోరాటం చేస్తున్న వెంకటేశ్వర రావుకు ఈ నెల 8న క్యాట్ తీర్పు పెద్ద ఉపశమనాన్ని కల్పించింది. తీర్పు వచ్చిన మూడు రోజుల్లోనే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డిని కలిసిన ఏబీవీ.. తనకు పోస్టింగ్ ఇవ్వాలని దరఖాస్తు సమర్పించారు. అయితే ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున సీఈసీ అనుమతి తీసుకోవాల్సి ఉందని చెప్పిన సీఎస్ నుంచి, ఆ తర్వాత కూడా ఎలాంటి స్పందనా లేకపోవడంతో నేరుగా రాష్ట్ర ఎన్నికల అధికారికి లేఖ అందజేశారు.

ఇకపై బాటిల్స్‌లో నో పెట్రోల్!

- బంకుల ఎదుట నోటీసులు అంటించాలని సూచన
- ఎన్నికల అనంతర హింసలో పెట్రోల్ బాంబుల వాడకమే కారణం

గుంటూరు, మే 18: సార్వత్రిక ఎన్నికల తరువాత అల్లర్లు చెలరేగడం, మరికొన్ని రోజుల్లో ఎన్నికల ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో ఉన్నతాధికారులు అప్రమత్తమయ్యారు. పెట్రోల్ బంకుల్లో వాహనాలకు మాత్రమే పెట్రోల్ పోయాలని, బాటిళ్లలో పెట్రోల్ పోయరాదని స్పష్టమైన ఆదేశాలుజారీ చేశారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే అనంతర పరిణామాలకు బంకుల యాజమాన్యాలే బాధ్యత వహించాల్సి ఉంటుందని, వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పల్నాడు, రాయలసీమ ప్రాంతాల్లో చెలరేగిన హింసలో పెట్రోల్ బాంబులు(పెట్రోల్ బాటిల్స్)తో దాడి చేసిన ఉదంతాలు బయటపడటంతో పెట్రోల్ బంకుల డీలర్లకు పోలీసు, ఎన్నికల ఉన్నతాధికారులు ఈ మేరకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఇకపై పెట్రోల్ బంకు ల్లో వాహనాలకు మాత్రమే ఆయిల్ పోసేలా, బాటిళ్లు, క్యాన్లలో ఆయిల్ పోయకుండా నిర్ణయం తీసుకున్నట్లు ఆంధ్రప్రదేశ్ ఫెడరేషన్ ఆఫ్ పెట్రోల్ డీలర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రావి గోపాలకృష్ణ, ప్రధాన కార్యదర్శి పేరం రవికుమార్ తెలిపారు. ఈ మేరకు నిబంధనలు పాటించే లా బంకుల డీలర్లకు ఆదేశాలు జారీ చే శారు. 'ఖాళీ సీసాల్లో, క్యానుల్లో పెట్రోల్ అమ్మబడుదు' అని బంకుల ఎదుట నోటీసులు అంటించాలని డీలర్లకు సూచించారు.

రాజకీయాలు పెద్దగా తెలీదు

- కానీ ప్రజలకు వీలైనంత సేవ చేస్తా: ఎంపీ సుధా నారాయణమూర్తి



తిరుమల, మే 18 (ఆంధ్రజ్యోతి): రాజకీయాలు తనకు పెద్దగా తెలియదని, కానీ ప్రజలకు వీలైనంత సేవ చేస్తానని ఇన్ఫోసిస్ ఫౌండేషన్ ఛైర్‌పర్సన్, ఎంపీ సుధా నా రా య ౦ ణ మూర్తి అన్నారు. శనివారం ఉదయం ఆమె తిరుమల వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రపతి కోటాలో రాజ్యసభ సభ్యురాలిగా ఎంపిక కావడం చాలా సంతోషంగా ఉందన్నారు. నిరంతరాయంగా ప్రజలకు సేవ చేసే శక్తి కలిగించాలని స్వామిని కోరుకున్నట్టు చెప్పారు.

పెళ్లి దుస్తులు కొనేందుకు వెళ్లి...

ఒకే కుటుంబంలోని ఆరుగురి మృతి

- 'అనంత'లో ఘోర ప్రమాదం
- డివైడర్‌ను ఢీకొట్టి లారీ కిందకు దూసుకెళ్లిన కారు
- రేకు చొచ్చుకెళ్లి పెళ్లికొడుకు తల, మొండెం వేర్వేరు
- తండ్రి, సోదరుడి భార్య, పిల్లలూ మృతి





ప్రమాదంలో నుజ్జయిన కారు, సోదరుడి కొడుకులతో పెళ్లికొడుకు ఫిరోజ్ బాషా (ఫైల్)

ప్రమాదంలో వీరంతా చనిపోయారు

గుత్తి, మే 18: మరో పది రోజుల్లో పెళ్లి. పెళ్లి కొడుకు సహా కుటుంబ సభ్యులు రెండు కార్లలో హైదరాబాద్‌కు వెళ్లి పెళ్లి దుస్తులు కొనుగోలు చేసి తిరుగు ప్రయాణమయ్యారు. స్వస్థలానికి మరో గంటలో చేరుకోవాల్సి ఉండగా ఘోర ప్రమాదం జరిగింది. ఓ కారు వేగంగా డివైడరును ఢీకొని, అవతలి వైపు వస్తున్న లారీ కిందకు దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో పెళ్లికొడుకు సహా ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు మరణించగా, మరొకరు గాయపడ్డారు. అనంతపురం జిల్లా గుత్తి మండలం బాచుపల్లి సమీపంలో 44వ జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజామున ఈ ప్రమాదం జరిగింది. పెళ్లికొడుకు షేక్ ఫిరోజ్ బాషా(30), ఆయన తండ్రి అలీసాహెబ్(56), సోదరుడి భార్య జహీరా బాను(40), సోదరుడి పిల్లలు మహమ్మద్ అయాన్(6), మహమ్మద్ ఆమాన్(3), పిన్ని రెహనా బేగం(40) మృతిచెందారు. ఫిరోజ్ పిన్ని కొడుకు మహమ్మద్ గౌస్ తీవ్రంగా గాయపడ్డారు. అనంతపురం నగరంలోని బిందెల కాలనీకి చెందిన షేక్ ఫిరోజ్ బాషా ఐసీఐసీఐ బ్యాంక్ ఉద్యోగి. ఈ నెల 27న వివాహం జరగాల్సి ఉంది. పెళ్లి దుస్తులు కొనేందుకు శుక్రవారం తెల్లవారుజామున కుటుంబ సభ్యులు అందరూ రెండు కార్లలో హైదరాబాద్ వెళ్లారు. రాత్రి వరకూ షాపింగ్ చేసి తిరుగు ప్రయాణమయ్యారు. ఫిరోజ్ బాషా, తండ్రి అలీసాహెబ్, పిన్నమ్మ రెహనా బేగం, సోదరుడి పిల్లలు మహమ్మద్ అయాన్, ఆమాన్, వదిన జహీరా బాను, పిన్నమ్మ కొడుకు మహమ్మద్ గౌస్ ఒక కారులో ఎక్కారు. మరో కారులో ఫిరోజ్ బాషా తల్లి, ఆమె కూతురు, అల్లుడు, మరో ఇద్దరు బయలుదేరారు. వీరు గంట ముందుగానే అనంతపురానికి చేరుకున్నారు. ఫిరోజ్, ఇతర కుటుంబ సభ్యులు ప్రయాణిస్తున్న కారు తెల్లవారుజామున గుత్తి మండలం బాచుపల్లి వద్దకు రాగానే డ్రైవింగ్ చేస్తున్న మహమ్మద్ గౌస్ నిద్ర మత్తు కారణంగా అదుపు తప్పింది. డివైడరును ఢీకొని, అవతలి వైపున లారీ కిందకు దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో కారు నుజ్జునుజ్జయ్యింది. లారీ మడ్‌గార్డ్ రేకు చొచ్చుకెళ్లడంతో ఫిరోజ్ తల మొండెం నుంచి వేరైంది. ప్రమాద స్థలంలోనే ఆయనతో సహా నలుగురు మృతిచెందారు. డ్రైవింగ్ చేసిన మహమ్మద్ గౌస్ చికిత్స పొందుతున్నారు. ఫిరోజ్ తండ్రి అలీసాహెబ్ గుజరీ వ్యాపారి. ఆయనకు ఇద్దరు కుమారులు, ఒక కూతురు. పెద్ద కుమారుడు, కుమార్తెకు పెళ్లిళ్లు అయ్యాయి. పెద్దకొడుకు రెండేళ్ల క్రితం మృతిచెందాడు. ఇప్పుడు కారు ప్రమాదంలో అలీసాహెబ్‌తో పాటు మిగిలిన ఒక్క కొడుకు, వితంతువైన పెద్ద కోడలు, ఆమె ఇద్దరు కుమారులు ప్రాణాలు కోల్పోయారు.

కూలిన బతుకులు

- వెంచర్ ముఖద్వారం స్లాబ్ కూలడంతో ఇద్దరు మధ్యప్రదేశ్ కూలీల మృతి
- మరో ముగ్గురికి తీవ్ర గాయాలు

కూడేరు, మే 18: పొట్టకూటి కోసం మధ్యప్రదేశ్ నుంచి వచ్చిన ఇద్దరు భవన నిర్మాణ కార్మికులు.. వెంచర్ ముఖద్వారం స్లాబ్ వేస్తుండగా ప్రమాదంలో మరణించారు. పిల్లర్లు కూలిపోవడంతో కాంక్రీట్‌లో కడ్డీల మధ్య ఇరుక్కుపోయి ఊపిరాడక అక్కడికక్కడే మృతి చెందారు. అనంతపురం జిల్లా కూడేరు మండలం గొట్కూరు గ్రామ సమీపంలో ఈ ఘటన జరిగింది. శనివారం భవ్యశ్రీ వెంచర్‌లో మధ్యప్రదేశ్‌కు చెందిన ఐదుగురు, అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం మండలం కొర్రపాడుకు చెందిన 20 మంది కూలీలు పనిచేస్తున్నారు. ముఖద్వారం స్లాబ్ వేస్తుండగా ఒక వైపు ఉన్న పిల్లర్లు కూలిపోయాయి. దీంతో పైన ఉన్న మధ్యప్రదేశ్ కూలీలు పూరన్‌సింగ్ (27), హన (26) కాంక్రీట్‌లో కడ్డీల మధ్య ఇరుక్కుపోయి ఊపిరాడక మృతిచెందారు. మరో ముగ్గురు కూలీలు మధ్యప్రదేశ్‌కు చెందిన తీహరూ, కొర్రపాడుకు చెందిన ఆంజనేయులు, నాగరాజు తీవ్రంగా గాయపడ్డారు. వారిని వెంటనే 108 వాహనంలో అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాంక్రీట్ వి ఽక్చర్ మధ్య ఇరుక్కుపోయిన కూలీలను బయటకు తీయడానికి యంత్రాలను ఉపయోగించాల్సి వచ్చింది. పిల్లర్లు నాసిరకంగా నిర్మించినందు వల్లే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పిల్లర్లకు చిన్న కడ్డీలు వినియోగించారని, దీంతో స్లాబ్ పైభాగం బరువై పిల్లర్లు కూలిపోయాయని అన్నారు. పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాలను అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మిచౌంగ్ తుఫాన్ ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల

అమరావతి, మే 18(ఆంధ్రజ్యోతి): గతేడాది డిసెంబరులో సంభవించిన మిచౌంగ్ తుఫాన్ వల్ల పంట నష్టపోయిన రైతులకు రూ.442.35కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ సొమ్మును ప్రభుత్వం ఎట్టకేలకు విడుదల చేసింది. ఇందులో వ్యవసాయ పంటల నష్టానికి రూ.391.31 కోట్లు, ఉద్యాన పంటల నష్టానికి రూ.51.04 కోట్లు బాధిత రైతులకు చెల్లించనున్నట్లు విపత్తుల నిర్వహణ సంస్థ తాజాగా విడుదల చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది. రెండు రోజుల్లో రైతుల ఖాతాలకు సొమ్మును జమ చేయనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఇన్‌పుట్ సబ్సిడీ చెల్లింపులకు మార్చి 6న సీఎం జగన్ బటన్ నొక్కిన విషయం తెలిసిందే.

ఏపీఈఏపీసెట్‌కు 94.13% హాజరు

- పరీక్ష రాసిన విద్యార్థులు 29,543 మంది

జేఎన్టీయూకే, మే 18: ఏపీఈఏపీసెట్-2024 ఆన్‌లైన్ ప్రవేశపరీక్ష ఏపీ, హైదరాబాద్‌లోని 49 ప్రాంతీయ కేంద్రాల్లో శనివారం ప్రశాంతంగా జరిగినట్లు సెట్ ఛైర్మన్, వీసీ ప్రొఫెసర్ జీవీఆర్ ప్రసాదరాజు తెలిపారు. ఇంజనీరింగ్ విభాగంలో ప్రవేశాల కోసం ఉదయం నిర్వహించిన పరీక్షకు 31,386 మందికి గాను 29,543 (94.13%) మంది విద్యార్థులు హాజరయ్యారని వివరించారు. 1,843 మంది గైర్హాజరయ్యారని చెప్పారు. ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించిన ప్రవేశ పరీక్షలు 23వ తేదీ వరకూ కొనసాగుతాయని పేర్కొన్నారు.

22న అల్పపీడనం

వాయుగుండంగా మారుతుందని అంచనా

- భూ ఉపరితలం నుంచి వాయుగుండం వైపు పొడిగాలులు
- ఆ కారణంతో 23 నుంచి 25 వరకు ఎండలు తీవ్రం

విశాఖపట్నం, అమరావతి, మే 18(ఆంధ్రజ్యోతి): ఈనెల 22న నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుంది. ఇది తొలుత ఈశాన్యంగా పయనించి 24వ తేదీ నాటికి మధ్య బంగాళాఖాతంలోకి ప్రవేశించి అక్కడ వాయుగుండంగా బలపడుతుందని వాతావరణ శాఖ తెలిపింది. ఆ తర్వాత మరింత బలపడుతుందా? బలహీనపడుతుందా? అన్నదానిపై స్పష్టత ఇవ్వలేదు. భూ ఉపరితలం నుంచి అల్పపీడనం/వాయుగుండం వైపు పొడిగాలులు వీస్తాయని, ఆ ప్రభావంతో కోస్తా, రాయలసీమల్లో ఈనెల 23 నుంచి ఎండ తీవ్రత పెరిగి గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేశారు. కోస్తాలో 25వ తేదీ వరకు వేడి వాతావరణం ఉంటుందన్నారు. దక్షిణ అండమాన్ సముద్రం, ఆగ్నేయ బంగాళాఖాతం, నికోబార్ దీవుల్లోకి రానున్న 48 గంటల్లో నైరుతి రుతుపవనాలు ప్రవేశించనున్నాయి. ఆ తరువాత 2 రోజుల్లో అల్పపీడనం ఏర్పడి వాయుగుండంగా మారే క్రమంలో నైరుతి రుతుపవనాలు బంగాళాఖాతంలోని అనేక ప్రాంతాల్లోకి విస్తరించే అవకాశం ఉందని విశ్లేషిస్తున్నారు. ఈనెల 31కల్లా కేరళను నైరుతి రుతుపవనాలు తాకుతాయని వాతావరణ శాఖ ప్రకటించింది. అయితే, జూన్ ఒకటినే కేరళను రుతుపవనాలు తాకుతాయని ప్రైవేటు వాతావరణ సంస్థ స్కైమెట్ తెలిపింది. పసిఫిక్ మహా సముద్రంలో బలమైన ఎల్‌నినో బలహీనపడి ఈ నెలాఖరుకు తటస్థ పరిస్థితుల్లోకి మారుతుందని, ఆగస్టు నాటికి లానినాగా బలపడుతుందని అంతర్జాతీయ వాతావరణ సంస్థలు అంచనా వేశాయి. అయితే, ఆ అంచనాల కంటే ఆలస్యంగా లానినా అభివృద్ధి చెందుతుందని స్కైమెట్ పేర్కొంది.

మరో మూడు రోజులు వర్షాలు..

తమిళనాడులో ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. దీని నుంచి కర్ణాటక, రాయలసీమ, తెలంగాణ మీదుగా దక్షిణ ఛత్తీస్‌గఢ్ వరకు ఉపరితల ద్రోణి విస్తరించింది. ఆ ప్రభావంతో కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల శనివారం వర్షాలు కురిశాయి. రానున్న 24 గంటల్లో రాయలసీమలో పలుచోట్ల, కోస్తాలో చెదురుమదురుగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఆ తరువాత మూడు రోజుల్లో కోస్తా, రాయలసీమల్లో అక్కడక్కడా వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఉపరితల ఆవర్తనం, ద్రోణి ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా మరో మూడు రోజులు అక్కడక్కడ పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ఆదివారం శ్రీసత్యసాయి, కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి, శ్రీకాకుళం, మన్యం, అనకాపల్లి, కాకినాడ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కోనసీమ, ఏలూరు, కృష్ణా, నెల్లూరు, కర్నూలు, నంద్యాల, అనంతపురం జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి వర్షాలు, పిడుగులు పడే అవకాశం ఉందని తెలిపింది. అయితే, శ్రీకాకుళం, విజయనగరం, మన్యం జిల్లాల్లోని 30 మండలాల్లో వడగాడ్పులు వీచే అవకాశమూ ఉందని హెచ్చరించింది. రాష్ట్రంలోని 62 ప్రాంతాల్లో శనివారం పిడుగులతో కూడిన వర్షాలు పడ్డాయి. పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలిలో 67.7, ప్రకాశం జిల్లా కురిచేడులో 40.5, పల్నాడు జిల్లా దాచేపల్లి, సత్యసాయి జిల్లా బత్తలపల్లిలో 40, పల్నాడు జిల్లా నూజెండ్లలో 39.5, అల్లూరి జిల్లా పాడేరులో 34.2, నంద్యాల జిల్లా రుద్రవరం, అనంతపురం జిల్లా రాయదుర్గంలో 27.5, కృష్ణా జిల్లా మచిలీపట్నంలో 27 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. కడప జిల్లా ఖాజీపేటలో 39.9, నెల్లూరు జిల్లా రాపూరులో 39.7, సూళ్లూరుపేటలో 39.6, నంద్యాల జిల్లా చాగలమర్రిలో 39.4 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

ఆంధ్రజ్యోతి
నవ్య | దృశ్యం
ఆదివారం • 19 మే 2024

దశాబ్దాల కలయిక

అభిమానులు ఎంతగానో ఎదురుచూసిన కాంబినేషన్స్...
ఇక కుదరదేమో అని ఆశలు వదులుకున్న కలయికలు...
అభిమాన కాంబోలో ఇక మరో సినిమా రాదేమో అనే సంశయాలు...
అన్నింటినీ పటాపంచలు చేస్తూ దశాబ్దాలుగా సాధ్యం కాని కాంబినేషన్లను 2024 సెట్ చేసింది.



32 ఏళ్లు



రజనీకాంత్, అమితాబ్‌బచ్చన్... ఇద్దరు దేశం గర్వించదగ్గ నటులు. ఈ ఇద్దరూ స్ర్కీన్ పంచుకుంటే చూడాలని ఎవరికి ఉండదు! 32 ఏళ్ల క్రితం ఈ కాంబోలో 'హమ్' అనే హిందీ చిత్రం వచ్చింది. ఆ తర్వాత మరోసారి వీరి కాంబినేషన్‌లో సినిమా కోసం చాలా ప్రయత్నాలు జరిగినా అవేవీ కార్యరూపం దాల్చలేదు. మళ్లీ ఇన్నాళ్లకు 'వేట్టయాన్' చిత్రంతో ఇద్దరూ కలసి అభిమానుల ముందుకొస్తున్నారు. 'జై భీమ్' దర్శకుడు టీజే జ్ఞానవేల్ తెరకెక్కిస్తున్నారు. ఇటీవలే అమితాబ్ ఈ చిత్రం షూటింగ్‌లో పాల్గొన్నారు. ఇందులో రజనీకాంత్ పోలీసాఫీసర్‌గా కనిపిస్తుండగా అమితాబ్ నెగెటివ్ షేడ్స్ ఉన్న పాత్రను పోషిస్తున్నారని సమాచారం. గతంలో వీరిద్దరి కాంబినేషన్‌లో 'అంధాకానూన్', 'గిరాఫ్తార్' చిత్రాలు వచ్చాయి. 'వేట్టయాన్'లో రానా, ఫహాద్ ఫాజిల్ కీలకపాత్రలు పోషిస్తున్నారు.

35 ఏళ్లు

దక్షిణ భారత చిత్ర పరిశ్రమలో ఎవర్‌గ్రీన్ కాంబినేషన్ అంటే కమల్‌హాసన్, మణిరత్నందే అని చెప్పాలి. వీరిద్దరి కలయికలో వచ్చిన ఒకే ఒక చిత్రం 'నాయకుడు'. ఆ సినిమా ఓ సంచలనం. ఈ కాంబినేషన్లో అలాంటి మరో సినిమా కోసం అప్పటి నుంచి ప్రేక్షకులకు ఎదురుచూస్తూనే ఉన్నారు. 35 ఏళ్లు గడిచిపోయాయి 'నాయకుడు' విడుదలైన సమయంలో మూడు పదుల్లో ఉన్నవాళ్లు ఇప్పుడు వృద్ధులయ్యారు. కానీ మణిరత్నం-కమల్ కాంబినేషన్‌లో మరో సినిమా మాత్రం మొదలవ్వలేదు. 'ఇది అయ్యే పనికాదులే' అని ఫ్యాన్స్ కూడా ఆశలు వదిలేసుకున్న సమయంలో అనూహ్యంగా మణిరత్నం, కమల్‌హాసన్ కలసి ఓ సినిమా ప్రకటించారు. 'థగ్‌లైఫ్' అనే టైటిల్‌ను ఖరారు చేసి శరవేగంగా చిత్రీకరణ కూడా చేస్తున్నారు. ఇన్నాళ్లూ తమ కలయికలో సినిమా రాకపోవడానికి కారణం కేవలం సరైన కథ కుదరకపోవడమేనని వారు చెబుతున్నారు. ఒకరికి నచ్చిన కథ మరొకరికి నచ్చకపోవడం, ఇద్దరికీ నచ్చినా ఆ ప్రాజెక్ట్‌ను పట్టాలెక్కించలేకపోవడం వల్ల ఇన్నాళ్లుగా సినిమా చేయలేకపోయామనేది వారి మాట. 'పొన్నియిన్ సెల్వన్' చిత్రంలో కమల్‌హాసన్‌ను తీసుకోవాలనుకున్నా కుదరలేదని మణిరత్నం చెప్పారు. లేట్ అయినా లేటెస్ట్‌గా వస్తున్న ఈ సినిమాను కమల్‌హాసన్ సొంత ప్రొడక్షన్‌లోనే భారీ బడ్జెట్‌తో తెరకెక్కిస్తున్నారు. శింబు, జయం రవి, త్రిష ప్రధాన తారాగణం. ఏ. ఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు.

25 ఏళ్లు

దిగ్గజ సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్, టాప్ కొరియోగ్రాఫర్ ప్రభుదేవా కలయికలో వచ్చిన 'ప్రేమికుడు' చిత్రం అప్పట్లో హుషారైన గీతాలతో హోరెత్తించిన విషయం మర్చిపోలేం. వారిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన ఐదు చిత్రాలు మ్యూజికల్ బ్లాక్‌బస్టర్స్‌గా నిలిచాయి. 'మెరుపు కలలు' చిత్రంతో మరోసారి వారిద్దరూ మ్యాజిక్ రిపీట్ చేశారు. ఆ సినిమా విడుదలై 25 ఏళ్లు దాటింది. ఇన్నాళ్లకు మళ్లీ రెహమాన్, ప్రభుదేవా కలయిక కుదరింది. మనోజ్ ఎన్ఎస్ దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతోంది. ఈ చిత్రానికి వీరిద్దరి పేర్లు కలసి వచ్చేలా 'ఏఆర్ఆర్‌పీడీ' అనే వర్కింగ్ టైటిల్ పెట్టారు. నృత్యం, సంగీతం ప్రధానంగా రూపొందుతోన్న చిత్రమిది.




28 ఏళ్లు



'ఇండియన్ (తెలుగులో 'భారతీయుడు')' మూవీ అప్పట్లోనే పాన్ ఇండియా స్థాయిలో విజయం సాధించింది. అవినీతి పరులను అంతం చేసే సేనాపతి పాత్రలో కమల్ నటనకు, శంకర్ దర్శకత్వ ప్రతిభకు ప్రేక్షకులు నీరాజనం పట్టారు. 'ఇండియన్' తర్వాత దాదాపు మూడు దశాబ్దాల వరకూ వీరిద్దరూ మళ్లీ కలసి ఒక్క సినిమా కూడా చేయలేకపోయారు. ఇప్పుడు కూడా తమ కాంబినేషన్‌లో వచ్చిన 'ఇండియన్' చిత్రం సీక్వెల్‌తోనే వస్తున్నారు. 2017లో 'ఇండియన్ 2' చిత్రంపై అధికారిక ప్రకటన వచ్చింది. 2019లో షూటింగ్ మొదలుపెట్టారు. తర్వాత కొవిడ్ వల్ల రెండేళ్లు బ్రేక్ వచ్చింది. సెట్‌లో ప్రమాదం జరిగి సహాయ దర్శకుడు చనిపోవడం ఇలా ఎన్నో అవాంతరాలను దాటుకొని 'ఇండియన్ 2' చిత్రం షూటింగ్‌ను ఎట్టకేలకు పూర్తి చేశారు. ఇంకో రెండునెలల్లో సినిమా విడుదలవుతోంది.

20 ఏళ్లు



నటులుగా 50 సినిమాలు చేయడమే గొప్ప అలాంటిది మోహన్‌లాల్, శోభన జంట ఏకంగా 55 సినిమాల్లో కలసి నటించారు. వారిద్దరూ స్ర్కీన్‌పై కనిపించిన ప్రతిసారీ ప్రేక్షకలోకం మంచి విజయాన్ని అందించింది. అందుకే మోహన్‌లాల్, శోభన కలసి ఇన్ని సినిమాలు చేయగలిగారు. 1985లో వచ్చిన 'అవిడతే పోలే ఇవిడెయుమ్' చిత్రంలో వారిద్దరూ కలసి తొలిసారి నటించారు. చివరగా 1994లో వచ్చిన 'తేన్మావిన్ కొంబాట్'లో కలసి కనిపించారు. వారిద్దరి కాంబినేషన్‌లో సినిమాలకు బ్రేక్ పడి 20 ఏళ్లు అయింది. మధ్యలో ఓ చిత్రంలో శోభన అతిథి పాత్రలో కనిపించారు కానీ మోహన్‌లాల్ సరసన హీరోయిన్‌గా నటించలేదు. మళ్లీ ఇన్నాళ్లకు వీరిద్దరూ జంటగా ఓ మలయాళ చిత్రం చేస్తున్నారు. 'ఎల్ 360' టైటిల్‌తో తెరకెక్కుతోంది. తరుణ్‌మూర్తి దర్శకత్వం వహిస్తున్నారు.

పూజా హెగ్డేకు రూ. నాలుగు కోట్లా?




ముంబైలోని కొత్త ఇంట్లోకి ఇటీవలే అడుగుపెట్టిన పూజా హెగ్డెకు ఇప్పుడు ఓ బంపర్ ఆఫర్ వచ్చింది. తమిళంలో హీరో సూర్య నటించే 44వ చిత్రంలో ఆమెను హీరోయిన్‌గా ఎంపిక చేశారు. కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో ఈ సినిమా ప్రారంభం కానుంది. ఇందులో నటించేందుకు పూజా తీసుకుంటున్న పారితోషికం ఎంతో తెలుసా? అక్షరాలా రూ. నాలుగు కోట్లు. బాపురే.. సినిమాలు లేకుండా ఇంట్లో ఖాళీగా కూర్చున్న ఈ పొడుగు కాళ్ల సుందరికి ఇంత భారీ పారితోషికమా అని ఆశ్చర్యపోకండి. అదంతే అలా కలసి వచ్చింది. తన కెరీర్‌లో ఇంత భారీ పారితోషికం తీసుకోవడం పూజాకు ఇదే ప్రథమం. ఇంతకు ముందు తమిళ సూపర్‌స్టార్ విజయ్ సరసన 'బీస్ట్' త్రంలో పూజా హీరోయిన్‌గా నటించింది కానీ ఆ సినిమా పెద్దగా ఆడలేదు. కాకపోతే ఆ చిత్రంతో తమిళనాట ఫ్యాన్ ఫాలోయింగ్ పెంచుకుంది పూజా.

ఆ నాలుగూ అలా మిస్ అయ్యాయి



'హీరామండీ' చిత్రంలో మల్లికాజాన్ పాత్రను అద్భుతంగా పోషించి మరోసారి ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నారు మనీషా కొయిరాలా. ఈమధ్య నటిగా ఆమె వెనకపడిందనే ప్రచారాన్ని తిప్పికొట్టి 'హీరామండీ'లో తన టాలెంట్ మరోసారి ప్రదర్శించారు. మనీషా పేరు చెప్పగానే '1942 .. ఏ లవ్‌స్టోరీ', 'బొంబాయి' వంటి చిత్రాలు వెంటనే గుర్తుకు వస్తాయి. కెరీర్ ఉన్నతస్థాయిలో ఉన్నప్పుడు మద్యానికి బానిస అయి, అవకాశాలు పోగొట్టుకున్న మనీషా క్యాన్సర్ బారిన పడి, కోలుకున్నారు. ఆమె చేజేతులా వదులుకున్న చిత్రాలను కరీనా కపూర్ దక్కించుకుని స్టార్ హీరోయిన్‌గా ఎదిగారని వింటే ఆశ్చర్యం కలగక మానదు. ఆ చిత్రాలు ఏమిటో చూద్దాం. క్లాసిక్ కామెడీ 'బీవీ నంబర్‌వన్'లో సల్మాన్‌ఖాన్ సరసన నటించడం కోసం జూహీ చావ్లా, ఐశ్వర్య రాయ్, రవీనా టాంటన్, మనీషా కొయిరాలా పేర్లు పరిశీలించారు. వీళ్లంతా 'నో' చెప్పడంతో చివరకు కరీనాకు ఆ అవకాశం దక్కింది. ఆ తర్వాత షారుఖ్ ఖాన్ నటించిన 'దిల్ తో పాగల్ హై' సినిమాలో నిషా పాత్రను పోషించమని దర్శకుడు యశ్ చోప్రా అడిగారు. అయితే అందులో మరో హీరోయిన్ కూడా ఉంటుందని చెప్పడంతో కనీసం కథ కూడా వినకుండానే నటించనని చెప్పేశారు మనీషా. ఈ పాత్ర కూడా కరీనా చేజిక్కించుకుంది. సినిమా పెద్ద హిట్ కావడంతో ఎందుకు వద్దన్నానా అని తర్వాత చాలా బాధ పడ్డారు మనీషా. అలాగే అమీర్ ఖాన్ నటించిన 'రాజా హిందుస్థానీ' సినిమా కూడా మిస్ అయ్యారు మనీషా. ఇందులో హీరోయిన్ పాత్రకు ఎంతో ఇంపార్టెన్స్ ఉండడంతో టాప్ హీరోయిన్లు జూహీ చావ్లా, ఐశ్వర్య రాయ్, మనీషా కొయిరాలా ను సంప్రదించారు దర్శకుడు ధర్మేష్ దర్శన్. ఎవరూ అంగీకరించలేదు. ఈ సినిమా కూడా కరీనా ఖాతాలో పడింది. శ్యామ్ బెనగల్ దర్శకత్వంలో రూపుదిద్దుకొన్న 'జుబేదా' చిత్రంలో హీరోయిన్ పాత్రకు మొదట మనీషానే సంప్రదించారు. మనోజ్ వాజ్‌పేయి సరసన నటించడానికి ఆమె వెనుకడుగు వేయడంతో కరిష్మా కపూర్‌కు ఆ ఛాన్స్ దక్కింది.






ఈ వారమే విడుదల ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు		
ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
టఫెస్ట్ ఫోర్సెస్ ఆన్ ది ఎర్త్	డాక్యూ సిరీస్	మే 22
అట్లాస్	హాలీవుడ్ మూవీ	మే 24
క్ర్యూ	హిందీ చిత్రం	మే 24
అమెజాన్ ప్రైమ్		
ద టెస్ట్ 3	వెబ్‌సిరీస్	మే 23
జీ 5		
వీర్ సావర్కర్	హిందీ చిత్రం	మే 24
డిస్నీ ప్లస్ హాట్‌స్టార్		
ది కర్దాషియన్స్ 5	వెబ్‌సిరీస్	మే 23
ద బీచ్ బాయ్స్	డాక్యుమెంటరీ మూవీ	మే 24
లయన్స్ గేట్ ప్లే		
వాంటెడ్ మాన్	హాలీవుడ్ మూవీ	మే 24
జియో సినిమా		
ఆక్వామాన్ అండ్ ద లాస్ట్ కింగ్‌డమ్	తెలుగు డబ్బింగ్	మే 21
డ్యూన్ 2	హాలీవుడ్ మూవీ	మే 21
ఆపిల్ టీవీ ప్లస్		
ట్రైయింగ్ 4	వెబ్‌సిరీస్	మే 22



అందరికీ తెలియాల్సిన చాంపియన్ కథ



కార్తీక్ ఆర్యన్ కథానాయకుడిగా నటిస్తున్న క్రీడానేపథ్య చిత్రం 'చందు ఛాంపియన్'. కబీర్‌ఖాన్ దర్శకత్వంలో సాజిద్ నడియాడ్‌వాలా నిర్మించారు. క్రీడాకారుడు మురళీ కాంత్ పేట్కర్ జీవితంలో జరిగిన వాస్తవ సంఘటనల ఆధారంగా తెరకెక్కించారు. జూన్ 14న విడుదలవుతోంది. శనివారం చిత్రబృందం గ్వాలియర్‌లో ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. సైనికుడిగా, మల్లయోధుడిగా, బాక్సర్‌గా విభిన్న పాత్రల్లో కార్తీక్ ఆర్యన్ ఒదిగిన తీరు ఆకట్టుకుంది. అనేక అడ్డంకులను దాటుకొని చందు బాక్సింగ్‌లో ఛాంపియన్‌గా ఎదిగిన తీరును ట్రైలర్ క్లుప్తంగా కళ్లకు కట్టింది. 'మురళీ కాంత్ పేట్కర్ లాంటి గొప్ప దేశభక్తుడు, సాహసి జీవితం నాకు ఎంతో స్ఫూర్తిని ఇచ్చింది. ఆయన కథను భారతీయుల ముందుకు తేవాలనుకున్నాను. ఇది ప్రతి ఒక్కరూ చూడాల్సిన చిత్రం' అని కార్తీక్ ఆర్యన్ చెప్పారు.

ఏకలవ్య కథ

మహాభారత సముద్రంలో ఏకలవ్యుని కథ ఒక చిన్న అల లాంటిది. అయినా ఏకలవ్యుడు అందరి మనసులో ముద్ర వేసుకున్నాడంటే దానికి కారణం.. పట్టుదలకి, గురుభక్తికీ ప్రతీకగా అతని పేరు నిలిచిపోవడమే.

దాసరి దర్శకత్వం.. శోభన్‌బాబు హీరో



ఏకలవ్యుడు కథ ను సినిమాగా తీయాలనే ఆలోచన దర్శకుడు దాసరి నారాయణరావుకు ఉండేది.. అంతవరకూ ఆయన ఏ పౌరాణిక చిత్రము తీయకపోవడంతో, ఆరుద్ర చెప్పిన కథ నచ్చి ఏకలవ్య తీయడానికి సన్నాహాలు ప్రారంభించారు. ఆయన దర్శకత్వంలో అప్పటికే 'రాధమ్మ పెళ్లి', 'స్వర్గం నరకం' చిత్రాలను నిర్మించిన ఎంకే మావుళ్ళ య్య, రామ తారకం, భాస్కరరావు 'ఏకలవ్య' చిత్రానికి నిర్మాతలు. ఎన్టీఆర్ తో శ్రీకృష్ణుడు, ద్రోణుడు పాత్రలను వేయించి, బాలకృష్ణతో ఏకలవ్య పాత్ర చేయించాలని వీరి ఆలోచన. రెండు పాటలు కూడా రికార్డ్ చేశారు. దాసరి సూచనపై ఎన్టీఆర్ ను కలిశారు నిర్మాతలు. ఆ సమయంలో 'దాన వీర శూర కర్ణ' చిత్ర నిర్మాణ సన్నాహాల్లో ఎన్టీఆర్ బిజీగా ఉన్నారు. వీళ్లు వచ్చిన విషయం చెప్పగానే ' మేము ఒక పౌరాణిక చిత్రం చేస్తున్నప్పుడు మరో సినిమా గురించి ఆలోచించం' అని చెప్పారాయన. పోనీ బాలకృష్ణ డేట్స్ ఇవ్వండని నిర్మాతలు అభ్యర్థించారు 'వారు ఇప్పుడు చదువుకుంటున్నారు. సెలవుల్లో మాత్రమే మాకు సినిమాలు చేస్తున్నారు. ఇప్పట్లో బాలయ్యను బయట నిర్మాతలకు ఇవ్వదలుచుకోలేదు' అని చెప్పేశారు ఎన్టీఆర్.

ఆ తర్వాత హీరో కృష్ణ దగ్గరికి వెళ్లి డేట్స్ అడుగుదామనుకున్నారు ఈ నిర్మాతలు. కానీ ఆ సమయంలో ఆయన చాలా బిజీగా ఉండటంతో ఆలోచన మార్చుకుని శోభన్ బాబు దగ్గరికి వెళ్లారు. ఆయన చాతీ మీద వెంట్రుకలు బాగా ఉంటాయి. ఏకలవ్యుని గెటప్ కోసం టాప్ లెస్ గా కనిపించాలి కనుక ఆ వెంట్రుకలు తీసేయాలి. ప్రతిరోజూ అదో పెద్ద పని కనుక శోభన్ బాబు ఆ సినిమా చేయమన్నారు. అయితే నిర్మాతలు అభ్యర్థించడంతో చివరికి అంగీకరించారు. హీరో ఓకే కావడంతో హీరోయిన్‌గా ఎవరిని తీసుకోవాలా అని ఆలోచించి జయప్రదను సంప్రదించారు. ఆమె పారితోషికం బాగా డిమాండ్ చేసినా దాసరి డైరెక్టర్ అని తెలియడంతో రూ. 40 వేలకు నటించడానికి ఓకే చెప్పారు. శ్రీకృష్ణుని పాత్రకు రామకృష్ణ ను ఎంపిక చేశారు. షూటింగ్ ప్రారంభించే ముందు బడ్జెట్ వేశారు. కె.రాఘవేంద్రరావు తొలి సినిమా 'బాబు' అప్పటికి రూ 18 లక్షలతో తొలికాపీతో సిద్ధమైంది. అందులోనూ శోభన్ బాబు హీరో. అదే చాలా ఎక్కువ బడ్జెట్ అని అనుకునేవారు. ఏకలవ్య బడ్జెట్ దాన్ని దాటే సూచనలు కనిపించడంతో నిర్మాతలు ఆలోచనలో పడ్డారు. ఇలా చర్చల్లో ఉన్న సమయంలోనే వేరే సినిమా అర్జెంటుగా చేయాల్సి రావడంతో దాసరి ఏకలవ్య సినిమా పక్కన పెట్టేశారు చివరకు హీరో కృష్ణతో సహజకవి ఎమ్మెస్‌రెడ్డి 'ఏకలవ్య' చిత్రాన్ని నిర్మించి విడుదల చేశారు.

మహేశ్‌కు విలన్ ఇతనేనా?



మహేశ్, దర్శక ధీరుడు రాజమౌళి కాంబినేషన్‌లో రూపుదిద్దుకొనే చిత్రం ప్రీ ప్రొడక్షన్ పనులు శరవేగంతో జరుగుతున్నాయి. యాక్షన్ అడ్వంచరెస్ కథాంశంతో రూపుదిద్దుకొనే ఈ సినిమాను ఏ లొకేషన్స్‌లో షూట్ చేయాలో రాజమౌళి ఫిక్స్ అయినట్లు సమాచారం. ఈ చిత్రానికి 'మహారాజ్' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. నటీనటుల ఎంపిక కూడా జరుగుతోంది. ఇందులో విలన్‌గా మలయాళ నటుడు, దర్శకుడు పృథ్వీరాజ్ సుకుమారన్ నటించనున్నారనే వార్త ఫిల్మ్ నగర్‌లో ప్రచారంలో ఉంది. ఇప్పటికే రాజమౌళి పృథ్వీరాజ్‌ను సంప్రదించారనే, ఆయన వెంటనే ఓకే చేశారనీ చెబుతున్నారు. మలయాళంలో పృథ్వీరాజ్ స్టార్ హీరో కనుక అక్కడ తమ సినిమాకు ఆయన ఇమేజ్ ఎంతో హెల్ప్ అవుతుందని రాజమౌళి టీమ్ భావిస్తోంది. అయితే దీనిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. 'సలార్' చిత్రంలో అద్భుతంగా నటించి తెలుగు ప్రేక్షకుల్ని ఆకట్టుకున్న పృథ్వీరాజ్ మహేశ్ చిత్రంలో విలన్‌గా నటిస్తే మామూలుగా ఉండదని అంటున్నారు.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
diksuchi@andhrajyothy.com
విజయవాడ ● ఆదివారం 19 మే 2024

ఎన్ఐఈపీఐడీలో ప్రోగ్రామ్‌లు

సికింద్రాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ద ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ ఇంటెలెక్చువల్ డిజెబిలిటీస్(ఎన్ఐఈపీఐడీ)- డిప్లొమా, డీఈడీ, బీఈడీ, ఎంఈడీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. సికింద్రాబాద్ సహా కోల్‌కతా, నవీ ముంబై, నోయిడా, సీఆర్‌సీ సెంటర్లలో ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. డిప్లొమా వ్యవధి ఏడాది. మిగిలిన ప్రోగ్రామ్‌ల వ్యవధి రెండేళ్లు. డీఈడీ, డిప్లొమా ప్రోగ్రామ్‌లకు కౌన్సెలింగ్, ఇంటర్వ్యూల ద్వారా; బీఈడీ, ఎంఈడీ ప్రోగ్రామ్‌లకు ఎంట్రెన్స్ టెస్ట్, కౌన్సెలింగ్‌ల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. ప్రోగ్రామ్‌లన్నింటికీ ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది. ఆసక్తి గల అభ్యర్థులు ఆయా సెంటర్లకు దరఖాస్తు చేసుకోవాలి. పూర్తి వివరాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

సికింద్రాబాద్ సెంటర్‌లోని ప్రోగ్రామ్‌లు - సీట్లు
- డిప్లొమా ఇన్ ఎడ్యుకేషన్(స్పెషల్ ఎడ్యుకేషన్-ఐడీడీ) - 38 సీట్లు
- డిప్లొమా - ఎర్లీ చైల్డ్‌హుడ్ స్పెషల్ ఎడ్యుకేషన్ 33 సీట్లు, ఒకేషనల్ రీహాబిలిటేషన్ 33 సీట్లు

కోల్‌కతా, నవీ ముంబై సెంటర్లలోని ప్రోగ్రామ్‌లు - సీట్లు
- ఎంఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్(ఐడీ) - నవీ ముంబైలో 15 సీట్లు; కోల్‌కతాలో 12 సీట్లు
- బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్(ఐడీ) - నవీ ముంబైలో 22 సీట్లు; కోల్‌కతాలో 33 సీట్లు
- డీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ - నవీ ముంబైలో 35 సీట్లు; కోల్‌కతాలో 35 సీట్లు
- డిప్లొమా(ఒకేషనల్ రీహాబిలిటేషన్) - నవీ ముంబైలో 25 సీట్లు; కోల్‌కతాలో 30 సీట్లు
- డిప్లొమా(ఎర్లీ చైల్డ్‌హుడ్ స్పెషల్ ఎడ్యుకేషన్) - నవీ ముంబైలో 30 సీట్లు ఉన్నాయి.

నోయిడా సెంటర్: డీఈడీ(స్పెషల్ ఎడ్యుకేషన్) ప్రోగ్రామ్‌లో 35 సీట్లు ఉన్నాయి.

సీఆర్‌సీ సెంటర్లు
- దావణ్‌గిరి సీఆర్‌సీలో డీఈడీ(స్పెషల్ ఎడ్యుకేషన్)లో ఐడీడీ 35 సీట్లు; హెచ్ఐ 35 సీట్లు ఉన్నాయి.
- నెల్లూరు సీఆర్‌సీలో డీఈడీ(స్పెషల్ ఎడ్యుకేషన్)లో హెచ్ఐ 35 సీట్లు ఉన్నాయి.
- రాజ్‌నంద్‌గావ్ సీఆర్‌సీలో డీఈడీ(స్పెషల్ ఎడ్యుకేషన్)లో ఐడీడీ ప్రోగ్రామ్ ఉంది.

అర్హత: బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్‌నకు ద్వితీయ శ్రేణి మార్కులతో బీఏ/బీకాం/బీఎస్సీ ఉత్తీర్ణులై ఉండాలి. ఎంఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్‌లో ప్రవేశానికి బీఈడీ(స్పెషల్ ఎడ్యుకేషన్/జనరల్ ఎడ్యుకేషన్) లేదా ఇంటిగ్రేటెడ్ బీఏ/బీకాం/బీఎస్సీ-బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ చేసి ఉండాలి. డిప్లొమా, డిప్లొమా ఇన్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్‌లకు ద్వితీయ శ్రేణి మార్కులతో ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలి.

ఎంట్రెన్స్ ఎగ్జామ్ వివరాలు: ఇది ఆబ్జెక్టివ్ టెస్ట్. ఇందులో జనరల్ మెంటల్ ఎబిలిటీ, జనరల్ నాలెడ్జ్, జనరల్ ఇంగ్లీష్, బ్రాడ్ యాస్పెక్ట్స్ ఆఫ్ జనరల్ ఎడ్యుకేషన్ అండ్ స్పెషల్ ఎడ్యుకేషన్ అంశాల నుంచి 100 ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం మార్కులు 100. పరీక్ష సమయం గంటన్నర.



- **దరఖాస్తు ఫీజు:** డీఈడీ, డిప్లొమా ప్రోగ్రామ్‌లకు రూ.200(దివ్యాంగులకు ఫీజు మినహాయింపు వర్తిస్తుంది); నవీ ముంబైలో ఎంఈడీ, బీఈడీ ప్రోగ్రామ్‌లకు జనరల్, ఓబీసీ అభ్యర్థులు రూ.1300 దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.900 చెల్లించాలి. కోల్‌కతా సెంటర్లో ఎంఈడీ ప్రోగ్రామ్‌నకు జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు రూ.1500 దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.1100; బీఈడీ ప్రోగ్రామ్‌నకు జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు రూ.1300 దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.900 చెల్లించాలి.
- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** సికింద్రాబాద్, కోల్‌కతా, సీఆర్‌సీ సెంటర్లు-జూన్ 14; నవీ ముంబై సెంటర్-ఎంఈడీ, బీఈడీ ప్రోగ్రామ్‌లకు జూలై 26, డీఈడీ, డిప్లొమా ప్రోగ్రామ్‌లకు జూన్ 13; నోయిడా సెంటర్- జూన్ 5
- **ఎంట్రెన్స్ టెస్ట్ తేదీలు:** కోల్‌కతా సెంటర్ - జూన్ 30; నవీ ముంబై - ఆగస్టు 10
- **వెబ్‌సైట్:** www.niepid.nic.in

తెలంగాణ ఐటీఐ కోర్సుల్లో ప్రవేశాలు

హైదరాబాద్‌లోని కమిషనర్ ఆఫ్ ఎంప్లాయిమెంట్ అండ్ ట్రెయినింగ్ - ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్ ఐటీఐ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ సంస్థల్లో అడ్మిషన్స్ ఇస్తారు. ఎన్‌సీవీటీ విధానంలో కోర్సులు ఆగస్టులో ప్రారంభమవుతాయి. ట్రేడ్‌ను అనుసరించి కోర్సు వ్యవధి ఏడాది/రెండేళ్లు. అభ్యర్థులు తాము ఎంచుకొన్న ఐటీఐ సంస్థలు, ట్రేడ్‌ల ప్రాధాన్యక్రమాన్ని దరఖాస్తులో సూచించాలి. అకడమిక్ మెరిట్, రిజర్వేషన్ నిబంధనల ఆధారంగా సీట్ల కేటాయింపు ఉంటుంది. క్రాఫ్ట్‌మన్ ట్రెయినింగ్ స్కీమ్ కింద శిక్షణ ఇస్తారు. కోర్సులో భాగంగా ప్రాక్టికల్ ట్రెయినింగ్, థియరిటికల్ ట్రెయినింగ్, ట్రేడ్ థియరీ, వర్క్‌షాప్ క్యాలిక్యులేషన్ & సైన్స్, ఇంజనీరింగ్ డ్రాయింగ్ ఉంటాయి. ఎంప్లాయిబిలిటీ స్కిల్స్ నేర్పిస్తారు. లైబ్రరీ సౌకర్యం ఉంది. ఇతర కరిక్యులర్ యాక్టివిటీస్ కూడా ఉంటాయి. ఆసక్తిగల అభ్యర్థులు ఆన్‌లైన్ దరఖాస్తుతోపాటు వెబ్ ఆప్షన్స్ సబ్మిట్ చేయాలి.



ట్రేడ్‌లు: కార్పెంటర్, కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్, డెంటల్ లేబరేటరీ ఎక్విప్‌మెంట్ టెక్నీషియన్, డ్రాఫ్ట్స్‌మన్(సివిల్, మెకానికల్), డ్రెస్ మేకింగ్, ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రానిక్స్ మెకానిక్, ఫిట్టర్, ఫౌండరీమన్, హెల్త్ శానిటరీ ఇన్‌స్పెక్టర్, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్(కెమికల్ ప్లాంట్), ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్, లేబరేటరీ అసిస్టెంట్(కెమికల్ ప్లాంట్), లిథో ఆఫ్‌సెట్ మెకానిక్ మైండర్, మెషినిస్ట్(గ్రైండర్), మెషినిస్ట్, మెకానిక్(మోటార్ వెహికిల్, రిఫ్రిజిరేషన్ అండ్ ఎయిర్ కండిషనింగ్, ఆటోబాడీ పెయింటింగ్ 20, ఆటో బాడీ రిపేర్, డీజిల్), ప్లాస్టిక్ ప్రాసెసింగ్ ఆపరేటర్, ప్లంబర్, స్యూయింగ్ టెక్నాలజీ, షీట్ మెటల్ వర్కర్, స్టెనోగ్రాఫర్ అండ్ సెక్రటేరియల్ అసిస్టెంట్(ఇంగ్లీష్), టర్నర్, వెల్డర్, వైర్‌మన్.

అర్హత: ట్రేడ్‌ను అనుసరించి ఎనిమిదోతరగతి/పదోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. 2024 ఆగస్టు 1 నాటికి అభ్యర్థి వయసు 14 ఏళ్లు నిండి ఉండాలి. గరిష్ఠ వయోపరిమితి నిబంధన లేదు.

ముఖ్య సమాచారం
- **దరఖాస్తు ఫీజు:** రూ.100
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 10
- **వెబ్‌సైట్:** https://iti.telangana.gov.in

శ్రీ సిటీ ఐఐఐటీలో పీహెచ్‌డీ

చిత్తూరు, శ్రీసిటీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐఐఐటీ) - పీహెచ్‌డీ (మాన్‌సూన్ 2024) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఫుల్ టైమ్, పార్ట్ టైమ్ విధానాల్లో ప్రోగ్రామ్ అందుబాటులో ఉంది. ఫుల్ టైమ్ ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. గరిష్ఠంగా ఆరేళ్లలో పూర్తిచేయాల్సి ఉంటుంది. పార్ట్ టైమ్ ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. గరిష్ఠంగా ఏడేళ్లలో పూర్తిచేయాల్సి ఉంటుంది. ఫుల్ టైమ్ ప్రోగ్రామ్‌లో చేరిన అభ్యర్థులకు నిబంధనల ప్రకారం ఫెలోషిప్ ఇస్తారు.



స్పెషలైజేషన్‌లు: కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, మేథమెటిక్స్ అండ్ డేటా సైన్స్


అర్హత: సీఎస్ఈ, ఈసీఈ విభాగాల్లో బీఈ/బీటెక్ ఉత్తీర్ణతతోపాటు ఎంఈ/ఎంటెక్/ఎంఎస్ రీసెర్చ్ లేదా ఎమ్మెస్సీ(కంప్యూటర్స్/ఎలక్ట్రానిక్స్/ఫిజిక్స్) పూర్తిచేసి ఉండాలి. మేథమెటిక్స్ అండ్ డేటా సైన్స్ విభాగానికి మాస్టర్స్(స్టాటిస్టిక్స్/మేథమెటిక్స్) ఉత్తీర్ణులై ఉండాలి. డిగ్రీ, పీజీ స్థాయుల్లో ప్రథమ శ్రేణి మార్కులు తప్పనిసరి. కనీసం 8 సీజీపీఏ స్కోర్‌తో (బీఈ/బీటెక్)(సీఎస్ఈ/ఈసీఈ) ఉత్తీర్ణులైన అభ్యర్థులు నేరుగా పీహెచ్‌డీలో చేరవచ్చు. వీరు సంబంధిత రీసెర్చ్ పేపర్స్ సబ్మిట్ చేయాల్సి ఉంటుంది. పార్ట్ టైమ్ ప్రోగ్రామ్‌నకు ఐటీ ప్రొఫెషనల్స్; డీఆర్‌డీఓ, ఇస్రో తదితర సంస్థల్లో పనిచేస్తున్న రీసెర్చ్ సైంటిస్ట్‌లు అప్లయ్ చేసుకోవచ్చు. కనీసం మూడేళ్ల అనుభవం ఉండాలి. పీహెచ్‌డీ అడ్మిషన్ కమిటీ రికమండ్ చేసిన అభ్యర్థులు కూడా అర్హులే.

ఎంపిక: ఫుల్ టైమ్ ప్రోగ్రామ్‌నకు రాత పరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూల ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. రాత పరీక్ష సిలబస్‌ను వెబ్‌సైట్‌లో చూడవచ్చు. పార్ట్ టైమ్ ప్రోగ్రామ్‌నకు టెక్నికల్ ఇంటర్వ్యూ, రీసెర్చ్ ప్రపోజల్ ప్రజంటేషన్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

ముఖ్య సమాచారం
- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.500; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.200
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 20
- **వెబ్‌సైట్:** iiits.ac.in

పీవీ నరసింహారావు వెటర్నరీ వర్సిటీలో పీజీ, పీహెచ్‌డీ

హైదరాబాద్, రాజేంద్రనగర్‌లోని పీవీ నరసింహారావు తెలంగాణ వెటర్నరీ యూనివర్సిటీ(పీవీఎన్‌టీవీయూ)- ఎంవీఎస్సీ, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి విడివిడిగా నోటిఫికేషన్‌లు విడుదల చేసింది. ఇవి 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించిన నోటిఫికేషన్‌లు. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. మొత్తం సీట్లలో 85 శాతం సీట్లను తెలంగాణ అభ్యర్థులకు ప్రత్యేకించారు. మిగిలిన 15 శాతం సీట్లకు రెండు తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు పోటీపడవచ్చు.



ఎంవీఎస్సీ

సీట్లు: మొత్తం 33 రెగ్యులర్ సీట్లు ఉన్నాయి. వెటర్నరీ సైన్స్ విభాగాల్లో 16, యానిమల్ సైన్స్ విభాగాల్లో 13, యానిమల్ బయోటెక్నాలజీ విభాగాల్లో 4 సీట్లు ఉన్నాయి. యానిమల్ హజ్‌బెండ్రీ విభాగంలో ఇన్ సర్వీస్ అభ్యర్థుల కోసం అదనంగా 10 సీట్లు కేటాయించారు.

వెటర్నరీ సైన్స్ విభాగాలు: వెటర్నరీ అనాటమీ, వెటర్నరీ గైనకాలజీ, వెటర్నరీ పారాసిటాలజీ, వెటర్నరీ మెడిసిన్, వెటర్నరీ ఫార్మకాలజీ అండ్ టాక్సికాలజీ, వెటర్నరీ పాథాలజీ, వెటర్నరీ మైక్రోబయాలజీ, వెటర్నరీ సర్జరీ అండ్ రేడియాలజీ, వెటర్నరీ పబ్లిక్ హెల్త్ అండ్ ఎపిడిమియాలజీ

యానిమల్ సైన్స్ విభాగాలు: యానిమల్ జెనెటిక్స్ అండ్ బ్రీడింగ్, యానిమల్ న్యూట్రిషన్, వెటర్నరీ సైకాలజీ, లైవ్‌స్టాక్ ప్రొడక్షన్ మేనేజ్‌మెంట్, వెటర్నరీ అండ్ యానిమల్ హజ్‌బెండ్రీ ఎడ్యుకేషన్, లైవ్‌స్టాక్ ప్రొడక్ట్స్ టెక్నాలజీ, పౌల్ట్రీ సైన్స్

యానిమల్ బయోటెక్నాలజీ విభాగాలు: వెటర్నరీ బయోకెమిస్ట్రీ, వెటర్నరీ బయోటెక్నాలజీ

అర్హత: ఐకార్/వీసీఐ గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి సంబంధిత సబ్జెక్టులతో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. పది పాయింట్ల స్కేల్ మీద కనీసం 6 ఓజీపీఏ తప్పనిసరి. రెగ్యులర్ అభ్యర్థుల వయసు 2023 జూలై 1 నాటికి 40 ఏళ్లు; ఇన్ సర్వీస్ అభ్యర్థులకు 45 ఏళ్లు మించకూడదు.

ఎంపిక: సంబంధిత విభాగంలో ఐకార్-ఏఐఈఈఏ(పీజీ) 2023 ర్యాంక్ ఆధారంగా ఎంపిక చేసిన అభ్యర్థులకు కౌన్సెలింగ్ నిర్వహించి ప్రవేశాలు కల్పిస్తారు.

పీహెచ్‌డీ

సీట్లు: మొత్తం 9 సీట్లు ఉన్నాయి. వెటర్నరీ పారాసిటాలజీ, వెటర్నరీ పాథాలజీ, యానిమల్ జెనెటిక్స్ అండ్ బ్రీడింగ్, లైవ్‌స్టాక్ ప్రొడక్షన్ మేనేజ్‌మెంట్, పౌల్ట్రీ సైన్స్, వెటర్నరీ మెడిసిన్, వెటర్నరీ సర్జరీ అండ్ రేడియాలజీల్లో ఒక్కోదానిలో ఒక సీటు; వెటర్నరీ న్యూట్రిషన్‌లో 2 సీట్లు ఉన్నాయి.

అర్హత: పీవీఎన్ఆర్‌టీవీయూ/ఎస్‌వీవీయూ/పీఏయూ/అంగ్రావు నుంచి లేదా ఐకార్ గుర్తింపు పొందిన యూనివర్సిటీల నుంచి మాస్టర్ ఆఫ్ వెటర్నరీ సైన్స్ లేదా తత్సమాన కోర్సు పూర్తిచేసి ఉండాలి. కనీసం 70 శాతం మార్కులు తప్పనిసరి. డిగ్రీ స్థాయిలో బీవీఎస్సీ/బీవీఎస్సీ అండ్ యానిమల్ హజ్‌బెండ్రీ చదివి ఉండాలి. అభ్యర్థుల వయసు 2023 జూలై 1 నాటికి 50 ఏళ్లు మించకూడదు.

ఎంపిక: ఐకార్-ఏఐసీఈ జేఆర్ఎఫ్/ఎస్ఆర్ఎఫ్(పీహెచ్‌డీ) 2023 ర్యాంక్ ఆధారంగా ఎంపిక చేసిన అభ్యర్థులకు కౌన్సెలింగ్ నిర్వహించి అడ్మిషన్స్ ఇస్తారు.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1600; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.800
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 30
- **కౌన్సెలింగ్:** జూన్ 5
- **ప్రోగ్రామ్ రిజిస్ట్రేషన్:** జూన్ 6
- **వెబ్‌సైట్:** tsvu.edu.in

ఐఐఎస్సీలో బీటెక్

(మేథమెటిక్స్ అండ్ కంప్యూటింగ్)

బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్(ఐఐఎస్సీ)- బీటెక్(మేథమెటిక్స్ అండ్ కంప్యూటింగ్) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. ఎనిమిది సెమిస్టర్లు ఉంటాయి. ప్రోగ్రామ్‌లో భాగంగా కోర్ కోర్సులు, సాఫ్ట్ కోర్ కోర్సులు, ఎలక్టివ్ కోర్సులు, ప్రాజెక్ట్ వర్క్‌లు ఉంటాయి. ఈ ప్రోగ్రామ్‌లో మొత్తం 52 సీట్లు ఉన్నాయి. అభ్యర్థులు మరో ఏడాది చదివి ఎంటెక్ డిగ్రీ పొందే వీలుంది. హాస్టల్ సౌకర్యం ఉంది. ఈ ప్రోగ్రామ్ పూర్తిచేసిన అభ్యర్థులు ఐటీ, డేటా అనలిటిక్స్, ఫిన్‌టెక్ సంస్థల్లో ప్లేస్‌మెంట్స్ పొందవచ్చు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. 2024 జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో అర్హత తప్పనిసరి.

ఎంపిక: 2024 జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో సాధించిన ర్యాంక్ ఆధారంగా కౌన్సెలింగ్ నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

ముఖ్య సమాచారం
- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.500; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.250
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 17
- **కౌన్సెలింగ్:** జూలై 5
- **వెబ్‌సైట్:** btechug.iisc.ac.in/MathandComputing/

INDIAN INSTITUTE OF SCIENCE
भारतीय विज्ञान संस्थान

లిటిల్స్

ఉప్పు కషాయం!

ఒక ఊరిలో ఓ ఆసామి ఉండేవాడు. డబ్బున్నవాడు. ఆయనకు కొడుకు, కూతురు ఉండేవారు. కొడుక్కు పెళ్లి సంబంధాలు చూశాడు. ధనికులైన అమ్మాయి వద్దనుకున్నాడు. అందుకే తన కొడుకు సాధారణ మధ్యతరగతి అమ్మాయిని కోడలి పిల్లగా తెచ్చుకున్నాడు. కోడలు కనీసం ఇంట్లో పనులైనా చేస్తుందని.



ఆసామి భార్య, కూతురు ఎప్పటినుంచో ఉన్నారు కాబట్టి వారిద్దరి ఆలోచనలు. పరాయి ఇంటినుంచి వచ్చిన కోడలికి ప్రతిదీ వింత సమస్యగా ఉండేది. ఏ పని చేయాలో అర్థం అయ్యేది కాదు. 'ఈ ఇంటి పని ఎప్పుడు అర్థం చేసుకుంటావో' అని నసిగేవాళ్లు. కొడుకు మాత్రం 'ముగ్గురు ఒకేచోట ఉంటే ఇంతే' అని అనుకునేవాడు. ఆ ఇంట్లో అంతా అవకతవకల పని ఉండేది. దీంతో ఆసామికి కోపమొచ్చేది. అయితే పూర్వకాలంలో పిల్లలు విడిగా ఉండటం నేరంగా భావించేవారు కాబట్టి తన కొడుకు అక్కడే ఉండిపోయాడు.


ఒకరోజు ఆసామి ఇంటికి కోడలు పిల్ల తండ్రి వచ్చాడు. మర్యాదలు చేశారు. అత్త మాత్రం నీళ్లకోసం బయటకు వెళుతూ 'ఎప్పటిలానే మర్చిపోవద్దు. ఆ కూరలో ఉప్పేయటం మర్చిపోవద్దు' అన్నది. అలానే అత్తయ్య అన్నది కోడలు. ఆసామి కూతురు మాత్రం గేదెల పాకలోకి పనిమీద వెళ్లింది. అక్కడ పిడకలు కొట్టింది. వేగంగా వచ్చి 'ఈ పిల్ల ఉప్పేసిందో లేదో'నని గుప్పెడు ఉప్పు వేసింది. ఆమె పనిలోకి వెళ్లిపోయింది మళ్లీ. 'అసలే మనకు ఇబ్బందులు. ఆ ఉప్పు మర్చిపోరాదని ఉప్పు వేసింది. ఆహా మంచి పని చేశా' అనుకుంది కోడలుపిల్ల.

ఆ తర్వాత బయటికి నీళ్లకోసం వెళ్లిన అత్త పొయ్యిని చూసింది. పప్పు ఉడుకుతోంది. ఉప్పు వేసేవారు లేరని ఉప్పేసింది. ఆ తర్వాత పప్పు చేశారు. ఆసామి అతిథిని పిలిచాడు. ఇద్దరూ కూర్చున్నారు. వెంటనే కోడలు పిల్ల తండ్రి రుచి చూస్తూనే 'ఉప్పు వేయలేదే' అన్నాడు. 'నేను వేశా ఉప్పు' అంటూ ముగ్గురూ అన్నారు. ఆసామి రుచి చూశాడు. ఇది ఉప్పు కాషాయం అని గట్టిగా అరిచాడు. ఎవరి పనులు వాళ్లు చేయాలి. మీ ముగ్గురి మధ్య స్నేహం లేదు. ముందు అది చూసుకోండి. పని విభజించుకోండి అని గట్టిగా అరిచాడు. ఆ తర్వాత తప్పు జరగలేదు.

సరైన నీడ ఏది?



10 తేడాలు గుర్తించండి



దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 311

		9		7				4
		5	6		3	2		
	3			9	5			
7				8	1		5	
	9						4	
	2		9	6				1
			8	5			1	
		7	1		2	8		
1				3		4		

సుడోకు - 310 సమాధానం

4	8	5	6	9	7	1	2	3
7	9	6	3	2	1	5	8	4
1	3	2	5	4	8	9	7	6
6	7	3	4	1	2	8	9	5
8	4	1	9	6	5	7	3	2
5	2	9	8	7	3	6	4	1
9	5	8	1	3	4	2	6	7
2	6	4	7	5	9	3	1	8
3	1	7	2	8	6	4	5	9

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.